'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12 వెల: ₹ 5.00

సంపుటి: 13
సంచిక: 10

గురువారం 2-4-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

శ్రీ సీతారాముల కల్యాణం టీవీలో చూతము రారండి

నేడు శ్రీరామ నవమి -2లో

కమ్ముకున్న కరోనా

పాజిటివ్ 30

మరణాలు.. మూడు

బుధవారం ఒక్కరోజే భారీగా కేసులు

- రాష్ట్రంలో 9కి చేరిన మరణాలు
- 127కు చేరిన కేసుల సంఖ్య
- మర్కజ్ నుంచి వచ్చినవారు, వారి కుటుంబ సభ్యులకే కరోనా
- మృతులంతా మర్కజ్ నుంచి వచ్చినవారే
- మర్కజ్‌కు వెళ్లి వచ్చినవారు తక్షణమే పరీక్షలు చేయించుకోండి : సీఎం కేసీఆర్ పిలుపు
- కరోనా నియంత్రణ చర్యలపై సుదీర్ఘ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రం నుంచి ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్‌కి వెళ్లొచ్చినవారికి, వారివల్ల వారి కుటుంబ సభ్యులకు మాత్రమే తెలంగాణలో కొత్తగా వైరస్ సోకుతున్నట్లు వైద్య పరీక్షల్లో తేలింది. బుధవారం జరిపిన పరీక్షల్లో 30 మందికి పాజిటివ్ అని వెల్లడైంది. దీంతో రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య 127కి చేరింది. కరోనా కారణంగా బుధవారం గాంధీ ఆసుపత్రిలో ఇద్దరు, యశోదా ఆసుపత్రిలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటి వరకు తెలంగాణలో ఈ వైరస్ వల్ల మరణించిన వారి సంఖ్య 9కి చేరింది. బుధవారం వైరస్ సోకినట్లు నిర్ధారణ అయిన 30 మంది, చనిపోయిన ముగ్గురు కూడా మర్కజ్ కు వెళ్లి వచ్చిన వారిగానే తేలింది. గతంలో మరణించిన ఆరుగురు కూడా మర్కజ్ కు వెళ్లి వచ్చినవారే'అని రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం బుధవారం అర్ధరాత్రి ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తి, రోగులకు అందుతున్న చికిత్స, వైద్యసిబ్బంది భద్రతకు తీసుకుంటున్న చర్యలు, లాక్‌డౌన్ అమలు తదితర అంశాలపై సీఎం కేసీఆర్ బుధవారం ప్రగతిభవన్ లో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 12 గంటల వరకు ఉన్నతాధికారులతో విస్తృత సమీక్ష నిర్వహించారు. అనంతరం సీఎంఓ ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

మరో 300 మందికి పరీక్షలు.. 'మొదట్లో విదేశాల నుంచి వచ్చినవారిలో కొంతమందికి, వారి ద్వారామరికొంత మందికి వైరస్ సోకింది. వారంతా క్రమంగా కోలుకుంటున్నారు. వారిలో చాలా మంది డిశ్చార్జి కూడా అయ్యారు. అలాంటివారిలో ఎవరి పరిస్థితి కూడా ఆందోళనకరంగా లేదు. ఎవరూ చనిపోలేదు. అయితే గత కొద్ది

మిగతా 2వ పేజీలో ▶

వెయ్యి మంది 10 వేల మందితో..
ఆ పది వేల మంది ఎందరితో కాంటాక్ట్?

ఢిల్లీ వెళ్లొచ్చిన వారిలో అన్ని జిల్లాల వారు..

నిఘా బృందాలకు సవాల్‌గా బాధితుల గుర్తింపు

వైరస్ జన సమూహంలోకి వెళ్లిందా?..

ఆందోళనలో అధికారులు

రెడ్‌జోన్లు ప్రకటించి, అనుమానితులకు పరీక్షలు చేయడమే పరిష్కారమా?

ఉద్యోగి ఢిల్లీ ప్రార్థనల్లో పాల్గొని వారం పది రోజులు విధులు నిర్వహించారు. అతను ఈ 10 రోజుల్లో వంద మందితో కాంటాక్ట్ అయినట్టు అంచనా. అయితే, అతడికి నెగెటివ్ రావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. లేకుంటే సెక్రటేరియట్‌లో చాలామంది ఐసోలేషన్‌కు, పరీక్షలకు వెళ్లాల్సి వచ్చేది.

పది వేల మంది ఎంతమందిని కలిశారో?

మొన్నటివరకు 8 జిల్లాలకే పరిమితమైన కరోనా ఇప్పుడు అన్ని జిల్లాలకూ వ్యాపించే ప్రమాదం నెలకొంది. ఢిల్లీ ప్రార్థనల్లో పాల్గొన్న బృందంలో అన్ని జిల్లాలకు చెందినవారు ఉండటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. వారి ద్వారా నేరుగా కాంటాక్టయిన వారి కుటుంబ సభ్యులు, స్నేహితులను కలిపితే పది వేల మందికి పైగా

మిగతా 2వ పేజీలో ▶

గాంధీలో వైద్యులపై దాడి

బాత్‌రూమ్‌లో జారిపడి కరోనా బాధితుడి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మృతుడి బంధువుల ఆగ్రహం
- జూనియర్ డాక్టర్లపై దాడి.. కిటికీలు, ఫర్నిచర్ ధ్వంసం
- ఆస్పత్రికి చేరుకుని పరిస్థితి సమీక్షించిన సీపీ అంజనీకుమార్
- నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వారికీ కరోనా పాజిటివ్ కావడంతో ఛాతీ ఆస్పత్రికి తరలింపు
- దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తాం: మంత్రి ఈటల

సాక్షి, హైదరాబాద్/గాంధీ ఆస్పత్రి: గాంధీ ఆస్పత్రిలో బుధవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. కరోనా బాధితుడి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ అతడి బంధువులు డ్యూటీలో ఉన్న జూనియర్ డాక్టర్లపై దాడికి దిగారు. కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. అడ్డుకోబోయిన సెక్యూరిటీ సిబ్బందిపైనా దాడి చేశారు. అతడు బాత్‌రూమ్‌లో జారి పడటం వల్లే మృతిచెందాడని తాము చెప్పినప్పటికీ వారు వినకుండా దాడికి దిగారని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. కాగా, మృతుడితోపాటు దాడి చేసిన వారికి కూడా కరోనా పాజిటివ్ నిర్ధారణ అయినట్లు తెలిసింది. అనంతరం దాడికి దిగిన వారిని ఎర్రగడ్డ ఛాతీ ఆస్పత్రికి తరలించారు.

అసలేమైందంటే?: మర్కజ్ నుంచి వచ్చిన హైదరాబాద్ కుత్బుల్లాపూర్‌కు చెందిన వ్యక్తి (56)ని కరోనా లక్షణాలతో బాధపడుతుండటంతో చికిత్స కోసం

మిగతా 3వ పేజీలో ▶

'కరోనా'ఎఫెక్ట్..

నాడి పట్టేదెవరు?

కరోనా వ్యాప్తిని అరికట్టే క్రమంలో అన్ని క్లినిక్‌లు, ఫస్ట్ ఎయిడ్, డయాగ్నస్టిక్ కేంద్రాలను తక్షణమే మూసివేయాలి. ఎలాంటి ఓపీ సేవలకు అనుమతి లేదు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

మార్చి 27న రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ జారీచేసిన ఆదేశాలివీ

సాక్షి, హైదరాబాద్

- క్లినిక్స్, డయాగ్నస్టిక్ సెంటర్లు మూత
- ముందుజాగ్రత్త పేరుతో ఆదేశాల జారీ
- సామాన్యులకు అందని వైద్యసేవలు
- పలు జిల్లాల్లో ఇదే పరిస్థితి.. పేదల ఇక్కట్లు

అత్యవసర వైద్య సేవలందించే వైద్యులు, సిబ్బందికి కరోనా వైరస్ సోకకూడదనే కారణంతో క్లినిక్‌లు, వ్యాధి నిర్ధారణ, డయాగ్నస్టిక్ కేంద్రాలను మూసివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో అత్యవసర వైద్య సేవలు బంద్ అయ్యాయి. క్లినిక్‌లు, సీజనల్ వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలున్న వారికి సేవలందించే ప్రథమ చికిత్స కేంద్రాలు పనిచేయడం లేదు. ఇందుకు సంబంధించి రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేయగా, మిగతాచోట్ల కూడా ఇదే తరహాలో క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లను మూసివేయాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కరోనా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. బాధితుల సంఖ్య పెరుగుతోంది. అయితే అత్యవసర వైద్య సేవలందించే క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ కేంద్రాల మూసివేతతో అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి కొత్త సమస్యలు వచ్చిపడుతున్నాయి. సాధారణంగా చిన్నచిన్న అనారోగ్య సమస్యలు తలెత్తితే సమీపంలోని క్లినిక్‌లు చికిత్స అందించేవి. ప్రమాదాల

మిగతా 2వ పేజీలో ▶

సెట్స్ దరఖాస్తుల గడువు పొడిగింపు

- లాక్‌డౌన్ నేపథ్యంలో ఈనెల 20 వరకు పొడిగించిన ఉన్నత విద్యామండలి
- ఈసెట్, ఎంసెట్ పరీక్షలు వాయిదా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వివిధ వృత్తి, సాంకేతిక విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించాల్సిన ఉమ్మడి ప్రవేశ పరీక్షల దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 20 వరకు ఉన్నత విద్యామండలి పొడిగించింది. లాక్‌డౌన్ ఈనెల 15 వరకు ఉన్న నేపథ్యంలో గడువు పొడిగించినట్టు మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. ఎంసెట్, ఈసెట్, పీజీఈసెట్, పీఈసెట్, లాసెట్, పీజీలాసెట్, ఎడ్‌సెట్ దరఖాస్తుల గడువును పొడిగించినట్లు పేర్కొన్నారు. ఐసెట్ దరఖాస్తుల స్వీకరణ గడువు మాత్రం ఈనెల 30 వరకు ఉంది. ఇక మే 2న నిర్వహించాల్సిన ఈసెట్, 4, 5, 7, 9, 11 తేదీల్లో నిర్వహించాల్సిన ఎంసెట్ పరీక్షలు వాయిదా పడనున్నాయి.

ఎంసెట్ దరఖాస్తుల షెడ్యూల్:

ఏప్రిల్ 20: ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తుల స్వీకరణకు చివరి గడువు
ఏప్రిల్ 22: రూ.500 ఫైన్‌తో దరఖాస్తుల స్వీకరణ
ఏప్రిల్ 24: రూ.1,000 ఫైన్‌తో దరఖాస్తుల స్వీకరణ
ఏప్రిల్ 24 – మే 1: హాల్‌టికెట్ల డౌన్‌లోడ్
ఏప్రిల్ 27: రూ.5,000 ఫైన్‌తో దరఖాస్తుల స్వీకరణ
ఏప్రిల్ 29: రూ.10 వేల ఆలస్య రుసుముతో దరఖాస్తుల స్వీకరణ

2 కీలకం

వారాలు

కట్టుదిట్టంగా లాక్‌డౌన్ అమలే ఏకైక ఆయుధం

సాక్షి, హైదరాబాద్

బ్రేక్ ది చైన్.. గత పది రోజులుగా విస్తృతంగా వినిపిస్తున్న మాట ఇది. కరోనా వైరస్ ఇతరులకు సోకకుండా మనం బయటపడాలంటే కచ్చితంగా బయటకు రాకుండా ఇళ్లలోనే ఉండాలంటూ ఉద్యమం తరహాలో ఈ నినాదం వెల్లువెత్తింది. దాన్ని సాకారం చేసే దిశగా ప్రభుత్వం లాక్‌డౌన్ విధించింది. ఇంతకాలం దాని అమలు ఎలా ఉందో పక్కనపెడితే ఇకపై లాక్‌డౌన్‌ను కచ్చితంగా అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలో రానున్న రెండు వారాలు అత్యంత కీలకం కానున్నాయి. రాష్ట్రం కరోనా హస్తాల్లో చిక్కుకొని విలవిల్లాడకుండా ఉండాలంటే తు.చ. తప్పకుండా లాక్‌డౌన్ అమలు కావాల్సిందే. కరోనా వైరస్‌ను తరిమికొట్టాలంటే ఇప్పుడు మన చేతిలో ఉన్న ఏకైక ఆయుధం ఇదొక్కటే. పది రోజుల క్రితం లాక్‌డౌన్‌ను అమలులోకి తెచ్చినప్పటి నుంచి ప్రధాని మోదీ సహా ముఖ్యమంత్రి కేసీఆర్ వినమ్రంగా పలుమార్లు ఇదే విషయాన్ని జనం ముందుంచారు. అంతర్జాతీయ నిపుణులు, వైద్యులు పదేపదే చెబుతూ వచ్చారు. కానీ ఆ మాటలను ప్రజలు పెద్దగా లెక్క చేయకుండా రకరకాల కారణాలతో రోడ్లపైకి వచ్చి లాక్‌డౌన్‌ను అపహాస్యం చేశారు. కానీ ఇప్పుడు పరిస్థితి వేరు. వచ్చే రెండు వారాలు లాక్‌డౌన్ స్ఫూర్తిని స్వచ్ఛందంగా అమలు చేయకుంటే ఇక పరిస్థితి చేయిదాటిపోవడం ఖాయమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీన్ని ప్రజలు తీవ్రంగా పరిగణించి స్వచ్ఛందంగా ఇళ్లకే పరిమితమైతే వైరస్ వ్యాప్తిని కట్టడి చేసే అవకాశం ఉంటుందని లేకపోతే కరోనాను అదుపు చేయలేక విలవిల్లాడాల్సి వస్తుందంటున్నారు. వెరసి వచ్చే రెండు వారాలను సువర్ణావకాశంగా అభివర్ణిస్తున్నారు. కరోనా కోరల్లో చిక్కుకోవాలో లేక మహమ్మారిని తరిమికొట్టాలో అన్నది ఇప్పుడు ప్రజల చేతుల్లోనే ఉంది.

లేకపోతే వైరస్‌ను కట్టడి చేయలేమంటున్న నిపుణులు

పరిస్థితి చేజారితే కరోనా కోరలు చాచినట్లే

ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సిన తరుణమిదే

'నిజాముద్దీన్' లింక్ బయటపడ్డా మారని జనం

బుధవారం హైదరాబాద్, పట్టణాల్లో రద్దీగానే రోడ్లు

నిజాముద్దీన్ ఉదంతంతో కలకలం...

విదేశాల నుంచి రాష్ట్రానికి వచ్చిన వారి క్వారంటైన్ గడువు మరో 4 రోజుల్లో ముగియనుండటంతో ఇక కరోనా వైరస్ ప్రభావం నుంచి మనం తప్పించుకున్నట్లేనని అధికారులు ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో 'నిజాముద్దీన్' ఉదంతం పరిస్థితిని ఒక్కసారిగా తీవ్ర ఆందోళనకరంగా మార్చేసింది. వెయ్యి మందికిపైగా తెలంగాణవాసులు ఈ సమావేశానికి హాజరై స్వస్థలాలకు వెళ్లి జనం మధ్య తిరగడంతో కరోనా వైరస్ పాజిటివ్ కేసుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది.

మారని ప్రజల తీరు...

నిజాముద్దీన్ ప్రార్థనల రూపంలో కరోనా వైరస్ మన మధ్యకు తీవ్రంగా చొచ్చుకొచ్చిందన్న వార్తలు వెలువడ్డ రోజే

మిగతా 3వ పేజీలో ▶

సింగరేణి భూగర్భ గనులు మూసివేత

- సింగరేణిలో 22 గనులకు లే ఆఫ్
- ఐదు యాంత్రీకరణ గనులు.. 18 ఓసీపీలు యథాతథం
- 21,937 మందికి సగం వేతనం
- 18 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

సాక్షి, హైదరాబాద్/ పెద్దపల్లి

కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో భూగర్భ గనులకు లే ఆఫ్ ప్రకటిస్తూ సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెండో షిఫ్టు నుంచి మూసేయాలని బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థ వ్యాప్తంగా 27 భూగర్భ గనులు, 18 ఓసీపీలు కొనసాగుతున్నాయి. ఇందులో పూర్తిస్థాయి యాంత్రీకరణతో సాగుతున్న ఐదు భూగర్భ గనులు, 18 ఓసీపీల్లో యథావిధిగా ఉత్పత్తి చేయనున్నారు. ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ వ్యాప్తి నిరోధించడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కఠిన చర్యలకు పూనుకున్నాయి. మార్చి 22న కేంద్ర ప్రభుత్వం జనతా కర్ఫ్యూ విధించింది. అనంతరం ఏప్రిల్ 14వ తేదీ వరకు దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలవుతోంది. భౌతిక దూరం పాటించడంతోనే వైరస్ వ్యాప్తిని అరికట్టడం సాధ్యం కావడంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు లాక్ డౌన్‌ను కఠినంగా అమలు చేస్తున్నాయి. ఇదే సమయంలో సింగరేణి భూగర్భ బొగ్గు గనుల్లో కార్మికులు యథావిధిగా విధులు నిర్వహించడం పట్ల పలు కార్మిక సంఘాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఒకేసారి పెద్ద మొత్తంలో పని స్థలాల్లో గుమిగూడాల్సి వస్తుండటంతో కార్మికుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల ఢిల్లీకి వెళ్లి వచ్చిన వారిలో ఇద్దరు సింగరేణి కార్మికులు ఉన్నట్లు ప్రచారం జరగడం.. వారు విధులకు హాజరైనట్లు తెలియడంతో మరింత గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో పూర్తి స్థాయి యాంత్రీకరణ గనులు, ఓసీపీలను

మిగతా 2వ పేజీలో ▶

అధైర్య పడొద్దు

- లక్షణాలు కనిపిస్తే ముందుకొచ్చి పరీక్షలు చేయించుకోండి
- ఏపీ సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి
- ఢిల్లీ సదస్సుకు వెళ్లిన వారికి కరోనా వైరస్ సోకిందని వెల్లడి

ఏపీలో పాజిటివ్ కేసులు

111

బుధవారం ఒక్కరోజే కొత్తగా 67 నమోదు

- వివరాలు 2లో

వైద్య, పోలీసు సిబ్బందికి పూర్తి వేతనం

ఇంటెన్సివ్ కూడా... సీఎం నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి విశేష కృషి జరుపుతున్న వైద్య ఆరోగ్య, పోలీసు సిబ్బందికి మార్చి నెల పూర్తి వేతనం చెల్లించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ 2 శాఖల ఉద్యోగులకు అదనపు నగదు ప్రోత్సాహం (ఇన్సెంటివ్) కూడా ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ ఇన్సెంటివ్‌ను ఒకటి రెండు రోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది. ప్రగతిభవన్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షలో సీఎం కేసీఆర్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

8.65 లక్షలు ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య

43,082 ప్రపంచవ్యాప్తంగా కరోనా మృతులు

'తబ్లిగి జమాత్'తో పెరిగిన కేసులు

8 లో

epaper.sakshi.com

వైద్యుల రక్షణకు ఏ చర్యలు తీసుకున్నారు?

వివరించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కరోనా వైరస్ సోకిన వారికి వైద్యం అందించే వైద్యులు, ఇతర సిబ్బందికి ఎలాంటి వైద్య రక్షణ చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎం.ఎస్. రామచంద్రరావు, జస్టిస్ కె.లక్ష్మణ్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కరోనా వైరస్ సోకిన వారికి వైద్యం అందించే వారందరికీ వ్యక్తిగత రక్షణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు జరిగేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది ఆర్.సమీర్ అహ్మద్ ఈ-మెయిల్ ద్వారా హైకోర్టుకు రాసిన లేఖను ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా ధర్మాసనం పరిగణించి విచారణ జరిపింది. న్యాయమూర్తులు తమ ఇళ్ల వద్ద నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిల్‌ను విచారించారు. కరోనా వైరస్ నివారణకు వైద్యం అందించే వారికి కల్పిస్తున్న రక్షణ చర్యలు తెలియజేయాలని అడ్వొకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్‌ను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 6కి వాయిదా వేసింది. 'వైద్యులు, ఆశ వర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు, పోలీస్, రెవెన్యూ, గ్రామ పంచాయతీ ఇతర శాఖల సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టి విధుల్ని నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఒత్తిడి కారణంగా విధి లేని పరిస్థితుల్లో విధులకు హాజరవుతున్నట్లు ఓ వైద్యుడు చెప్పారు. ఇలాంటి వారందరి రక్షణలో భాగంగా మాస్కులు, గ్లౌజులు, గౌన్లు, షూస్, టోపీలు, కళ్లద్దాలు, ముఖ రక్షణకు సంబంధించినవి ప్రభుత్వం అందజేసేలా ఉత్తర్వులివ్వాలి. అలాగే విదేశాల నుంచి మన రాష్ట్రానికి వచ్చిన వాళ్ల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించాలి. క్వారంటైన్ తరలింపు వల్ల వచ్చే ఆరోగ్య ప్రయోజనాల్ని వాళ్లకు తెలియజేసేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులకు ఆదేశాలివ్వాలి' అని లేఖలో పేర్కొన్నారు.

కరోనాపై యుద్ధంలో ముందుండి పోరాడుతున్న వీరులు వారు..

కానీ వారికే రక్షణ కరువైన పరిస్థితులు నెలకొన్నాయి.. దానికి నిదర్శనమే ఈ దృశ్యం.. కొన్ని చోట్ల సరైన వ్యక్తిగత రక్షణపరికరాలు లేక.. రెయిన్‌కోట్లు, హెల్మెట్లు పెట్టుకుని పని చేయాల్సిన దుస్థితి నెలకొంది.. ఈ చిత్రాలు కోల్‌కతాలోని ఓ ఆస్పత్రిలోనివి.. పీపీఈ (వ్యక్తిగత రక్షణ సామగ్రి)లు లేక.. తమకు ఇవి ఇచ్చారని.. వీటి పరిస్థితి కూడా చాలా దారుణంగా ఉందంటూ కొందరు జూనియర్ డాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు దేశంలో వైద్యుల వ్యక్తిగత రక్షణపరికరాల కొరత తీవ్రంగా ఉంది.. దక్షిణకొరియా, చైనా నుంచి భారీ స్థాయిలో వీటి కొనుగోలుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

పీపీఈ అంటే ఏమిటి?

పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్..



సాక్షి, సెంట్రల్‌డెస్క్

ఇవి ఎందుకు కీలకం?

వైరస్‌లు, బ్యాక్టీరియాలు కలిగిన పదార్థాలు లేదా ద్రవాల నుంచి చర్మం, నోరు, ముక్కు, కళ్లను కాపాడతాయి.



కమ్ముకున్న కరోనా

▶ మొదటి పేజీ తరువాయి

అవుతారనే అంచనా ఉంది. వైద్య, ఆరోగ్యశాఖ మాత్రం ఢిల్లీ వెళ్లొచ్చిన వారిలో కొందరు మినహా మిగిలిన వారిని గుర్తించింది. కానీ వారి కుటుంబ సభ్యులు, స్నేహితులను గుర్తించి వారిలో ఏవైనా కరోనా అనుమానిత లక్షణాలున్నాయో లేదో మాత్రం తెలుసుకోలేకపోతోంది. ఈ పదివేల మంది ఇంకెంత మందితో కాంటాక్ట్ అయ్యారన్నది ఇప్పుడు సమాధానం లేని ప్రశ్నగా మారింది. దీనిని బట్టి రాష్ట్రవ్యాప్తంగా వైరస్ జనసమూహంలోకి వెళ్లినట్టేనని కరోనా వైరస్‌ను పర్యవేక్షించే ఉన్నతస్థాయి కమిటీలోని సభ్యుడొకరు వ్యాఖ్యానించారు. 'ఇప్పుడు కాదు. లాక్‌డౌన్ ప్రకటించే నాటికే వైరస్ జన సమూహంలోకి వెళ్లిపోయింది. అందుకే ప్రధాని మోదీ లాక్‌డౌన్ ప్రకటించారు. ఈ విషయంలో మీకేమైనా అనుమానం ఉందా?' అని ఆయన ఎదురు ప్రశ్నించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారికంగా ప్రకటించకపోయినా, రాష్ట్రంలో కరోనా వైరస్ మూడో దశలోకి వెళ్లినట్టేనని ఆయన వ్యాఖ్యల్ని బట్టి భావించాలి. కొన్ని ప్రొటోకాల్స్ ప్రకారం ఇటువంటివి ప్రకటించలేమని ఆయన తెలిపారు.

నిఘా బృందాలకు సవాల్

ఒకరు మరొకరితో.. మరొకరు మరికొందరితో.. మరికొందరు పలువురితో.. పలువురు వేలాది మందితో.. ఇలా కరోనా పాజిటివ్ వ్యక్తులు పరోక్షంగా కాంటాక్ట్ అయ్యారని తేలింది. ఇటీవల ముఖ్యమంత్రి చెప్పిన ప్రకారం దక్షిణకొరియాలో ఒక వ్యక్తి ద్వారా ఏకంగా 50 వేల మందికిపైగా వైరస్ వ్యాపించిందంటే, ఇప్పుడు వెయ్యి మంది ఢిల్లీ నుంచి రావడం, వారంతా వివిధచోట్లకు తిరగడం, రోజువారీ కార్యకలాపాల్లో పాల్గొనడం, అందులో ఆరుగురు చనిపోవడం తెలిసిందే. జన బాహుళ్యంలోకి వెళ్లిన వారిని ఎలా గుర్తించాలన్నది ఇప్పుడు నిఘా బృందాలకు సవాల్‌గా మారింది. ఉదాహరణకు ఢిల్లీ వెళ్లొచ్చని వ్యక్తికి చెందిన కుటుంబాన్ని, వారి స్నేహితులను, బంధువులను గుర్తించవచ్చు. కానీ వీరంతా ఎక్కడెక్కడికి వెళ్లారు? ఎవరెవరిని కలిశారన్నది గుర్తించడం మాత్రం కష్టమే. 'బహుళ సమూహంలోకి వైరస్ వ్యాపించింది. ఎవరెవరు ఎందరిని కలిశారో గుర్తించడం సవాలే'అని ఒక నిఘా అధికారి వ్యాఖ్యానించారు. దీంతో ఏంచేయాలన్న దానిపై వైద్య, ఆరోగ్యశాఖ వర్గాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. కొందరైతే మానసిక ఆందోళనకు గురవుతున్నారు.

రెడ్‌జోన్ల ఏర్పాటే పరిష్కారం?

ఇప్పటివరకు నమోదైన పాజిటివ్ కేసులు, వారి బంధువులు, వారి స్నేహితులు, వారి ద్వారా కాంటాక్ట్ అయినవారిని గుర్తించడం కష్టమని నిఘా బృందాలు చెబుతున్న నేపథ్యంలో.. కొందరు వైద్య నిపుణులు కీలక సూచనలు చేస్తున్నారు. వాస్తవంగా మొదట్లో ఎవరు ఎక్కడివారన్న విషయాలు తెలిసేవి. కానీ ఇప్పుడు తెలియడంలేదు. జన బాహుళ్యంలోకి వైరస్ సోకుతున్న నేపథ్యంలో వైరస్ ప్రభావిత ప్రాంతాలను రెడ్‌జోన్లుగా ప్రకటించి, ఎవరికైనా కరోనా అనుమానిత లక్షణాలుంటే ముందుకు రావాలని కోరాలని హైదరాబాద్‌కు చెందిన ఒక ప్రైవేట్ వైద్యుడు డాక్టర్ రాజు సూచించారు. ఇక మరో వైద్యుడు డాక్టర్ కమల్‌నాథ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో వైరస్ లక్షణాలున్న వారందరినీ ఆసుపత్రులకు రమ్మనాలని, అటువంటి వారిని గుర్తించాలని అన్నారు. మొదట్లో సర్కారు చెప్పినట్టు ప్రైవేటు ఆసుపత్రులకైనా వెళ్లాలని, అక్కడ లక్షణాలు బయటపడితే వైద్య ఆరోగ్యశాఖకు తెలపాలని కోరుతున్నారు.

నాడి పట్టేదెవరు?

▶ మొదటి పేజీ తరువాయి

బారినపడితే ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు తక్షణ సేవలందించేవి. ఇక, అనారోగ్య కారణాలను తెలిపేందుకు డయాగ్నస్టిక్ సెంటర్లు వివిధ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేవి. ఆయా సేవలు పొందడంలో క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్ల పాత్ర కీలకం. ప్రస్తుతం వీటిని మూసివేయడంతో సాధారణ ఆరోగ్య సేవలకు విఘాతం కలుగుతోంది. రోగానికి తగిన మందు వేసుకోకుంటే ఇతర అనారోగ్య సమస్యల్లో చిక్కుకునే ప్రమాదం ఉంది.

అత్యవసరమైతే.. ఇబ్బందే

క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ కేంద్రాల మూతతో గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోంది. లాక్‌డౌన్‌తో ప్రజలంతా ఇళ్లకే పరిమితమైనా, సీజనల్ వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తితే.. అంతే సంగతులన్నట్టు పరిస్థితి మారింది. కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ ఓపీ సేవలు అందడం లేదు. ప్రస్తుతం పేదలకు పెద్దదిక్కుగా ఉన్న గాంధీ ఆస్పత్రిని కరోనా ఆస్పత్రిగా మార్చారు. దీంతో అక్కడ రోజువారీ ఓపీ సేవలకు అవకాశం లేదు. ఉస్మానియా ఆస్పత్రిలోనూ, జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో సాధారణ వైద్యసేవలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్నపిల్లలు ఆయా అనారోగ్య కారణాలకు సకాలంలో వైద్య సేవలందక ఇబ్బందులు పడుతున్నారు.

అధైర్య పడొద్దు

- లక్షణాలు కనిపిస్తే ముందుకొచ్చి పరీక్షలు చేయించుకోండి
- ప్రజలకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: కరోనా వ్యాధి విస్తరణ చూసి అధైర్య పడవద్దని, వైరస్ నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ రాష్ట్ర ప్రజలకు భరోసా ఇచ్చారు. వైరస్‌ను కట్టడి చేయడానికి చేపడుతున్న చర్యలకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. కరోనా నివారణ, నియంత్రణ చర్యల్లో భాగంగా కొనసాగుతున్న లాక్‌డౌన్ నేపథ్యంలో బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వైరస్ లక్షణాలు ఉన్న వారిని గుర్తించడంతో పాటు, వారికి వెంటనే చికిత్స అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతమైన విధానాన్ని అవలంబిస్తోందన్నారు. 'కరోనా వైరస్ (కోవిడ్-19) ఒక జ్వరం వంటిదే. మందులు వేసుకుని, 14 రోజుల పాటు జాగ్రత్తగా స్వీయ నిర్బంధంలో ఉంటే తప్పనిసరిగా నయం అవుతుంది. ఎవరిలోనైనా వైరస్ లక్షణాలు కనిపిస్తే 104కు ఫోన్ చేస్తే వైద్యులు వచ్చి, చికిత్స చేస్తారు. అవసరమైతే ఆసుపత్రికి తరలిస్తారు. ఎలాంటి భయాందోళనకు గురికావద్దు. ప్రైవేట్ ఆసుపత్రులు, వైద్య కళాశాలలకు చెందిన వారు, వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది.. అందరూ కూడా కరోనా కట్టడి కార్యక్రమంలో భాగస్వాములై క్రియాశీల పాత్ర పోషించాలి. ఇందుకు 104కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలి. మనస్ఫూర్తిగా మీరంతా ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అని జగన్ అన్నారు. రెండు రోజులుగా రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య గణనీయంగా పెరగడం బాధ కలిగిస్తోందని.. ఢిల్లీలో జరిగిన సదస్సుకు ఇక్కడి నుంచి వెళ్లి వచ్చిన వారికి వైరస్ సోకిందని చెప్పారు. అందుకే ఢిల్లీకి వెళ్లిన వారిని, వారితో ప్రయాణించిన వారిని, వారితో కలిసిన (కాంటాక్ట్‌లో ఉన్న) ప్రతి ఒక్కరినీ గుర్తించేందుకు ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేస్తోందని వివరించారు.

సీఎం సహాయ నిధికి బిబీస్ ల్యాబొరేటరీస్ తరపున రూ. 5 కోట్ల చెక్కును మంత్రి కేటీఆర్‌కు అందజేస్తున్న ఆ సంస్థ ప్రతినిధి

ఆపన్నహస్తం

సీఎంఆర్ఎఫ్‌కు దాతల విరాళాలు..

సాక్షి, హైదరాబాద్: కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి సీఎం కె.చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అనేక మంది ప్రముఖులు తమ మద్దతు తెలుపుతున్నారు. ప్రభుత్వ ప్రయత్నాలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు బుధవారం భారీ ఎత్తున విరాళాలు అందించారు.

- అరబిందో ఫార్మా మొత్తం రూ.11 కోట్ల విలువైన నగదు, శానిటైజర్లు, మందులు విరాళంగా అందించింది. రూ.7.5 కోట్ల నగదుకు సంబంధించిన చెక్కును అరబిందో ఫార్మా వైస్ చైర్మన్ నిత్యానందరెడ్డి, డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డి సీఎంకు అందించారు. రూ.2.5 కోట్ల విలువైన శానిటైజర్లను, రూ.ఒక కోటి విలువైన మందులను అందివ్వనున్నట్లు ప్రకటించారు.

- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజనం వండే కార్మికులు మొత్తం రూ.2.65 కోట్ల విరాళం అందించనున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన కాన్సెంట్ లెటర్‌ను మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్ల హనుమాండ్లు సీఎంకు అందించారు. విరాళాలు అందించిన దాతలందరికీ సీఎం ధన్యవాదాలు తెలిపారు.

- నవభారత్ వెంచర్స్ చైర్మన్ డి.అశోక్, సీఈఓ వి.విక్రం ప్రసాద్, ఈడీ నిఖిల్ రూ.2.5 కోట్ల చెక్కును సీఎంకు అందించారు.

- గ్లాండ్ ఫార్మా ఎండీ శ్రీనివాస్ సాదు రూ.కోటి విరాళం చెక్కును సీఎంకు అందించారు.

- ఏసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ డీవీఎస్ రాజు రూ.50 లక్షల చెక్కును ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌కు అందజేశారు.

తెలంగాణకు పర్సనల్ ప్రొటెక్షన్ కిట్లు

సాక్షి, న్యూఢిల్లీ: కరోనా బాధితుల కోసం అవసరాన్ని బట్టి రాష్ట్రాలకు ఔషధాలు, పర్సనల్ ప్రొటెక్షన్ కిట్లను కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగా ఢిల్లీ నుంచి తెలంగాణకు 3 లక్షల హైడ్రాక్సీ క్లోరోక్విన్ మాత్రలు, డాక్టర్ల రక్షణ కోసం 2 వేల పర్సనల్ ప్రొటెక్షన్ కిట్లు పంపిస్తోంది. వీటికి తోడు రాష్ట్ర ప్రభుత్వం 6,000 పర్సనల్ ప్రొటెక్షన్ కిట్లను కొనుగోలు చేసినట్టు తెలంగాణ భవన్ అధికారులు తెలిపారు.

నెల వేతనాన్ని విరాళమిచ్చిన కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: కరోనా వ్యాప్తి నివారణకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి తన నెల వేతనాన్ని పీఎం కేర్స్ ఫండ్‌కు విరాళంగా ఇచ్చారు. అలాగే తన ఎంపీ లాడ్స్ నిధుల నుంచి ఒక కోటి రూపాయలను పీఎం కేర్స్ ఫండ్‌కు కేటాయించారు. అలాగే ఎంపీ లాడ్స్ నుంచి మరో రూ. 50 లక్షలను తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా హైదరాబాద్ కలెక్టర్‌కు చేరేలా కేటాయించారు.

ఏపీలో కరోనా పాజిటివ్ కేసులు 111

బుధవారం ఒక్కరోజే కొత్తగా 67 కేసులు

సాక్షి, అమరావతి: ఏపీలో మొత్తం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య బుధవారం రాత్రికి 111కు చేరుకుంది. బుధవారం ఒక్కరోజే 67 కొత్త కేసులు బయటపడ్డాయి. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. పాజిటివ్ కేసుల్లో ఎక్కువ భాగం ఢిల్లీలో మత ప్రార్థనలకు వెళ్లి వచ్చినవారేనని తెలుస్తోంది. మార్చి 14 నుంచి 22 వరకు ఢిల్లీకి వెళ్లి వచ్చిన వారిలో 80 శాతం మందికి కరోనా పాజిటివ్‌గా తేలడంతో రాష్ట్రంలో ఒక్కసారిగా కలకలం రేగడం తెలిసిందే. మన రాష్ట్రం నుంచి ఢిల్లీకి మత ప్రార్థనలకు వెళ్లిన వారిని ఇరాన్, ఇండోనేషియా నుంచి వచ్చిన వారు కలవడం వల్ల కరోనా వైరస్ వ్యాప్తి చెందిందని భావిస్తున్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 11 జిల్లాల్లో కరోనా పాజిటివ్ కేసులు వెలుగుచూశాయి. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎలాంటి కేసులు లేకపోవడం ఊరటనిస్తోంది. ఢిల్లీ నుంచి రాష్ట్రానికి తిరిగొచ్చినవారు ఎక్కడెక్కడ తిరిగారు? ఎవరిని కలిశారో తెలుసుకోవడానికి మున్సిపల్, ఆరోగ్య శాఖల తోపాటు పోలీసు అధికారులు కృషి చేస్తున్నారు.

మరో 30 పాజిటివ్

▶ మొదటి పేజీ తరువాయి

రోజులుగా తెలంగాణలో నమోదవుతున్న పాజిటివ్ కేసులన్నీ మర్కజ్‌కు వెళ్లి వచ్చిన వారివిగానే తేలాయి. దీంతో తెలంగాణ ప్రభుత్వం మర్కజ్ వెళ్లి వచ్చిన వారందరికీ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించి, వారిని గుర్తించి పరీక్షలు నిర్వహిస్తోంది. మరో 300 మందికి ఇంకా పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. మర్కజ్ వెళ్లి వచ్చినవారు, వారి కుటుంబ సభ్యులు, వారితో సన్నిహితంగా ఉన్న వారు ఇంకా ఎవరైనా వైద్య పరీక్షలు నిర్వహించుకోకుండా ఉంటే వెంటనే ఆసుపత్రికి వచ్చి పరీక్షలు నిర్వహించుకోవాలి. మర్కజ్‌కు వెళ్లి వచ్చినవారికి సోకిన వైరస్ ప్రమాదకరంగా మారుతోంది కాబట్టి, వారంతా తప్పక పరీక్షలు చేయించుకోవాలి. ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించుకోవడం వల్ల, వైరస్ సోకినట్లు తేలినా, వారి ప్రాణాలు కాపాడడానికి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తుంది. అందువల్ల మర్కజ్ వెళ్లి వచ్చిన ప్రతీఒక్కరూ తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి'అని సీఎంఓ పేర్కొంది.

ప్రజలు సహకరించాలి: కేసీఆర్

తెలంగాణలో కరోనా వ్యాప్తిని నివారించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, దీనికి ప్రజలు కూడా సహకరించాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు నిర్వహిస్తున్న లాక్‌డౌన్‌ను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. మరికొద్ది రోజులపాటు ప్రజలు సహకరిస్తే, వైరస్ వ్యాప్తిని అరికట్టవచ్చని పేర్కొన్నారు. కరోనా వైరస్ బాధితులకు వైద్యం అందిస్తున్న వైద్య సిబ్బంది భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని సీఎం వెల్లడించారు. వైద్య సిబ్బందికి అవసరమైన పీపీఈ కిట్స్, ఎన్-95 మాస్కులు, హైడ్రాక్సిక్లోరోక్విన్ మాత్రలు, అజిత్రోమైసిన్ ట్యాబ్లెట్లు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించడానికి అవసరమైన మెడికల్ కిట్స్‌ను కూడా సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

బుధవారం రాత్రి విద్యుత్ కాంతుల్లో భద్రాద్రి రామాలయం

శ్రీ సీతారాముల కల్యాణం.. టీవీలో చూతము రారండి!

నేడే శ్రీరామ నవమి

- అత్యంత నిరాడంబరంగా భద్రాద్రిలో స్వామివారి కల్యాణం
- ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం.. ఇంట్లో నుంచే భక్తుల వీక్షణ

సాక్షి, భద్రాద్రి కొత్తగూడెం/హైదరాబాద్: ఊరూరా.. వాడవాడలా కన్నుల పండువగా జరిగే శ్రీరామ నవమి వేడుకలు గురువారం అత్యంత నిరాడంబరంగా జరగనున్నాయి. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు ప్రత్యేక సూచనలు చేసింది. భక్తులు రాకుండా కేవలం అర్చకులు, దేవాదాయశాఖ అధికారులు, ఒకరిద్దరు ఆలయ ధర్మకర్తల సమక్షంలోనే ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో భక్తులు భద్రాద్రి విచ్చేసి రాములోరి కల్యాణాన్ని కనులారా వీక్షించేవారు. కానీ ఈసారి టీవీలో వచ్చే ప్రత్యక్ష ప్రసారాన్ని చూసి సరిపెట్టుకోవాల్సిందే. ఏటా మిథిలా స్టేడియంలో ఈ వేడుకలు నిర్వహించేవారు. ఈసారి ఆలయంలోని మండపంలోనే రాములవారి కల్యాణం జరగనుంది. ప్రభుత్వం ప్రతినిధులుగా దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఖమ్మం జిల్లాకు చెందిన రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌లు హాజరై స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేయనున్నారు. వేదపండితులు, అర్చకులు, పోలీసు, సాధారణ అధికారులు, ఆలయ ప్రతినిధులు దీనికి హాజరు కానున్నారు.

నేడు కల్యాణం.. రేపు పట్టాభిషేకం

శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణానికి సంబంధించి గురువారం తెల్లవారు జామున రెండు గంటలకే రామాలయం తలుపులు తెరిచి స్వామి వారికి సుప్రభాతం నిర్వహించనున్నారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు, మంగళాశాసనం జరిపి అంతరాలయంలోని ధ్రువమూర్తులకు అభిషేకం జరుపుతారు. తర్వాత ఘూలమూర్తులకు కల్యాణం జరిపిస్తారు. అనంతరం మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చరణలతో శ్రీ సీతారాముల ఉత్సవ మూర్తులను ఆలయ ప్రాంగణంలోని బేడా మండపం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై రజిత సింహాసనంపై ఆశీనులను చేస్తారు. భక్త రామదాసు చేయించిన దివ్యాభరణాలను అలంకరిస్తారు. వేదికపై ఆశీనులైన శ్రీ సీతారాములకు సంకల్పం చెప్పి సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నంలో జీలకర్ర, బెల్లం స్వామివారి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలపై ఉంచుతారు. భక్త రామదాసు చేయించిన మంగళ సూత్రాలతో మాంగల్యధారణ కార్యక్రమాన్ని చేస్తారు. అనంతరం ఎర్రని తలంబ్రాలతో వేడుక నిర్వహిస్తారు. శుక్రవారం శ్రీరామ పట్టాభిషేకం జరుగుతుంది.

అన్ని దేవాలయాల్లోనూ ఇలాగే..

భద్రాచలం శ్రీరామచంద్రస్వామి ఆలయం మొదలు మారుమూల పల్లెల్లోని దేవాలయాల వరకు కేవలం అన్నిచోట్లా ఆలయ కార్యక్రమంగానే స్వామి కల్యాణాన్ని పరిమితం చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇదే విషయాన్ని ఇప్పటికే దేవాదాయశాఖ అన్ని దేవాలయాలకు సూచించగా, తెలంగాణ విద్వత్సభ కూడా ఈ మేరకు విజ్ఞప్తి చేసింది. స్వయంగా కల్యాణంలో పాల్గొనాలనుకునే భక్తులు కార్యక్రమాన్ని ఇళ్లల్లోనే నిర్వహించుకోవాలని, ఇతరులను ఆహ్వానించవద్దని అధికారులు సూచించారు. ఈసారి పానకం, వడపప్పు అందించటం, అన్నసంతర్పణ చేయటాన్ని నిషేధించారు.

సింగరేణి భూగర్భ గనులు మూసివేత

▶ మొదటి పేజీ తరువాయి

మినహాయించి భూగర్భ గనుల్లో పనులు నిలిపివేయాలని కేంద్ర కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ డైరెక్టరేట్ మైన్స్ సేఫ్టీ ఆదేశాల మేరకు సింగరేణి యాజమాన్యం లే ఆఫ్ ప్రకటిస్తూ నిర్ణయం తీసుకుంది.

22 భూగర్భ గనుల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

సింగరేణి యాజమాన్యం నిర్ణయంతో సంస్థ వ్యాప్తంగా ఉన్న 22 భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ గనుల్లో 26,692 మంది కార్మికులు పనిచేస్తున్నారు. అత్యవసర సిబ్బంది మినహా మిగతా కార్మికులందరికీ 1947 లేబర్ యాక్ట్ ప్రకారం సగం వేతనం చెల్లించనున్నారు. కాగా, సింగరేణి లే ఆఫ్ ప్రకటించినప్పటికీ పూర్తి స్థాయి యాంత్రీకరణ ఉన్న ఐదు గనులతో పాటు 18 ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి యథావిధిగా కొనసాగనుంది. యాంత్రీకరణ ఉన్న ఐదు భూగర్భ గనులు అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు, వీకే-7, శాంతిఖని, జీడీకే-11, కొండాపూర్ ద్వారా బొగ్గు ఉత్పత్తి చేయనున్నారు. కాగా, సింగరేణి వ్యాప్తంగా ప్రతి రోజు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుండగా, 22 గనుల్లో లే ఆఫ్ మూలంగా ప్రతిరోజు 15 నుంచి 18 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోనుంది.

అందుబాటులో మాస్కులు.. శానిటైజర్లు: పర్సనల్ మేనేజర్

పనిచేసే గనులు, కార్యాలయాల వద్ద శానిటైజర్లు, మాస్కులను అందుబాటులో ఉంచినట్టు సంస్థ పర్సనల్ మేనేజర్ ఎ.ఆనందరావు ఓ ప్రకటనలో తెలిపారు. గనులు, కార్యాలయాల ఆవరణలో శానిటైజర్లను స్ప్రే చేస్తున్నామని, అత్యవసర ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. సింగరేణి కాలనీల్లో రసాయనాల పిచికారి చేస్తున్నామన్నారు. లే ఆఫ్‌లో ఉన్న ఉద్యోగులు ఆరోగ్య నియమాలను పాటిస్తూ, ఇంటివద్దనే ఉండాలని ఆయన కోరారు.

మంచి నిర్ణయం

కరోనా వైరస్ మూలంగా గనులకు లే ఆఫ్ ప్రకటించడం మంచి నిర్ణయం. వందల మంది

బుధవారం అబిడ్స్‌లో రేషన్ కోసం క్యూ...

సింగరేణి కార్మికులకూ సగం వేతనాలు

కరోనా నేపథ్యంలో యాజమాన్యం నిర్ణయం

గోదావరిఖని: కరోనా వైరస్ నేపథ్యంలో సింగరేణి కార్మికుల 50 శాతం వేతనాలను వాయిదా వేస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. సంస్థ వ్యాప్తంగా ఎస్టీపీపీ కార్మికుల్లో 60 శాతం, సింగరేణి కార్మికుల నుంచి 50 శాతం వేతనాలను వాయిదా వేస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో సంస్థలో పనిచేస్తున్న 46,021 మందికి మార్చి నెలకు సంబంధించి సగం వేతనాలే అందనున్నాయి. సుమారు రూ.130 కోట్ల కార్మికుల వేతనాలు నిలిచిపోనున్నాయి. దీంతో సింగరేణి సంస్థ వ్యాప్తంగా ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. కోలిండియాలో కార్మికులకు వేతనాలను యథావిధిగా చెల్లిస్తుండగా, సింగరేణిలో ఈ విధానం అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణిలో ప్రతి నెలా వేతనాల రూపంలో రూ.260 కోట్ల మేర యాజమాన్యం చెల్లిస్తోంది.

గవర్నర్‌తో సీఎం కేసీఆర్ భేటీ

కరోనా నివారణ చర్యలపై చర్చ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌తో సమావేశమయ్యారు. గంటన్నర పాటు జరిగిన ఈ భేటీలో రాష్ట్రంలో కరోనా వైరస్ నివారణకు తీసుకుంటున్న చర్యలపై ప్రధానంగా చర్చ జరిగింది. రాష్ట్రంలో తొలి కరోనా పాజిటివ్ కేసు వెలుగులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు తీసుకున్న చర్యలను గవర్నర్‌కు సీఎం వివరించారు. రాష్ట్రంలో పకడ్బందీగా లాక్‌డౌన్ అమలు జరుగుతోందని, ప్రజల నుంచి మంచి సహకారం లభిస్తోందని తెలిపారు. లాక్‌డౌన్ వల్ల పేద ప్రజలు, వలస కార్మికులకు ఇబ్బంది కలగకుండా వారికి నగదు, బియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. కరోనా వైరస్ నివారణకు కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు జారీ చేస్తున్న మార్గదర్శకాలను పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. గత నెల 13 నుంచి 15 వరకు ఢిల్లీలోని మర్కజ్‌లో నిర్వహించిన ప్రార్థనలకు హాజరై రాష్ట్రానికి తిరిగి వచ్చినవారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించడం, క్వారంటైన్ చేయడం దాదాపు పూర్తయిందని గవర్నర్‌కు తెలిపారు. కరోనా నిర్ధారిత, అనుమానిత కేసుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యూహాలను గవర్నర్‌కు వివరించారు. వైద్యులు కరోనా వైరస్ బారిన పడకుండా ప్రభుత్వం వారికి అవసరమైన అన్ని వ్యక్తిగత రక్షణ పరికరా (పీపీఈ)లను సమకూర్చిందన్నారు. త్వరలో రాష్ట్రంలో కరోనా ప్రభావం తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయని సీఎం ఆశాభావం వ్యక్తం చేసినట్టు తెలిసింది. సమావేశంలో వైద్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి, వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ-హెచ్‌కు గవర్నర్ అభినందన

వెంటిలేటర్లకు ప్రత్యామ్నాయంగా అంబు బ్యాగుల తయారీ

సాక్షి, హైదరాబాద్: తీవ్ర విషమ పరిస్థితికి చేరుకునే కరోనా బాధితులకు కృత్రిమ శ్వాస అందించేందుకు భవిష్యత్తులో వెంటిలేటర్ల కొరత ఏర్పడితే, వాటికి ప్రత్యామ్నాయంగా ఉపయోగించేలా తక్కువ ఖర్చుతో అంబు బ్యాగులకు రూపకల్పన చేసిన ఐఐటీ హైదరాబాద్ అధ్యాపకుల బృందాన్ని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అభినందించారు. బుధవారం రాజ్‌భవన్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తితో మాట్లాడారు. రూ.5వేలకన్నా తక్కువ ఖర్చుతో వీటికి రూపకల్పన చేయవచ్చనీ, అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని బీఎస్ మూర్తి గవర్నర్‌కు తెలియజేశారు.

శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. కరోనాపై మనమందరం జరుపుతున్న పోరాటానికి శక్తినివ్వాలని రాముడిని ప్రార్థించారు.

రాజ్‌భవన్‌లో అన్నదానం..

రాష్ట్రంలో లాక్‌డౌన్ అమల్లో ఉన్న నేపథ్యంలో పేద ప్రజల ఆకలి తీర్చేందుకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సొంత ఖర్చుతో రాజ్‌భవన్‌లో అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాజ్‌భవన్‌లో ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు లాక్‌డౌన్ ముగిసేవరకు పేద ప్రజలకు ఆహార పొట్లాలను పంపిణీ చేయనున్నారని రాజ్‌భవన్ ఓ ప్రకటనలో తెలిపింది.

మద్యం దొరకక వ్యక్తి ఆత్మహత్య

శంషాబాద్: లాక్‌డౌన్ కారణంగా మద్యం దొరకక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శంషాబాద్ పట్టణంలోని కొత్వాల్‌గూడ బస్తీలో నివాసముండే మామిళ్ల మల్లేశ్‌యాదవ్ (45)కు మద్యం తాగే అలవాటు ఉంది. లాక్‌డౌన్ కారణంగా పనిలేకపోవడంతో పాటు మద్యం కూడా లభించకపోవడంతో అతడు మానసికంగా కృంగిపోయాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం అతని ఇంటి సమీపంలోని ఓ వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. మల్లేశ్ చెట్టుకు ఉరేసుకుని కనిపించడంతో పొలం యజమాని బస్తీ పెద్దలకు సమాచారమిచ్చాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వానివి ఉద్యోగ వ్యతిరేక విధానాలు

గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం ఆరోపించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు ఓ ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులకు పీఆర్సీ, ఐఆర్, డీఏ ఇవ్వకపోగా.. తాజాగా కరోనా సాకుతో జీతాలకు కోత విధించడం అన్యాయమన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల హక్కులను కాలరాస్తూ రాజ్యాంగేతర శక్తిలా వ్యవహరిస్తోందని, రెవెన్యూ ఉద్యోగులు కరోనా నియంత్రణ విధులు నిర్వర్తిస్తున్నా ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాల్లో కోత విధించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆ ప్రకటనలో ఉపేంద్ర రావు డిమాండ్ చేశారు.

రెండు వారాలు కీలకం

▶ మొదటి పేజీ తరువాయి

జనం భయం, బాధ్యత లేకుండా వీధులను రద్దీగా మార్చేయడం ఆశ్చర్యం కలిగించింది. రాజధాని హైదరాబాదే కాదు... రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. పాలు, కూరగాయలు, మందులు, ఎమర్జెన్సీ అంటూ ఏదో పేరు చెప్పి ప్రజలు భారీగా రోడ్లపైకి వచ్చారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం ఇలాంటి దృశ్యాలు కనిపించాయి.

ఉదయం 10 గంటలు

ఓల్డ్ సిటీలోని మాదన్నపేట కూరగాయల మార్కెట్ జనంతో కిక్కిరిసి కనిపించింది. సగం మంది కనీసం రుమాలు కూడా ముక్కు, నోటికి అడ్డుగా కట్టుకోకపోవడం ఆందోళన కలిగించే అంశం.

బుధవారం సాయంత్రం 4 గంటలు

రాష్ట్రవ్యాప్తంగా కరోనా వైరస్ బారినపడ్డ వారికి చికిత్స అందిస్తున్న హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి ముందున్న ప్రధాన రహదారి వాహనాలతో కిటకిటలాడింది.

సాయంత్రం 4 గంటలు

ఖైరతాబాద్ కూడలిలో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను నియంత్రిస్తుండగా సాధారణ రోజుల్లో తరహాలోనే వాహనాలు దూసుకొస్తున్న దృశ్యం.

ఉదయం నుంచి సాయంత్రం వరకు

మల్లేపల్లి కూడలిలో ఒకరిని ఒకరు తగిలేంత దగ్గరగా యువకులు గుంపులుగా కూర్చున్నారు.

మన దేశంలో కనిపించిన కరోనా వైరస్ చైనాలో ఉన్నంత శక్తివంతమైనది కాదనే భావన తొలుత వ్యక్తమైంది. కానీ ఢిల్లీలో మత ప్రార్థనలకు వెళ్లి వైరస్ బారినపడి చనిపోయిన వారి శరీరంలో కనిపించిన లక్షణాలను బట్టి చూస్తే అది శక్తివంతమైనదేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలంతా దీన్ని గుర్తించి సహకరిస్తేనే కరోనాను నియంత్రించగలం.

ప్రజల్లో భయం, బాధ్యత ఏదీ?

అందుకు జనం ఒకచోట సమూహంగా చేరడాన్ని పూర్తిగా నియంత్రించాలి. జలుబు లక్షణాలున్న ప్రతి ఒక్కరూ కచ్చితంగా మాస్కులు ధరించాలి. పట్టణాల్లో జనం తీరును చూస్తే ఆందోళన కలుగుతోంది. రోడ్లపైకి చిన్న, చిన్న కారణాలతో వచ్చే వారిలో భయం, బాధ్యత కనిపించట్లేదు. అవసరమైతే వారిపై బలప్రయోగం చేయాల్సిందే. లేకుంటే రాష్ట్రం, తద్వారా దేశం బలవుతుంది

– డాక్టర్ కె.ప్రతాప్,
వైద్య, ఆరోగ్య శాఖ విశ్రాంత సీనియర్ అధికారి

గ్రామాల్లో ప్రజలు ఎంతో స్ఫూర్తి ప్రదర్శిస్తున్నారు. బయటి నుంచి కొత్తవారు రాకుండా నియంత్రించి వైరస్ గ్రామంలోకి ప్రవేశించకుండా చూస్తున్నారు. ఇప్పుడు స్వీయ నియంత్రణ పాటిస్తున్నారు. పని ఉంటే తప్ప బయటకు రావటం లేదు. గతంలోలాగా రచ్చబండ ముచ్చట్లు కనిపించట్లేదు. సర్పంచులు ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేపట్టారు. వారికి ప్రజలు సహకరిస్తున్నారు. కానీ పట్టణాల్లో ఈ స్ఫూర్తి కొరవడింది. అకారణంగా జనం రోడ్లపైకి వచ్చి గుంపులుగా తిరుగుతున్నారు. 'నిజాముద్దీన్' వ్యవహారంతో ఆందోళన వ్యక్తమవుతున్నా మతపరమైన ప్రార్థనలకు ఒకచోటకు చేరుతున్నారు. మతం, వర్గం అని చూడకుండా ప్రభుత్వం కచ్చితంగా కఠినంగా వ్యవహరించాల్సిన తరుణమిది. జనం మాట వినకపోతే ప్రభుత్వం నిర్బంధంగా నిబంధనలు అమలు చేయాల్సిందే. ఓపికగా చెప్పి చూసినా ఫలితం లేనప్పుడు కఠినంగా ఉండైనా జనాన్ని నియంత్రించాలి. ఆ తరుణం ఆసన్నమైంది.

గ్రామాల్లో ఉన్న స్ఫూర్తి పట్టణాలకేమైంది?

– డాక్టర్ రాజారెడ్డి, సీనియర్ సర్జన్

హోంమంత్రికి ప్రగతిభవన్‌లో నో ఎంట్రీ!

- ప్రవేశద్వారం సిబ్బంది ఆపడంతో అక్కడ్నుంచే వెనుదిరిగిన మహమూద్ అలీ
- ఆయన్ను ఎవరూ అడ్డుకోలేదని వివరణ ఇచ్చిన హోంమంత్రి కార్యాలయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీకి ప్రగతి భవన్‌లో నేరుగా ప్రవేశం లభించలేదు. కరోనా వైరస్ నియంత్రణ చర్యలపై బుధవారం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రగతిభవన్‌లో వైద్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డితో సమీక్ష నిర్వహిస్తుండగా, మధ్యాహ్నం 3.40 గంటల ప్రాంతంలో మహమూద్ అలీ సీఎంను కలిసేందుకు వచ్చారు. ప్రగతిభవన్ ప్రవేశ ద్వారం వద్దే ఆయన్ను భద్రతా సిబ్బంది నిలిపేశారు. కొంతసేపు అక్కడే వేచిచూసిన మహమూద్ అలీ తిరిగి వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. కేసీఆర్ ముఖ్యమైన సమీక్ష నిర్వహిస్తున్నందున లోపలికి ఎవరినీ అనుమతించరాదని ఆదేశాలున్నాయని, హోంమంత్రి వచ్చిన విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అనుమతి పొందేలోగా ఆయన వెళ్లిపోయారని ముఖ్యమంత్రి ముఖ్య భద్రతా అధికారి ఎంకే సింగ్ 'సాక్షి'కి తెలిపారు.

ఎవరూ అడ్డుకోలేదు..

ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్లిన హోంమంత్రికి ఎలాంటి ఇబ్బందులు ఎదురవలేదని, ఆయనను ఎవరూ అడ్డుకోలేదని హోంమంత్రి కార్యాలయ ప్రజాసంబంధాల అధికారి (పీఆర్వో) శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం సీఎంను కలిసేందుకు వెళ్లగా.. అదే సమయానికి ఆయన గవర్నర్‌ను కలిసేందుకు సిద్ధపడ్డారని తెలిసి హోంమంత్రి వెనుదిరిగారని వివరించారు. ముఖ్యమంత్రిని కలుసుకోవడంలో హోంమంత్రి మహమూద్ అలీకి ఏనాడూ ఎలాంటి ఇబ్బందులూ ఎదురవలేదని, ఆయనను ప్రగతి భవన్‌లోకి వెళ్లకుండా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోలేదని స్పష్టంచేశారు.

ఆస్తి పన్నుల చెల్లింపు గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: ఆస్తి పన్నుల చెల్లింపుదారులకు శుభవార్త. కరోనా వైరస్ నివారణ కోసం రాష్ట్రంలో లాక్‌డౌన్ అమలు చేస్తున్న నేపథ్యంలో ఆస్తి పన్నుల చెల్లింపు గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో 3 నెలలు పెంచింది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నులు, పాత బకాయిల చెల్లింపు గడువు మార్చి 31తో ముగిసిపోగా, జూన్ 30 వరకు ఆ గడువును పొడిగిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ కార్యదర్శి సి.సుదర్శన్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆలస్యం జరిగిన కాలానికి సంబంధించిన అదనపు అపరాధ రుసుం లేకుండానే ఈ మూడు నెలల సమయంలో ఆస్తి పన్నులు చెల్లించేందుకు అవకాశం కల్పించనున్నారు. జీహెచ్‌ఎంసీతో సహా రాష్ట్రంలోని మిగిలిన అన్ని పురపాలికల్లో ఈ ఉత్తర్వులు అమలు కానున్నాయి.

'ప్రైవేటు ఆస్పత్రుల వినియోగంపై ప్రభుత్వ వైఖరేంటి?'

సాక్షి, హైదరాబాద్: కరోనా వైరస్ నివారణ చర్యల్లో భాగంగా ప్రైవేటు ఆస్పత్రుల సేవల్ని వినియోగించుకోవాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు బుధవారం స్పందించింది. ఈ సందర్భంగా ప్రైవేటు ఆస్పత్రుల సేవల వినియోగ ప్రతిపాదనపై ప్రభుత్వ వైఖరి తెలపాలని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు, జస్టిస్ కె.లక్ష్మణ్‌లతో కూడిన ధర్మాసనం కోరింది. దీనిపై ప్రభుత్వ వివరణ తెలపాలని అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్‌ను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 6వ తేదీకి వాయిదా వేసింది.

గాంధీలో వైద్యులపై దాడి

▶ మొదటి పేజీ తరువాయి

వారం రోజుల క్రితం గాంధీ ఆస్పత్రి ఐసీయూ ఐసోలేషన్ వార్డుకు తరలించారు. అతడితోపాటు సోదరుడు సహా మరో ఇద్దరు కుటుంబ సభ్యులు కూడా ఇదే ఆస్పత్రిలో చేరారు. వీరందరికీ వైద్యులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయగా కరోనా పాజిటివ్ తేలింది. మొదట చేరిన వ్యక్తి (56) ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. దీంతో వైద్యులు ఎప్పటికప్పుడు ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అతడి బంధువులకు వివరిస్తూనే ఉన్నారు. బుధవారం సాయంత్రం 7 గంటల సమయంలో బాధితుడు ఒక్కరే ఐసోలేషన్ వార్డులోని బాత్‌రూమ్‌కు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి మృతి చెందారు. డ్యూటీలో ఉన్న వైద్యులు ఇదే అంశాన్ని అక్కడే ఉన్న మృతుడి సోదరుడు, ఇతర బంధువులకు వివరించారు. వారు ఇదేమీ పట్టించుకోకుండా వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాధితుడు చనిపోయాడని ఆగ్రహించారు. విధి నిర్వహణలో ఉన్న రెసిడెంట్ డాక్టర్ వేణు, డాక్టర్ వికాస్‌లపై దాడికి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన సెక్యూరిటీ సిబ్బందిపై కూడా దాడి చేశారు. ఐసోలేషన్ వార్డులోని కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. కుర్చీలు, ఇతర ఫర్నిచర్‌ను చెల్లాచెదురు చేశారు.

ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చినా..

ఇదే సమయంలో మరికొంత మంది వైద్యులు ఆస్పత్రి ఔట్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు సమాచారమిచ్చారు. కరోనా బాధితులున్న ఐసోలేషన్ వార్డులోకి వచ్చేందుకు తమకు అనుమతి లేదని చెప్పి, వారు అక్కడికి వచ్చేందుకు నిరాకరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన వెంటనే డీఎంఈకి సమాచారం ఇచ్చారు.

గాంధీ ఆస్పత్రి వద్ద సీపీ అంజనీకుమార్‌తో మాట్లాడుతున్న వైద్యులు

ఈ నేపథ్యంలోనే సీపీ అంజన్‌కుమార్ వెంటనే గాంధీ ఆస్పత్రికి చేరుకున్నారు. డాక్టర్లపై దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నారు. వారికి కూడా కరోనా పాజిటివ్ ఉండటంతో ఎర్రగడ్డలోని ఛాతీ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు

ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై దాడులకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ హెచ్చరించారు. వైద్యులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని స్పష్టంచేశారు. వైద్యులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గాంధీ ఆస్పత్రిలో దాడి ఘటన నేపథ్యంలో ఆ ఆస్పత్రి సెక్యూరిటీ ఇన్‌చార్జిగా అదనపు డీసీపీ ఏ.భాస్కర్‌ను నియమిస్తూ నగర పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయనకు నార్త్‌జోన్ అదనపు డీసీపీ శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సహకరిస్తారు.

బాధితుడి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆస్పత్రిలో భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

భయాందోళనలో వైద్య సిబ్బంది

ఐసోలేషన్ వార్డులో వైద్యులపై రోగి తరపు బంధువులు దాడికి దిగటంతో ఐసీయూ, ఐసోలేషన్ వార్డుల్లో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది భయంతో పరుగులు తీశారు. కొంతసేపు ఏం జరుగుతుందో తెలియక తీవ్ర అయోమయానికి గురయ్యారు. తోటి రోగులు కూడా ఇబ్బంది పడాల్సి వచ్చింది.

దాడులకు దిగితే సహించం: డీజీపీ

వైద్య సిబ్బందిపై దాడి చేస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం గాంధీ ఆసుపత్రిలో వైద్యులపై కరోనా రోగులు చేసిన దాడిని ఆయన ఖండించారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వైద్యులు, పారామెడికల్ సిబ్బందిపై దాడులకు దిగితే ఉపేక్షించబోమన్నారు. కరోనాకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బందికి భద్రత మరింత కట్టుదిట్టం చేస్తామన్నారు. ఈ మేరకు వెంటనే తగిన చర్యలు చేపట్టాలని హైదరాబాద్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు.

నిరంతరాయంగా.. నిత్యావసరాల సరఫరా

డీజీపీ కార్యాలయంలో కమోడిటీస్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షణ

సాక్షి, హైదరాబాద్: కరోనా మహమ్మారిని తరిమేయడానికి కేంద్రం విధించిన లాక్‌డౌన్‌ను సజావుగా సాగేలా చూస్తూనే.. మరోవైపు నిత్యావసరాల కొరత, సరఫరాకు ఇబ్బంది రాకుండా చూస్తున్నారు తెలంగాణ పోలీసులు. సరఫరాలో ఎలాంటి అవాంతరం ఎదురైనా క్షణాల్లో పరిష్కరించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. సరుకులను ఉత్పత్తి దారుడి నుంచి వినియోగదారుడికి ఎలాంటి ఆటంకం లేకుండా చేరేలా చూడటమే ఈ రూం ప్రధాన లక్ష్యం. ఆహారపుగొలుసు తెగితే అది శాంతి భద్రతలకు, ప్రజల ప్రశాంత జీవనానికి భంగం వాటిల్లజేస్తుంది. ఫలితంగా లాక్‌డౌన్ ఉద్దేశం నెరవేరకపోగా, విపరీత పరిణామాలకు దారి తీసే ప్రమాదముంది.అందుకే, జీవో నం.45లో పేర్కొన్న విధంగా నిత్యావసరాల నిరంతరాయ సరఫరాకు పోలీసుశాఖ పెద్దపీట వేసింది. ఇందుకు సంబంధిత శాఖలతో కలిసి పనిచేస్తోంది.

కంట్రోల్ రూమ్ నేపథ్యమిదీ..

లాక్‌డౌన్ నేపథ్యంలో జనసంచారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆంక్షల నేపథ్యంలో రెండోరోజే కూరగాయలు, నిత్యావసరాల ధరలు అమాంతంగా పెంచారు వ్యాపారులు. ఒక్కరోజు లాక్‌డౌన్‌కే ధరలు పదింతలు పెరగడాన్ని ప్రభుత్వం, పోలీసుశాఖ తీవ్రంగా పరిగణించింది. తరువాత ధరలు పెంచకపోయినా.. నిత్యావసరాల రవాణాకు పలుచోట్ల ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు డీజీపీ మహేందర్‌రెడ్డి కమోడిటీస్ కంట్రోల్ రూంను డీజీపీ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయించారు. సీఐడీ ఏడీజీ గోవింద్ సింగ్, విమెన్‌సేఫ్టీ వింగ్ ఐజీ స్వాతి లక్రా, విమెన్‌సేఫ్టీ వింగ్ డీఐజీ సుమతిలకు ఈ కంట్రోల్ రూం బాధ్యతలు అప్పగించారు. ఆహారం, మందులు, నూనె, బియ్యం, కూరగాయలు, పౌల్ట్రీ, పండ్లు, మాంసం తదితర నిత్యావసరాల రవాణాకు సజావుగా సాగేలా చూస్తారు

ఎలా పనిచేస్తుందంటే..?

ఇందుకోసం జీవో నెం.45లో పేర్కొన్న విధంగా ఆరోగ్య, సివిల్‌సప్లయ్, వైద్య, వ్యవసాయ, పౌల్ట్రీ, మార్కెటింగ్, సూపర్‌మార్కెట్, రైస్‌మిల్లర్ల వ్యాపారులు- అధికారులతో కలిసి ప్రత్యేక వాట్సాప్‌గ్రూప్ ఏర్పాటు చేశారు. ప్రతీ జిల్లాకు ఒక డీఎస్పీ ర్యాంకు అధికారిని నోడల్ అధికారులుగా నియమించారు. రాష్ట్రంలో ఎక్కడ నిత్యావసరాలు సరఫరా చేసే వాహనం ఆగినా.. సదరు వ్యాపారులు కమోడిటీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారమిస్తారు. వారు సదరు జిల్లా నోడల్ ఆఫీసర్‌ను అప్రమత్తం చేస్తారు. సదరు అధికారి స్థానిక పోలీసులతో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించి.. వాహనం సాఫీగా వెళ్లేలా చూస్తారు. ముఖ్యంగా కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ రాష్ట్రాల మధ్య నిత్యావసరాల రవాణాకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారు. ప్రతీరోజూ సాయంత్రం నోడల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను తెలుసుకుని, పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

మార్చి మాసంలో తగ్గిన జీఎస్టీ ఆదాయం

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల జీఎస్టీ వసూళ్లపై లాక్‌డౌన్ ప్రభావం కనిపిస్తోంది. మార్చి మాసంలో చివరి వారం రోజులు లాక్‌డౌన్ ఉండగా.. అంతకుముందు ఏడాది ఇదే మాసం రెవెన్యూతో పోల్చగా తెలంగాణకు 9 శాతం వసూళ్లు తగ్గాయి. ఏపీకి 2 శాతం తగ్గాయి. 2019 మార్చిలో తెలంగాణలో రూ. 3,897 కోట్ల మేర జీఎస్టీ వసూలు కాగా, 2020 మార్చి మాసానికి అది రూ. 3,563 కోట్లకు పడిపోయింది. అలాగే ఏపీలో 2019 మార్చి మాసంలో రూ. 2,589 కోట్లు వసూలు కాగా.. 2020 మార్చి మాసంలో రూ. 2,548 కోట్లకు తగ్గింది. మార్చిలో జీఎస్టీ వసూళ్ల తగ్గుదల జాతీయ సగటు 4 శాతంగా నమోదైంది. అయితే జీఎస్టీ వసూళ్లలో 2019-20 ఆర్థిక సంవత్సరానికి వార్షిక వృద్ధి రేటు తెలంగాణలో 9 శాతం నమోదైంది. ఇటు జీఎస్టీ వసూళ్లలో వార్షిక వృద్ధి రేటు ఏపీలో 7 శాతంగా నమోదైంది.

'కరోనా వైరస్' రహిత తెలంగాణే లక్ష్యం

బాధితులపై నిఘాకు డీజీపీ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రాన్ని కరోనా వైరస్ రహిత రాష్ట్రంగా మార్చే ప్రక్రియలో భాగంగా పోలీసుశాఖ నడుం బిగించింది. ఈ లక్షణాలు ఉన్న వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచి వారికి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించే వరకు ప్రతీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో) పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని డీజీపీ మహేందర్‌రెడ్డి బుధవారం ఆదేశాలు జారీచేశారు. ఇందుకోసం వైద్యారోగ్య, రెవెన్యూ, మున్సిపల్ ఇతర అన్ని శాఖల సాయం తీసుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. తమ తమ ఠాణాల పరిధిలో 'కరోనా'వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారిని వెంటనే గుర్తించాలని, వారి ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందకముందే క్వారంటైన్‌కు తరలించాలని సూచించారు. ప్రతీ ఎస్‌హెచ్‌వో ఈ పనిని పూర్తి బాధ్యతతో చేపట్టాలన్నారు.

ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు జాబితా!

ఇందుకోసం 'కరోనా వైరస్'పాజిటివ్ ఉన్న వారి జాబితాలను ఇప్పటికే ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు అందజేశారు. ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో ప్రతీ ఎస్‌హెచ్‌వో ఈ జాబితాను ఉన్న తాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తారు. పాజిటివ్‌గా తేలిన వారి పరిసర ప్రాంతాల్లో వైద్య తనిఖీలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, వారెవరిని కలిశారో, ఎక్కడెక్కడ తిరిగారో వంటి వివరాలు తెలుసుకునేందుకు మున్సిపల్, రెవెన్యూ ఇతర శాఖల ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు.

సాక్షి
గురువారం, ఏప్రిల్, 2

అప్రమత్తత అత్యవసరం

ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా వైరస్ మన దేశంలో తీవ్రతను పెంచిందని ఈ రెండురోజులుగా పెరిగిన బాధితుల సంఖ్య చూస్తే అర్థమవుతుంది. మంగళవారంనాటికి వ్యాధిగ్రస్తుల సంఖ్య 1,397 వరకూ వుండగా, 24 గంటలు గడిచేసరికల్లా అది 1,637కి చేరుకుంది. మృతుల సంఖ్య 45కి చేరింది. అయితే అదృష్టవశాత్తూ ప్రపంచ దేశాలతో పోలిస్తే మన దేశంలో ఇప్పటికీ బాధితుల సంఖ్య, మృతుల సంఖ్య తక్కువగానే వుందని చెప్పుకోవాలి. కొత్తగా బయటపడిన కేసుల్లో అత్యధికం ఢిల్లీలోని నిజాముద్దీన్‌లో జరిగిన ఒక సదస్సుకు వెళ్లినవారికి సంబంధించినవే. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బయటపడిన కేసులు కూడా ఈ కోవలోనివే. తెలంగాణ నుంచి 1,030 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 1085 మంది ఈ సదస్సుకు వెళ్లారని ప్రభుత్వాలు అంచనా వేస్తున్నాయి. గత నెల 13-15 తేదీల మధ్య నిజాముద్దీన్ మర్కజ్‌లో జరిగిన ఈ సదస్సుకు ఇండొనేసియా, మలేసియా, సౌదీ అరేబియా దేశాల ప్రతినిధులు రావడంతో వారిద్వారా... ముఖ్యంగా మలేసియా ప్రతినిధుల ద్వారా ఈ వైరస్ అంటుకుని వుండొచ్చన్నది ప్రాథమిక అంచనా. వీరిలో కొందరు స్వస్థలాలకు వెళ్లినా, మరికొందరు ఇక్కడే వుండి వేర్వేరు రాష్ట్రాలకు వెళ్లినట్టు చెబుతున్నారు. వారి ద్వారా ఎంతమందికి ఈ మహమ్మారి సోకిందో ఇంకా తేలవలసివుంది. ఈ వ్యాధి గురించిన అపోహలు ఎంతగా పెరిగాయంటే, ఆ వ్యాధిగ్రస్తుల్ని, వారి కుటుంబాలను, చివరికి వారికి చికిత్సనందించే వైద్య సిబ్బందిని వెలివేసినట్టు చూసే వాతావరణం దేశంలో అలుముకుంది. ఇది మంచిది కాదు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పినట్టు ఇదంతా వ్యాధిగ్రస్తుల్లో భయాందోళనలు సృష్టిస్తోంది. కనుకనే ఈ వ్యాధి బారిన పడినవారిలో కొందరు తమంత తాము బయటికొచ్చి చెప్పుకోవడానికి సందేహిస్తున్నారు. ఇది ప్రాణాలకు ముప్పు తెచ్చిపెడుతుంది. రోగి వెంటనే చికిత్స చేయించుకుంటే కోలుకోవడం చాలా సులభమని వైద్య నిపుణులు పదే పదే వివరిస్తున్నారు. తగిన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి సులభంగా తగ్గిపోతుందని కోలుకున్న వారు సైతం చెబుతున్నారు. అయినా వ్యాధిగ్రస్తుల్లో ఇంకా భయాందోళనలు, సందేహాలు పోవడం లేదు.

వ్యాధిగ్రస్తులను వెలివేసే ధోరణి, వారిపట్ల లేనిపోని వదంతులు సృష్టించే వైఖరి అత్యంత ప్రమాదకరమైనది. దీనికి జడిసి ఎవరూ బయటకు చెప్పలేని స్థితి ఏర్పడితే అది సమాజం మొత్తానికి ప్రమాదంగా పరిణమిస్తుంది. ఇంతవరకూ రాజకీయాలు, కుల, మత, ప్రాంతీయ విభేదాలకు అతీతంగా అందరూ ఒక్కటై కరోనా మహమ్మారిపై పోరాడారు. ఇదిలాగే కొనసాగాలి. అయితే సదస్సు సంగతి వెల్లడయ్యాక దీన్ని నీరుగార్చే ప్రయత్నాలు సామాజిక మాధ్యమాల్లో మొదలయ్యాయి. దాదాపు 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ఏయే జిల్లాల వాసులు ఎందరు ఈ సదస్సుకు వెళ్లారో, వారి ఆరోగ్య స్థితిగతులు ఎలావున్నాయో... వారు ఇంతవరకూ ఎవరెవరిని కలిశారో, ఎక్కడెక్కడ తిరిగారో ఆరా తీసి, వారందరినీ పరిశీలన కేంద్రాలకు పంపవలసివుంది. విదేశీ ప్రతినిధుల్లో పదిమంది తెలంగాణలోని కరీంనగర్ జిల్లాలో కొన్నిచోట్ల తిరిగారు. వీరందరికీ కరోనా వ్యాధి వున్నదని గత నెల 17న బయటపడింది. దానికి హాజరై వ్యాధిగ్రస్తులైన ఆరుగురు మరణించారని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ఈ సదస్సుకు హాజరయ్యాక మహమ్మారి బారిన పడినవారు ఆంధ్రప్రదేశ్‌లో కూడా వున్నారు. మరికొందరి ఆచూకీ తెలియలేదంటున్నారు. ఈ తరుణంలో వ్యాధిగ్రస్తుల కుటుంబాల్లో మరింత భయాందోళనలు సృష్టించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ఉద్దేశాలు ఆపాదిస్తున్నారు. అది మంచిది కాదు. సదస్సు నిర్వహణలో చట్టవిరుద్ధత ఏమైనా వుందా, వుంటే ఎవరు బాధ్యులన్న అంశాన్ని ప్రభుత్వాలు చూసుకుంటాయి. తగిన చర్య తీసుకుంటాయి. కానీ సామాజిక మాధ్యమాల్లో వదంతుల వ్యాప్తి అనసవర సమస్యలు సృష్టిస్తుంది. సదస్సు సమయానికి దేశంలో లాక్‌డౌన్ మొదలుకాలేదు. అయితే ఢిల్లీ ప్రభుత్వం మాత్రం 1897 నాటి అంటువ్యాధుల నియంత్రణ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. దాని ప్రకారం సభలూ, సమావేశాల్లో 200మందికి మించి పాల్గొనకూడదన్న నిబంధన వుంది. మరి ఈ నిబంధన విధించినప్పుడు అంతమంది విదేశీ ప్రతినిధులకు వీసాలు ఎలా మంజూరుచేశారో, వేలమందితో సదస్సు జరుగుతున్నప్పుడు స్థానిక పోలీసులు ఎందుకు చర్య తీసుకోలేదో తేలవలసివుంది. సదస్సు నిర్వాహకులు మాత్రం తమ సదస్సుకు ముందస్తు అనుమతులు తీసుకున్నామని, అన్ని వివరాలు పోలీసులకు, ప్రభుత్వానికి అందించామని అంటున్నారు. కనీసం సదస్సు మొదలైనప్పుడైనా కొత్తగా అమల్లోకి తెచ్చిన ఆంక్షల విషయాన్ని నిర్వాహకులకు పోలీసులు ఎందుకు చెప్పలేకపోయారో, తగిన చర్య అప్పుడే ఎందుకు తీసుకోలేకపోయారో అనూహ్యం. ఆ పని చేసివుంటే ఇన్ని సమస్యలు ఎదురయ్యేవి కాదు. కనీసం లాక్‌డౌన్ ప్రకటించాకైనా అక్కడ ఎటూ కదల్లేక ఎంతమంది చిక్కుబడివున్నారో ఆరా తీసి, క్వారంటైన్ కేంద్రాలకు పంపివుంటే బాగుండేది. ఇప్పుడు కొత్తగా బయటపడుతున్న కేసులన్నీ ఆ సదస్సులో పాల్గొన్నవారివీ, వారికి సన్నిహితులుగా మెలిగినవారివీ కావడం గమనిస్తే ఆందోళన కలుగుతుంది.

దేశంలో లాక్‌డౌన్ పటిష్టంగా అమలవుతోంది. రోగుల్ని గుర్తించిన వెంటనే తరలించడం, అనుమానితులను స్వీయనిర్బంధంలో ఉంచడం ఎప్పటికప్పుడు సాగుతోంది. జనం పండుగలూ, ఉత్సవాలూ ఇళ్లల్లోనే జరుపుకుంటూ తమ వంతు సహకరిస్తున్నారు. కనుకనే దేశంలో 13 లక్షల మంది ఈ వ్యాధి బారినపడే అవకాశం వున్నదని మొదట అంచనా వేసిన అధ్యయన సంస్థలు సైతం దాన్ని సవరించుకున్నాయి. పాలకులు చురుగ్గా వ్యవహరించడం వల్లే ఇది సాధ్యమైందంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విద్వేషాలు పెంచేలా వదంతులు వ్యాప్తి చేయకూడదని, ప్రభుత్వాలు చేస్తున్న కృషికి సహకరించాలని అందరూ గుర్తించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శార్వరి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు చైత్ర మాసం, తిథి శు.నవమి రా.9.02 వరకు, తదుపరి దశమి నక్షత్రం పునర్వసు ప.2.20 వరకు, తదుపరి పుష్యమి, వర్జ్యం రా.10.09 నుంచి 11.40 వరకు, దుర్ముహూర్తం ఉ.10.02 నుంచి 10.51 వరకు, తదుపరి ప.2.55 నుంచి 3.44 వరకు అమృతఘడియలు....రా.11.54 నుంచి 12.04 వరకు, శ్రీరామనవమి.

సూర్యోదయం : 5.58
సూర్యాస్తమయం: 6.09
రాహుకాలం : ప.1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

తొందరపాటు నిర్ధారణతో అనర్థం

కరోనా విస్తరిస్తున్న మార్గం, మరణాల రేటు గురించి ముందే నిర్ధారణలకు వచ్చేయడం సరైంది కాదు. కరోనా సీజన్‌లో మూడు నెలల్లో ప్రపంచవ్యాప్తంగా పది లక్షలలోపుమందికి మాత్రమే ఈ వైరస్ సోకింది. అలాగే వైరస్ రోగుల మరణాల రేటు కూడా అస్థిరంగా ఉంది. ప్రస్తుతం నమోదవుతున్న కరోనా మరణాల రేట్లు, మొత్తం వైరస్ సోకిన కేసుల ఆధారంగా లెక్కిస్తే ప్రపంచవ్యాప్తంగా కరోనా మరణాల రేటు కేవలం 0.01 శాతంగా మాత్రమే నమోదైందని చెబుతున్నారు. ఈ వాస్తవాన్ని చూస్తే, కరోనా వైరస్ ఏ మార్గం తీసుకుంటుంది అనే విషయంలో మనం కచ్చితమైన అంచనాలు వేయలేం. అందుకే ఈ వైరస్ వ్యాప్తి పట్ల అవాంఛనీయమైన నిర్ధారణలు సముచితం కాదు.

విశ్లేషణ

సల్మాన్ అనస్ సోజ్

ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య వ్యవస్థల సామర్థ్యాన్ని ధ్వంసం చేస్తున్న కరోనా సృష్టిస్తున్న ఆరోగ్య సంక్షోభం గురించి ప్రజారోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రత్యేకించి ఈ వైరస్ ప్రభావానికి అధికంగా లోనవుతుంటాయి. వైరస్ వేసే రెండో దెబ్బ ఏదంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అది సర్వనాశనం చేస్తుంది. ప్రపంచ ఆర్థిక మాంద్యం ఇప్పటికే మొదలైందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ అంచనా వేసింది. అర్థికవేత్తలు ప్రకటిస్తున్నట్లుగా అభివృద్ధి వేగం మందగించడం లేక పతన బాట పట్టడం వల్ల ప్రత్యేకించి అభివృద్ధి చెందిన దేశాల్లో అధిక శాతం జనాభా తీవ్రంగా దెబ్బతింటారు.

ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు కరోనా వైరస్ నివారణకు ఆంక్షలు, నిబంధనలు విధించాయి. మరీ ముఖ్యంగా భారత్ వంటి కొన్ని దేశాలు వైరస్ వ్యాప్తిని తగ్గించడం కోసం కఠినాతికఠినమైన ఆంక్షల్ని విధించాయి. ప్రజారోగ్యం నిపుణులు ఇంకా కఠినమైన చర్యలు తీసుకోవాలని పిలుపునిస్తున్నారు. పలువురు ఆర్థికవేత్తలు దీన్ని సమర్థిస్తున్నారు. కానీ ఆర్థిక అంశాలపై పనిచేస్తున్న కొందరు మాత్రం అలాంటి ఆంక్షలు తీవ్రమైన ఆర్థిక, సామాజిక దుష్ఫలితాలకు దారితీస్తాయని భయపడుతున్నారు. మితిమీరిన కఠిన చర్యలు కరోనా ట్రాన్స్‌మిషన్, కేసులు, ఆసుపత్రిలో చికిత్స, మరణాల సంఖ్యకు సంబంధించిన డేటాను సరిగా ప్రతిబింబించనివ్వవని వీరి భావన.

అధికారిక డేటా ఏమేరకు అర్థవంతంగా ఉంటోంది అనే విషయంలో నేను కూడా గుంజాటన పడుతున్నాను. లక్షలాదిమందికి వైరస్ సోకడం, ఊహించడానికి కూడా సాధ్యంకాని విధంగా మరణాలు సంభవించడం జరుగుతాయన్న అంచనాల నేపథ్యంలో ఈ వైరస్‌ను అరికట్టడమనేది మరింత కష్టమైన పనిగా ఉంటోంది. కానీ అందుబాటులో ఉన్న డేటా మొత్తాన్ని అర్థం చేసుకునే విషయంలో మనం దూరపు ఆలోచనలు చేయడం ముఖ్యం. అలాగే వైరస్ గురించిన డేటాకు సంబంధించిన సమాచారాన్ని వీలైనంత త్వరగా ప్రజలకు తెలియజెప్పాలి. ఈ ఉద్దేశంతోనే నేను ఈ వ్యాసం రాస్తున్నాను.

జాన్స్ హోప్‌కిన్స్ యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ సిస్టమ్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం ఏప్రిల్ 1 నాటికి ప్రపంచవ్యాప్తంగా 8,62,234 మెందికి కరోనా వైరస్ సోకినట్లు నిర్ధారించారని తెలుస్తోంది. వీరిలో ఇప్పటివరకు 1,78,718 మంది (20.7 శాతం)కి వ్యాధి నయం కాగా మొత్తం 42,404 మంది (4.9 శాతం) చనిపోయారని సమాచారం. మిగిలినవి వైరస్ సోకిన కేసులు. ప్రపంచవ్యాప్తంగా చూస్తే మరణాల రేటు 4.9 శాతంగానే ఉన్నప్పటికీ దేశాలవారీగా చూస్తే తేడా ఉంది. ఇటలీలో మరణాల రేటు అత్యధికంగా 11.4 శాతం వరకు ఉండగా, భారతదేశం 2.7 శాతం, అమెరికా 1.8 శాతం, జర్మనీ 0.9 శాతం రేటుతో ఉన్నాయి.

అయితే వాస్తవ ఇన్ఫెక్షన్ రేటు ఎంత ఉందో మనకు తెలీదన్నది స్పష్టమే. ఎందుకంటే వైరస్ సోకిన వారందరికీ ఇప్పటికీ పరీక్షలు నిర్వహించలేదు. చాలావరకు ప్రజలు వైరస్ లక్షణాలకు కలిగి ఉంటున్నట్లు, లేదా తక్కువ స్థాయిలో లక్షణాలు ఉన్నట్లు భావించాలి.



ఇలాంటి సందర్భాల్లో ప్రత్యేకించి పరిమితమైన వైద్య సౌకర్యాలు ఉన్న దేశాల్లో వైరస్ పరీక్షలు సార్వత్రికంగా నిర్వహించడం అసాధ్యమనే తెలుస్తుంది. అయితే వైరస్ కేసుల్లో మరణాల రేటు లేదా వాస్తవంగా వైరస్ సోకిన కేసుల రేటును పోల్చి చూడటం ఈ వ్యాసం ఉద్దేశం కాదు.

ఇక్కడ వాస్తవ గణాంకాలను నేను లెక్కించలేను, అంచనా వేయలేను. అనేకమంది కూడా నాలాగే ఈ విషయంలో ఆశ్చర్యచకితులై ఉంటారని భావిస్తాను. ఇప్పటికి కరోనా వైరస్ బారిన పడిన కేసులు 8,62,234 అని చెబుతున్నారు కానీ ఆరోగ్య నిపుణుల అంచనాలతో ఇవి ఏమాత్రం సరిపోలడం లేదు. లండన్ లోని ఇంపీరియల్ కాలేజి అధ్యయనం ప్రకారం వ్యాధి నిరోధక చర్యలు తీసుకోకపోతే ప్రపంచ వ్యాప్తంగా నాలుగుకోట్ల మంది ప్రజలకు కరోనా వైరస్ సోకుతుందని తెలుస్తోంది.

అమెరికాలో కరోనా వైరస్‌కి సంబంధించి సాధికారవాణిని ప్రతిబింబిస్తున్న డాక్టర్ ఆంథోనీ ఫాసీ ఇప్పటికే ఈ విషయంపై మాట్లాడుతూ ఒక్క అమెరికాలోనే లక్షలాది కేసులు నమోదవుతాయని కనీసం 2 లక్షలమంది ప్రజలు వైరస్ ప్రభావంతో చనిపోతారని తేల్చి చెప్పారు. ప్రస్తుతం అమెరికాలో 4 వేలమంది కరోనా వైరస్ ప్రభావంతో చనిపోయారు. భారత్ విషయానికి వస్తే మరింత దారుణ పరిస్థితులను చవిచూడాల్సి వస్తుందని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీకి చెందిన రమణన్ లక్ష్మీనారాయణన్ హెచ్చరిస్తున్నారు. ఈయన అభిప్రాయం ప్రకారం కఠిన చర్యలు చేపట్టకపోతే ఒక్క భారత్‌లోనే 30 కోట్లమంది ఈ వైరస్ బారిన పడటం ఖాయమట.

వైద్య పరిశోధకులు, నిపుణులు ప్రకటిస్తున్న ఈ అంచనాలపట్ల ప్రజల్లో భయం, అపనమ్మకం పెరగడంతో పాటు ఆగ్రహావేశాలు రేగుతున్నాయి. కరోనా సీజన్‌లో మూడు నెలలలోపు ప్రపంచవ్యాప్తంగా పది లక్షలకు లోపు మందికి మాత్రమే ఈ వైరస్ సోకింది. అలాగే వైరస్ రోగుల మరణాల రేటు కూడా అస్థిరంగా ఉంది. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఎరాన్ బెన్‌డేవిడ్, జే భట్టాచార్య ఇటీవలే వాల్ స్ట్రీట్ జర్నల్‌లో ఒక వ్యాసం రాస్తూ, ప్రస్తుతం నమోదవుతున్న కరోనా మరణాల రేట్లు, మొత్తం వైరస్ సోకిన కేసుల ఆధారంగా లెక్కిస్తే ప్రపంచ వ్యాప్తంగా కరోనా మరణాల రేటు కేవలం 0.01 శాతంగా మాత్రమే నమోదైందని వాదించారు. వీరి అభిప్రాయాలను ప్రాతిపదికగా చేసుకుని ప్రముఖ ఆర్థికవేత్త రూపా సుబ్రహ్మణ్య అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ కోసం రాసిన వ్యాసంలో, కరోనా వైరస్ అత్యధిక మరణాల రేట్లను నమోదు చేస్తున్న ప్రపంచంలో భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించిన లాక్ డౌన్ అర్థవంతంగానే కనిపించింది కానీ తాజా గణాంకాల బట్టి చూస్తే భారత్‌లో లాక్ డౌన్ ప్రకటన సరైంది కాదనిపిస్తోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇంత కఠినంగా దేశవ్యాప్తంగా లాక్ డౌన్ అమలుచేస్తే ప్రజా జీవితాలకు ప్రమాదకరమే కాకుండా దేశంలో లక్షలాది మందికి హాని చేకూరుతుందని రూపా అభిప్రాయం. ఆమె ఆందోళనతో నేను ఏకీభవిస్తున్నాను.

కరోనా విస్తరిస్తున్న మార్గం, మరణాల రేటు గురించి ముందే నిర్ధారణలకు వచ్చేయడం సరైంది కాదు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న కరోనా కేసులను అర్థం చేసుకోవాలంటే మనం 2009లో హెచ్1ఎన్1 ఫ్లూ సాంక్రమిక వ్యాధి నుంచి పొందిన అనుభవాలను మనం తెలుసుకోవాలి. అమెరికాలో ఈ వైరస్ 2009లో ప్రారంభమైంది. ఆ సంవత్సరం జూన్ నాటికి ప్రపంచ వ్యాప్తంగా హెచ్1ఎన్1 ఫ్లూ వైరస్ ఆరవదశకు చేరుకుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. అప్పటికే 70 దేశాల్లో ఇది వ్యాపించింది. ఆ తర్వాత వెనువెంటనే 214 దేశాలు, ప్రాదేశిక ప్రాంతాల్లో హెచ్1ఎన్1 కేసులు నమోదయ్యాయి. 2010 ఆగస్టు నాటికి ఆ మహమ్మారి వైరస్ కనుమరుగైందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికారికంగా ప్రకటించింది.

మొత్తంమీద 2009 ఏప్రిల్ నుంచి 2010 ఆగస్టు వరకు 18,500 మంది ఆ వైరస్ బారినపడి మరణించారని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది. అయితే ఈ అధికారిక లెక్కలకు భిన్నంగా 2009లో చెలరేగిన హెచ్1ఎన్1 వైరస్‌కి దాదాపు 5,75,400 మంది ప్రజలు మరణించి ఉంటారని యూఎస్ సెంటర్ ఫర్ డిసీస్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ సంస్థ పరిశోధకులు పేర్కొన్నారు. ఒక్క అమెరికాలోనే అప్పట్లో 6 కోట్లకేసులు నమోదయ్యాయని, 2,75,000 మంది ఆసుపత్రుల పాలుకాగా, 12,500 మంది చనిపోయారని వీరు తెలిపారు.

దీంతో పోలిస్తే ఇంతవరకు కరోనా వైరస్‌కి 42,404 రోగులు బలయ్యారు. ఈ వైరస్ వ్యాపించి ఇప్పటికి మూడు నెలలు మాత్రమే. హెచ్1ఎన్1 వైరస్ ప్రభావంతో పోల్చి చూస్తే కరోనా వైరస్ కారణంగా మరణాల సంఖ్య అధికంగా ఉంటుందని స్పష్టం. ప్రస్తుత అధికారిక డేటాను అనువర్తించి చూస్తే కరోనా వైరస్‌కు మొత్తం 5,50,000 మంది బలవుతారని అంచనా.

ఈ వాస్తవాన్ని చూస్తే, కరోనా వైరస్ ఏ మార్గం తీసుకుంటుంది అనే విషయంలో మనం కచ్చితమైన అంచనాలు వేయలేం. పైగా ఆనాటి లాగే కరోనా వైరస్‌కు వ్యాక్సిన్‌పై అప్పుడే క్లినికల్ నమూనా పరీక్షలు మొదలయ్యాయి కాబట్టి ఈ వైరస్ నిరోధంపై కాస్త ఆశావాదాన్ని కలిగి ఉండటంలో తప్పులేదు

(ది వైర్ సౌజన్యంతో)

వ్యాసకర్త మాజీ వైస్ చైర్మన్, ప్రపంచబ్యాంకు

సోషల్ మీడియా పాలన

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కీలకం

యావత్ ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా మహమ్మారి నుంచి భారతదేశం బయటపడాలంటే రాబోయే రెండు వారాలు చాలా కీలకమని వైద్య, ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇంటి దగ్గరే క్షేమంగా ఉండి మన కోసం వాళ్ల జీవితాలను పణంగా పెడుతున్న డాక్టర్లు, ఆరోగ్య కార్యకర్తలు, పోలీసులకు సహకరించండి.

- కొరటాల శివ, దర్శకుడు

లాక్‌డౌన్

రెండు వారాల్లో లాక్ డౌన్ ఎత్తేస్తామనడంలో వాళ్ల ఉద్దేశమేమిటో అర్థం కావడం లేదు. రోజు రోజుకూ, అనుక్షణం ప్రజా రక్షణకు ఎన్నో ముప్పులు తలెత్తుతున్నాయి. లాక్‌డౌన్ పొడిగించేది లేదంటూ ప్రభుత్వం హామీలివ్వనక్కర్లేదు. ఇప్పుడు కాలాన్ని శాసిస్తున్నది ప్రభుత్వం కాదు, వైరస్.

- వీర్ సంఘ్వీ, యాంకర్

విలన్

తబ్లిఘీ జమాత్ మార్చి 15న ముగిసింది. లాక్‌డౌన్ కంటే ముందు, మతపరమైన సమావేశాలపై నిషేధం విధించడానికి ముందు జమాత్ జరిగింది. లాక్‌డౌన్ అనంతరం రవాణా సౌకర్యాలు కల్పిస్తే వెళ్లిపోతామని పోలీసులకు తెలిపారు. ప్రతి విషాదానికీ ఒక విలన్ కావాలి. ఇండియాలో ముస్లింలకంటే కారకులుగా కనిపించేవారు ఇంకెవరుంటారు?

- కవల్ ప్రీత్ కౌర్, విద్యార్థి నేత

భద్రత

కరోనా రోగులకు చికిత్సనందిస్తున్న మా ఆరోగ్య సిబ్బంది రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. కరోనా రోగులకు సేవచేస్తూ మరణిస్తే మేం వాళ్ల కుటుంబాల బాధ్యతను స్వీకరిస్తాం. వాళ్లు పారిశుద్ధ్య కార్మికులు, వైద్యులు, నర్సులైనా ; ప్రైవేట్, ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే తాత్కాలిక లేక శాశ్వత సిబ్బందైనా మరణిస్తే.. వారందించిన సేవలపట్ల గౌరవంతో వారి కుటుంబాలకు కోటి రూపాయలు అందిస్తాం.

- అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ సీఎం

అల్లర్లు

మూర్ఖులు.. అత్యవసర చట్టాలను కూడా తిరస్కరిస్తున్నారు. వీళ్లని శిక్షించాల్సిన ఎన్ఎస్ఏ బతిమాలడమేమిటి? ఇలా వదిలేయడం వల్లే షహీన్ బాగ్ రూపుదాల్చింది. దాని వల్ల ఢిల్లీలో అల్లర్లు చెలరేగి యాభైమందికి పైగా మరణించారు.

- అభిజిత్ అయ్యర్ మిత్రా, బ్లాగర్

వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

ఇన్‌బాక్స్

నిర్బంధ శాపం

మనుషుల్ని మనుషులే వెలివేసిన
తరతరాల దురాచార ప్రాప్తమా ఇది
ఇంటివారే అంటరానివారైపోయారు
యుగయుగాలుగా బలహీనులను
నిర్బంధించిన శాపమా ఇది
అందరూ గృహనిర్బంధంలో ఉన్నారు
హుంకరించే గొంతులు
దగ్గితేనే దడుచుకుంటున్నాయి
ఘీంకరించే దిగ్గజాలు
తుమ్మితేనే జడుసుకుంటున్నాయి

'కాస్మిక్ లా ' పనిచేస్తోంది
సంపద మీద వ్యామోహం చచ్చింది
సృష్టిధర్మం ఏంటో నేర్చుకుంటున్నారు
తాను బతకాలంటే ఎదుటివారు
కూడా బతకాలని కోరుకుంటున్నారు
అందరూ బాగుండాలని
మొక్కుకుంటున్నారు
జాతి మదంతో మమ్మల్ని ఎవరూ
ఏమీ చేయలేరని విర్రవీగిన
సామ్రాజ్యవాద శక్తులకు
కంటికి కనపడని ఒక సూక్ష్మజీవి కూడా
ప్రపంచాన్ని లాక్డౌన్
చేయగలదని తెలిసేలా చేసింది.

తమవి శత్రుదుర్భేధమైన దేశాలే తప్ప
మృత్యుదుర్భేధ్యమైన దేశాలు కావని
జ్ఞానోదయం కలిగించింది
అందరూ ఒక్కటే అన్న భావన పెరిగి
'వసుధైవ కుటుంబకమ్' అర్థం తెలిసింది
చేతుల్నే కాదు, మన హృదయాలను
కూడా శుభ్రం చేసుకుందాం
చేసిన తప్పులను శానిటైజర్‌తో
పదే పదే కడుక్కుందాం
చేయాల్సిన మంచిపనులను
అదేపనిగా నెమరువేసుకుందాం

ఒంటరితనాన్ని ఆస్వాదిద్దామ్
'డివైడ్ టు యునైట్ 'అని నిరూపిద్దామ్
కాలం నేర్పిన పాఠాలతో
అహంకారపు ప్రాకారాలను
బద్దలుకొడదాం
విలువలతో కూడిన జీవనశైలికి
అలవాటు పడదాం
ప్యూపా నుంచి వెలువడే
సీతాకోకచిలుకలాగా
గృహనిర్బంధ మాధుర్యాన్ని అనుభవించి
మానవ పరిమళాలు గుబాళించే
అందమైన ప్రపంచాన్ని ప్రసవిద్దాం

- డా.ఎల్. శ్రీనాథ్,
'కుబుసం' సినిమా దర్శకుడు,
తెలంగాణ యూనివర్సిటీ
మాజీ పాలక సభ్యుడు

తలెత్తుకుని నిలబడిన భారత్

సందర్భం

స్వపన్ దాస్ గుప్తా

ఈ లాక్‌డౌన్ తన లక్ష్యాలను సాధిస్తుందో లేదో తెలీదు. ఫలితం ఎలా వచ్చినా, మనం ప్రవర్తించిన తీరు భారతీయుడిగా నన్ను గర్వపడేలా చేస్తోంది.

దేశంలో కరోనా కేసుల సంఖ్య 1,637 మార్కు దాటింది. దీనర్థం ఈ ఉపద్రవాన్ని దాటేశామనా, నిపుణులు చెబుతున్నట్టు ఇదంతా తుఫాను ముందటి నిశ్శబ్దమేనా?

ఇట్లా జరుగుతుందని నమ్మలేని విధంగా ప్రపంచాన్ని మార్చేసిన ఈ అంటువ్యాధి గురించి మూడు వారాలుగా పరస్పర విరుద్ధమైన వాదనలు వింటూ, ఉత్సాహపూరిత పండితులు అవ్వడం మానేశాం. ప్రపంచంలోని ప్రతి మూలకూ ఇది సోకగలదని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించినప్పుడు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దీన్ని చైనీస్ వైరస్ అని పిలవడానికి ఉత్సాహపడినట్టే, ప్రతి ఒక్కరికీ దీని కోసంఏం చేయాలో, ఏం చేయకూడదో వారిదైన అభిప్రాయం ఉన్నట్టు అనిపించింది. కానీ అన్నీ తెలిసినట్లు మాట్లాడే ఆ పెద్ద గొంతులు క్రమంగా మూగబోతున్నాయి.

శాసనబద్ధులైన పౌరులుగా ఎంతో మంది భారతీయులు తమ ఇళ్లకే పరిమితమయ్యారు. ఏప్రిల్ 15 తర్వాతైనా మళ్లీ రోజువారీ దినచర్యలోకి కుదురుకోగలం అన్న ఆశతో. ఇట్లాంటి సందర్భాల్లో మన తరపున నిర్ణయం తీసుకునే భారాన్ని ఒక పెద్ద శక్తికి బదిలీ చేయకుండా ఉండలేం. ఉదాహరణకు ఎన్నో రూపాల్లో ఉన్న దేవుడు. ఈ వ్యాకులత క్షణాల్లో మన నమ్మకాన్ని ప్రభుత్వం మీద కూడా ఉంచుతాం. ఈ విశ్వాసం గుడ్డిది కాకపోయినా, దానికి ఉన్న సమాచారం, వనరుల లభ్యత వలన ప్రభుత్వమే మన తరపున ఆలోచించి, మన కోసం నిర్ణయం తీసుకోవాలని అనుకుంటాం.

ఆధునిక చరిత్రలో కొన్ని సందర్భాల్లో పూర్తిగా ప్రజలు విశ్వాసం కోల్పోవడమో, లేక ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా నడవడమో జరిగిన ఉదంతాలు ఉన్నాయి. 1940 వసంతంలో ఫ్రాన్స్‌లోని దుర్భేద్యమైన మేజినెట్ రేఖను జర్మన్ సైన్యం ఆక్రమించిన సంఘటనను నేను ఉదహరిస్తూ ఉంటాను. అత్యంత శక్తిమంతమైన ఫ్రెంచ్ రాజ్యంలో అధికార వర్గం కుప్పకూలి, సామాజిక అస్తవ్యస్తత నెలకొంది. ఈ హఠాత్పరిణామం ఫ్రెంచ్ వాళ్లను జర్మన్లతో కలిసి నడిచేట్టూ, మార్షల్ పెటైన్, అతడు నేతృత్వం వహించిన పెళుసైన విచీ ప్రభుత్వంలో నమ్మకం ఉంచేట్టూ చేసింది.

సైన్యం ఓడినంత మాత్రానే సామాజిక అస్తవ్యస్తత చోటుచేసుకోదని చెప్పడం రాజకీయంగా సరైనది కాక పోవచ్చు. కానీ ఒక ఉదాహరణ. 1945 ప్రారంభానికే నాజీ జర్మనీ కుప్పకూలడానికి ఇక ఎన్నో రోజులు పట్టదని స్పష్టంగా అర్థమైంది. అమెరికా, సోవియట్ యూనియన్ ఉమ్మడి సేనలను ఎదుర్కొని నిలబడటం హిట్లర్ ప్రభుత్వానికి ఏం చేసినా సాధ్యం కాదు. అయినా పట్టు వదలక జర్మన్లు తీవ్రంగా పోరాడారు.

ఇక్కడ దృష్టినుంచి తప్పిపోయే ఒక వాస్తవం ఏమిటంటే, 1944 మధ్యనుంచి వరుస సైనిక ఓటములతోనూ, శత్రువుల బాంబు దాడుల్లో ప్రతి నగరం ధ్వంసం అవుతూ కూడా జర్మనీలో సామాజిక అస్తవ్యస్తత నెలకొనలేదు. కానీ ఫ్రాన్స

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం ॥ 2-4-2020



వందే వాల్మీకి కోకిలమ్

రాముడు అందరివాడు.. అంతా రామమయం.. పాలు మీగడల కన్న పంచదారల కన్న తియ్యనైన నామం.. అందరినీ బ్రోచే నామం.. అంటూ రాముడిని ఎవరెవరు ఏ విధంగా స్మరించుకున్నారో ఒక్కసారి మనం కూడా వారిని తలచుకుందాం.

ఆది కవి వాల్మీకి క్రౌంచ పక్షుల జంటలో ఒక పక్షి నేల కూలటం చూసి, మనసు చలించి, రామాయణ కావ్యం రచించాడు. రామాయణం ఆదికావ్యం అయింది. నాటి నుంచి కలం పట్టిన ప్రతి కవీ రామాయణాన్ని వారి వారి భావాలతో అక్షరీకరించారు. రంగనాథ రామాయణాన్ని రచించిన గోన బుద్ధారెడ్డి, రామాయణాన్ని ఆ కాలానికి అనుగుణంగా ఎన్నో మార్పులు చేశాడు. లక్ష్మణ రేఖ, సీతమ్మవారిని భూమి పెకలించి రావణుడు ఎత్తుకు వెళ్లటం, శబరి ఎంగిలి పండ్లను ఇవ్వటం, రావణుడి కడుపులో అమృతభాండాన్ని సృష్టించటం.. ఇలా ఎన్నో. తరవాత భాస్కర రామాయణం, మొల్ల రామాయణం, కంబ రామాయణం, తులసీదాసు రామచరిత మానస్... ఇలా అనంతకోటి రామాయణాలు వచ్చాయి. కాళిదాసు 'రఘువంశ' కావ్యాన్ని భారతీయులకు అందించాడు. వాల్మీకి రామాయణం తరవాత తెలుగువారు తరవాత ప్రసిద్ధిగా చెప్పుకోదగ్గది విశ్వనాథ రచించిన 'రామాయణ కల్పవృక్షం'. 30 సంవత్సరాలు ఈ యజ్ఞం సాగింది. రాముడి మీద ఉండే చనువుతో కొద్దిగా స్వేచ్ఛ తీసుకుని, రామాయణ మూల కథ చెడకుండా, మరిన్ని అందాలు సమకూర్చారు, జ్ఞానపీఠాన్ని అందుకున్నారు. రాముడిని తెగనాడిన వారూ లేకపోలేదు. ఆ రాముడి ద్వారానే సదరు రచయితలు ప్రసిద్ధి పొందారు. ఇక సినిమా రచయితలు సైతం రాముడు సీతమ్మను అగ్నిపరీక్షకు గురి చేశారంటూ వారి సొంత కలాన్ని ఉపయోగించారు. సీతమ్మ తనకు తాను అగ్ని ప్రవేశం విధించుకుందని వాల్మీకి ఘోషించాడు. పురిపండా అప్పలస్వామి, బేతవోలు రామబ్రహ్మం, పుల్లెల శ్రీరామచంద్రుడు... గణింపలేనంత మంది రామాయణాన్ని రచించారు. ఇదంతా సాహిత్యం..

భాగవతాన్ని రచిస్తూ పోతన..'పలికెడిది భాగవతమట/పలికించెడివాడు రామభద్రుండట నే పలికిన భవహరమగునట/పలికెద వేరొండు గాథ పలుకగనేలా!'అన్నాడు.

రామనామంతో కంచర్ల గోపన్న **రామదాసు** అయ్యాడు. 'శ్రీ రఘురామ చారు తులసీదళధామ శమక్షమాది శృంగార గుణాభిరామ..... భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ!' అంటూ వందకు పైగా పద్యాలతో శ్రీరామచంద్రుడిని ఆరాధించుకున్నాడు. వందలకొలదీ శ్రీరామ కీర్తనలు రచించాడు. 'నను బ్రోవమని చెప్పవే' అంటూ సీతమ్మను అర్థించాడు.

సంకీర్తనలు...

త్యాగరాజు తన కృతులతో, కీర్తనలతో రామనామాన్ని గానం చేసి పరవశించిపోయాడు. 'బ్రోచేవారెవరే రఘుపతే' అంటూ రాముడి ఔన్నత్యాన్ని చాటాడు. ఒకటా రెండా వందల కొలదీ కీర్తనలు రామనామాన్ని ప్రతిధ్వనించాయి. నీ దయ రాదా రామా.. అని విలపించాడు. త్యాగరాజుతో పాటు ఇతర వాగ్గేయకారులు కూడా రాముని స్తుతించారు.

సినిమాలలో...

రాముడి సినిమా అనగానే బాపురమణల జంట గుర్తుకు వస్తుంది. రాముడిని అన్నిరకాల కోణాలలో చూపేశారు బాపు. రాముడిని ఎన్నో రకాలుగా తన కలంతో ముద్దాడారు ముళ్లపూడి వెంకట రమణ. సంపూర్ణ రామాయణం, సీతా కల్యాణం, సీతారామవనవాసం, శ్రీరామాంజనేయ యుద్ధం... లాంటి పౌరాణికాలే కాకుండా, సాంఘిక చిత్రాల లోనూ రాముడికి అగ్రస్థానం కల్పించారు. ముత్యాలముగ్గు, గోరంతదీపం, కలియుగ రావణాసురుడు లాంటి సినిమాలన్నీ రామాయణాన్ని సాంఘికంగా చూపినవే. ఎక్కడ కుదిరితే అక్కడ రాముడిని తెచ్చేస్తారు ఈ జంట. కమ్యూనిస్టుగా పేరు బడ్డ ఆరుద్ర కీర్తించినంతగా రాముడిని మరి ఏ ఇతర సినిమా కవి పొగడలేదేమో.

> **శ్రీరామరామరామేతి రమే రామో మనోరమే**
> **సహస్ర నామ తత్తుల్యం రామనామవరాననే..**
>
> విష్ణుసహస్రనామాలు చదవలేని వారు రామ అనే రెండు అక్షరాలు జపిస్తే చాలని సాక్షాత్తు ఈశ్వరుడు పార్వతితో అన్నాడు. అంతటి మహిమాన్వితమైన రాముడిని వాల్మీకి ఒక ఆదర్శ మానవుడిగా మనసులో భావించి రామాయణ రచన చేశాడు. 'ర' అనే ఒక్క అక్షరాన్ని మాత్రమే రేఫం అంటారు. ర వర్ణానికి శరీర శుద్ధి చేసే లక్షణం ఉందని పరిశోధనలు వెల్లడించాయి.

మాధ్యమాల ద్వారా..

శ్రీరామనామం డా. మంగళంపల్లి బాలమురళి గొంతు నుండి అమృతవర్షిణిగా కురిసింది. రామదాసు కీర్తనలను బాలమురళి తన గళం ద్వారా తెలుగు సంగీత ప్రపంచానికి అందచేశారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రం ద్వారా ఇంటింటినీ అయోధ్యగా మలిచారు ఉషశ్రీ. తన గళంతో వాల్మీకి రామాయణాన్ని ప్రతి ఆదివారం తెలుగు శ్రోతలకు వీనులవిందు చేశారు. దూరదర్శన్‌లో రామాయణాన్ని దృశ్యకావ్యంగా మలిచారు రామానందసాగర్. దువ్వూరి వెంకటరమణశాస్త్రి 'జానకితో జనాంతికం' అంటూ సీతమ్మతో స్వయంగా మాట్లాడినట్లు చేసిన రచన, ఆయన గొంతులో తెలుగు శ్రోతలను అలరించింది.

ప్రస్తుత కరోనా సమయంలో రాములోరి కల్యాణాన్ని అందరం ఇంటి దగ్గరే ఏకాంతంగా చేసుకుందామని పెద్దలందరూ చెబుతున్న విషయాన్ని పాటిద్దాం. 'మము బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ' అని ఆ తల్లిని ప్రార్థిద్దాం.

– వైజయంతి పురాణపండ

జయహో రామాయణమ్

వాల్మీకి రామాయణం ఇరవై నాలుగువేల శ్లోకాల గ్రంథం. ఆ మహర్షి ఇందులో కనీసం ఒక్క వాక్యాన్ని కానీ, పదాన్ని కానీ వ్యర్థంగా వాడలేదు. ఎవరి మెప్పుకోసమో రాయలేదు. ధర్మానికి, అధర్మానికి గల వ్యత్యాసాన్ని వర్ణించాడు. కుటుంబ విలువల ఔన్నత్యాన్ని, ఆవశ్యకతను గురించి వివరించాడు. ఎటువంటి లక్షణాలు కలిగి ఉంటే మానవుడైనా, మహనీయుడిగా మన్నన లందుకుంటాడో అనేదానికి ఉదాహరణగా ఆ మర్యాదా పురుషోత్తముడైన రాముని గురించి రమణీయ వర్ణన చేశాడు. అయోధ్యా నగరం గురించి గొప్పగా చెప్పినట్లే, లంకానగర వైభోగం గురించీ అంతే అందంగా చెప్పాడు. కాకపోతే అయోధ్యానగర రాజుల పరిపాలన ఎంత ధర్మబద్ధంగా ఉంటుందో, అక్కడి ఇళ్లు, వాకిళ్లు ఎంత పరిశుభ్రంగా ఉంటాయో, ప్రజలు అతి కాముకత్వం, అధర్మం, లోభం, అవిద్య వంటి వాటికి దూరంగా ఎంత సుఖ సంతోషాలతో జీవిస్తారో చెబితే, లంకా నగరంలో వీధులు ఎంత సువిశాలమైనవో, సౌధాలు ఏవిధంగా సువర్ణశోభితాలుగా ఉన్నాయో వివరించాడు. అయోధ్యానగర వాసుల ధర్మబద్ధ జీవన విధానం గురించి, లంకానగర వాసుల విచ్చల విడితనాన్ని గురించీ వర్ణించాడు. ఇక్కడే మనకు వాల్మీకి మహర్షి రచనా చాతుర్యం కనిపిస్తుంది.

తండ్రి ఇచ్చిన మాటను నిలబెట్టడం కోసం రాముడు ఎంత కష్ట పడ్డాడో, ఆ రాముడి మార్గంలో నడవడానికి సీతాలక్ష్మణులు ఎంత ఇష్టపడ్డారో, పుత్ర వియోగాన్ని తాళలేక దశరథుడు ఎలా కుప్పకూలిపోయి మరణించాడో, నాటి ఆచారం ప్రకారం తమ పతిదేవుడితో పాటు సహగమనానికి సిద్ధపడిన కౌసల్యాదేవిని పద్నాలుగేళ్ల అరణ్యవాసానంతరం నీ కుమారుడు రాముడిని రాజుగా చూసుకోవడానికైనా ప్రాణాలతో నిలిచి ఉండాలంటూ మునులు, దేవతలు మంచి మాటలు చెప్పి, ఆమెలో ఆశలు నూరిపోసి ఆమె ప్రయత్నాన్ని నివారించడంలోనే వాల్మీకి అభ్యుదయ భావనలను అర్థం చేసుకోవచ్చు.

అడవులకు వెళ్లేటప్పుడు కూడా ఆయుధాలను విడనాడని రామునితో ఆ విషయాన్ని నేరుగా కాకుండా ఆయుధాలను కలిగి ఉండటం వల్ల సాధుజీవులలో సైతం హింసాత్మక భావనలు కలగడాన్ని గురించి కథ రూపంలో సీతమ్మ చెప్పడం, ఆమె మాటలను మెచ్చుకుంటూనే తాను ఆయుధాలను ఎందుకు కలిగి ఉండాలో రాముడు వివరించడం భార్యాభర్తల మధ్య ఉండవలసిన అవగాహనను తెలియజేస్తుంది. అతి బలవంతుడైన అన్న వాలికి జడిసి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్న సుగ్రీవుడికి ఆయన సచివుడు, సలహాదారు అయిన హనుమ– కాసేపటిలో చక్రవర్తి కావలసి ఉండీ, పితృవాక్పాలన కోసం రాజ్యాన్ని తృణప్రాయంగా త్యజించి, అడవులలో తిరుగుతూ ఉండగా... ప్రాణానికి ప్రాణమైన భార్యను ఎవరు అపహరించారో తెలియక తల్లడిల్లిపోతున్న రామునికీ మైత్రి కుదిర్చి రాముడి కోసం సముద్ర లంఘనం చేసి మరీ సీతాన్వేషణ చేసి, ఆమె క్షేమసమాచారాలను రామునికి చేరవేసిన హనుమ నిస్వార్థం, త్యాగశీలత, సముద్రానికి ఓర్పుతో, నేర్పుతో సమయస్ఫూర్తితో వారధి కట్టి లంకను చేరి, అపారమైన సైన్యసంపదతో, శౌర్యపరాక్రమాలు కలిగిన పుత్ర భ్రాతృ బలగంతో వరబలం గల రాక్షస రావణుడి పదితలలనూ అతి సామాన్యుడైన మానవుడు తెగటార్చాడంటే అందుకు రాముని ధర్మానువర్తనమే కారణం.

రామాయణ పఠనమంటే మనలోని దుర్లక్షణాలను దునుమాడటం, మంచి లక్షణాలను, త్యాగబుద్ధిని, సహన శీలతనూ, ధార్మిక, యుక్తాయుక్త వివేచననూ పెంపొందించుకోవడమే.

ప్రస్తుతం అందరకూ సెలవులు కాబట్టి అందుబాటులో ఉన్న వివిధ మాధ్యమాల ద్వారా ఉషశ్రీ, శ్రీరమణ, ఉప్పలూరి కామేశ్వరరావు వంటి వారు సరళంగా రచించిన రామాయణమనే చెరకుగడను నమిలి అందులోని మాధుర్యాన్ని మనం అనుభవించి, మన వారసులకు ఆ తీపిని చవిచూపించేందుకు ప్రయత్నిద్దాం.

ప్రతి సంవత్సరం భద్రాద్రిలోనూ, దేశమంతటా అంగరంగవైభవంగా శ్రీరామ నవమి సంబరాలు, సీతారామ కల్యాణ ఉత్సవాలు జరిపించడం ఆనవాయితీ. లక్షలాది మంది స్వయంగా వీక్షించి తరించేవారు. దురదృష్టవశాత్తూ ఈ సంవత్సరం అటువంటి అవకాశం లేనప్పటికీ, అర్చకులు కల్యాణ క్రతువును నిర్వహించడంలో లోటేమీ ఉండదు కాకపోతే మన మనో నేత్రాలతో బుల్లితెరల ముందు కూర్చుని ఆ వేడుకలను స్వయంగా తిలకించడంతో సరిపెట్టుకుందాం.

ఈ క్లిష్ట పరిస్థితులలో పండుగ ఎలా జరుపుకోవాలి?

పొద్దున్నే నిద్రలేచి తలస్నానం చేసి, ఇంట్లో సీతారాముల వారిని భక్తి, శ్రద్ధలతో పూజించచడం, వడపప్పు, పానకం, పాయసంలాంటి పదార్థాలను నివేదించిశ్రీరామ నామం స్మరిస్తూ ఉండడం, శక్తి కొలది దాన ధర్మాలు చేయడం.

– డి.వి.ఆర్. భాస్కర్

పలుకే బంగారమాయెనా

ఉన్నికృష్ణన్– అందరికీ పరిచితమైన పేరు.. **ఉత్తర కృష్ణన్–** ఈ పేరూ అందరికీ పరిచితమే.. ఇద్దరూ సంగీతంలో అభినివేశం ఉన్నవారే. ఇద్దరూ చలన చిత్రాలలో పాటలు పాడినవారే.

శ్రీరామనవమి సందర్భంగా ఈ తండ్రి కూతుళ్లు 'పలుకే బంగారమాయెనా' అనే రామదాసు కీర్తనను పాడి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. వారం కూడా పూర్తి కాకుండానే ఈ వీడియోను 20 లక్షలకు పైగా విని పరవశించారు. ఈ సందర్భంగా సాక్షి ఫోన్ ద్వారా సంభాషించింది. ఆ వివరాలు...

మా అమ్మాయి పాడిన భక్తి గీతాలు, సినీ గీతాలు, పాశ్చాత్య సంగీతం వీడియోలకి మంచి ఆదరణ వచ్చింది. ఇప్పుడు శ్రీరామ నవమి సందర్భంగా రామదాసు కీర్తన పెట్టాలనుకున్నాం. ఎస్. జయకుమార్ అందుకు సహకరించారు. రామదాసు కీర్తనకు ప్రస్తుత పాశ్చాత్య ఆర్కెస్ట్రాను సమకూర్చారు. అంతకుముందే నేను మా అమ్మాయితో కలిసి వీడియో చేద్దామనుకున్నాను. ఇలా తండ్రి కూతుళ్లు పాడటం చాలా అరుదు.

ఉన్నికృష్ణన్, ఉత్తర ఉన్నికృష్ణన్

మా అమ్మాయి ఉత్తరకి ఐదో ఏట నుంచే సుధారాజన్ దగ్గర సంగీతం నేర్పించాను. అమ్మాయి కర్ణాటక సంగీతం, సినిమా పాటలు, పాశ్చాత్య సంగీతం అన్నీ పాడుతోంది. అన్నిటికీ తోడు అమ్మాయి చదువుతున్న స్కూల్‌లో సంగీతానికి సంబంధించిన విశ్లేషణ, స్వరకల్పన, సంగతులు వేయటం నేర్పిస్తారు. అలా అన్నిచోట్లా సంగీతంతో ప్రయాణం చేస్తోంది. చదువును నిర్లక్ష్యం చేయకుండా సంగీతాన్ని నేర్చుకుంటోంది.

నేను అమ్మాయి కలిసి పాడాలంటే మా ఇద్దరు శృతులు వేరు వేరు. అందువల్ల నేను పాడటానికి వెనకాడాను. అయినా ప్రయత్నిద్దామనుకున్నాను. మాకు ఆడియో పంపేశారు. నేను ఉత్తర బాగా సాధన చేశాం. నాకు తెలుగు రాదు కనుక దోషాలు లేకుండా పాడటం కోసం డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారు పాడిన 'పలుకే బంగారమాయెనా' కీర్తనను చాలాసార్లు విన్నాను. ఉచ్చారణ దోషాలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాను. అమ్మాయి కూడా తప్పులు పాడకుండా శిక్షణ ఇచ్చాను. అలాగే ఆయన బాణీలోనే పాడాం. ఇద్దరం సాధన చేసి, మా కెమెరాలో వీడియో తీశాం. అందులో వచ్చిన దోషాలను మళ్లీ సరి చేసుకున్నాం. అలా ఆ వీడియో తప్పులు లేకుండా రావటం కోసం ఇన్ని శ్రద్ధలు తీసుకున్నాం. మా అమ్మాయితో కలిసి మరిన్ని పాటలు పాడి, వీడియోలు చేయాలని కోరికగా ఉంది. రామదాసుదే 'సీతా కల్యాణ వైభోగమే' కీర్తన విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ శ్రీరామనవమి మాకు నిజంగా పండుగే. రామనామం పానకం వంటిది. ఆ నామాన్ని జపించడం మాకు సంతోషంగా ఉంది.

– సంభాషణ: జయంతి

కరోనా అపోహలూ... వాస్తవాలు

కరోనా వైరస్ ప్రబలిన నాటి నుంచి చాలా రకాల అపోహలు మన ప్రజల్లో, మన సమాజంలో చక్కర్లు కొడుతున్నాయి. వాటిని నమ్మి చాలామంది నష్టపోతున్నారు. అందుకే కరోనా వైరస్‌కు, వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించి ప్రజల్లో ఉన్న కొన్ని అపోహలను దూరం చేసుకుని, వాస్తవ అవగాహన పెంచుకోవడం కోసమే ఈ ప్రత్యేక కథనం.

అపోహ: ఇప్పుడున్న పరిస్థితుల్లో మనకు దగ్గు, తుమ్ములు వస్తూ, ముక్కుకారడమూ జరుగుతోందనుకోండి. అది కరోనా వైరస్ వల్ల వచ్చే 'కోవిడ్–19' వల్లనేనా? వెంటనే హాస్పిటల్‌కు వెళ్లాల్సిందేనా?

వాస్తవం: దగ్గు, తుమ్ములూ, ముక్కుకారడం వంటి లక్షణాలు చూడగానే భయపడాల్సిన అవసరమేమీ లేదు. అందుకు చాలా కారణాలు ఉండవచ్చు. ఉదాహరణకు మనకు దగ్గు, తుమ్ములతో పాటు ముక్కు కారడం కూడా ఉందనుకోండి. సాధారణ జలుబే అందుకు కారణం కావచ్చు. అలాగే అకస్మాత్తుగా దగ్గు రావడమో లేదా తుమ్ములొస్తూ కాసేపు కొనసాగాయనుకుందాం. అందుకు కారణం... బయటి వాతావరణంలో ఏవైనా కాలుష్య కణాలు ముక్కులోకి వెళ్లడం వల్ల ఇలా జరగవచ్చు. ఇక దగ్గు, తుమ్ములు, ముక్కుకారడంతో పాటు తీవ్రమైన జ్వరం, ఒళ్లంతా నిస్సత్తువ ఉన్నాయనుకోండి. అది సాధారణ ఫ్లూ వల్ల కూడా కావచ్చు. ఇక మనం గుర్తు పెట్టుకోవాల్సిన అంశం ఏమిటంటే... దగ్గు, తుమ్ములూ, ఒళ్లనొప్పులు, తీవ్రమైన నిస్సత్తువ/నీరసంతో పాటు 101.5 లేదా 102 డిగ్రీల ఫారెన్‌హీట్ ఉష్ణోగ్రతతో జ్వరం ఉండి, ఊపిరి అందకుండా ఆయాసం వస్తుందనుకోండి. అది ప్రమాదం అని గ్రహించి వెంటనే ఆసుపత్రిలో చేరాలి. ఇది మినహా పైన పేర్కొన్న ఇతర లక్షణాలు కనిపిస్తే... కుటుంబ సభ్యులందరిని నుంచి దూరంగా ఉంటూ, మీ వస్తువులను ఎవరూ వాడకుండా చూసుకుంటూ, ఇంట్లోనే ఐసోలేషన్ పాటించాలి. బయటకు ఏమాత్రం రాకూడదు. అప్రమత్తత అవసరమే గానీ... ఆందోళన పడాల్సిన అవసరం లేదని గుర్తించండి. పైగా ఆందోళన వల్ల వ్యాధి నిరోధక శక్తి తగ్గవచ్చు.

అపోహ: దగ్గు తుమ్ముల విషయానికి వస్తే... ఇంతగా ధైర్యం చెబుతున్నారు కదా. మరి ముక్కు వాసన చూసే శక్తిని కోల్పోతే ఎందుకింత కంగారు? సాధారణంగా మనకు జలుబు చేసినప్పుడు కూడా తాత్కాలికంగా వాసనలు తెలియవు కదా?

వాస్తవం: మొట్టమొదట పేర్కొన్న 'అపోహ–వాస్తవం'లో దగ్గు, తుమ్ముల విషయంలో ధైర్యం చెప్పిన మాట వాస్తవమే. అయితే సాధారణ జలుబులోనూ ముక్కుకారుతూ... వాసనలు తెలియకపోవడమూ నిజమే. ఇక్కడ కరోనా వైరస్‌తో వచ్చే ఇన్ఫెక్షన్‌లో ముక్కు కారకుండానే వాసనలూ తెలియడం లేదంటే... దాన్ని తప్పక 'కోవిడ్–19'గా అనుమానించాలి. అదయ్యేందుకే అవకాశాలెక్కువ.

అపోహ: శానిటైజర్ వైరస్‌లనూ, వ్యాధి కలగజేసే ఇతర సూక్ష్మక్రిములనూ చంపేంత శక్తిమంతమైనది కదా? మరి అలా ప్రతి రెండు గంటల కోసారి పూసుకోవడం వల్ల... దాని కారణంగా చేతులకు ఏదైనా ప్రమాదమా? అది దేహంపైనా, ముఖంపైనా అంటుకోవడం వల్ల ఏదైనా ముప్పు ఉంటుందా?

వాస్తవం: మన చేతులపై ఉన్న వ్యాధికారక సూక్ష్మక్రిములూ, వైరస్‌లను ప్రభావవంతంగా నిర్మూలించేందుకే శానిటైజర్‌ను వాడుతున్నాం. అంత వరకు అది శక్తిమంతమైనదే. కానీ ప్రతి రెండు గంటలకోమారు మళ్లీ పూసుకొమ్మని డాక్టర్లు సలహా ఇస్తున్నారంటే... రెండు గంటల తర్వాత దాని ప్రభావం పూర్తిగా తగ్గుతుందనే కదా. అందుకే... దానివల్ల చేతులకు గానీ... అది శరీరంలోని ఇతర చోట్ల అంటుకోవడం వల్లగాని ఎలాంటి ప్రమాదమూ ఉండదు. కాకపోతే పొరబాటునగానీ... లేదా ఉద్దేశపూర్వకంగా గానీ తాగితే మాత్రం చాలా ప్రమాదమని గుర్తుంచుకోండి.

అపోహ: శానిటైజర్ పూసుకుని వంటింట్లో స్టవ్ దగ్గరకు వెళ్లకూడదట కదా. వెళ్తే చేతులు కాలిపోయే ప్రమాదం ఉందట కదా?

వాస్తవం: శానిటైజర్‌లో ఆల్కహాల్ పాళ్లు దాదాపు 65 నుంచి 70 శాతం వరకు ఉంటాయి. ఆల్కహాల్‌కు స్పిరిట్‌లాగే అంటుకుపోయి మండే గుణం ఉన్నమాట వాస్తవమే. శానిటైజర్ చేతులకు పూసుకున్న తర్వాత వెంటనే స్టవ్ దగ్గరకు వెళ్లకుండా... అది ఆరిపోయాక నిస్సందేహంగా, నిక్షేపంగా స్టవ్ దగ్గర వంట చేసుకోవచ్చు. పైగా ఆల్కహాల్‌కు చాలా త్వరగా ఆవిరైపోయి, ఆరిపోయే (వోలటైల్)గుణం ఉంటుంది. కాబట్టి వెంటనే అరిపోతుంది. అలా ఆరిపోగానే ఎలాంటి అనుమానాలూ పెట్టుకోకుండా హాయిగా వంట చేసుకోవచ్చు.

అపోహ: మనం రోజూ అల్లం, వెల్లుల్లి, ఉల్లి, నిమ్మజాతికి చెందిన పండ్లు తింటే ఈ జబ్బు దరిచేరదని చాలా మంది అంటున్నారు.

వాస్తవం: ఇప్పటికి కరోనా వైరస్ కారణంగా వచ్చే 'కోవిడ్–19' జబ్బుకు నిర్దిష్టంగా మందుగానీ, వ్యాక్సిన్‌గానీ లేవు. ఇక అల్లం, వెల్లుల్లి, ఉల్లి విషయానికి వస్తే వీటిల్లో చాలా ఔషధ గుణాలున్నమాట నిజమే. అలాగే నిమ్మజాతి పండ్లలోని విటమిన్ 'సి' వల్ల వ్యాధినిరోధక శక్తి పెరిగే మాట కూడా వాస్తవమే. అంతమాత్రాన వీటిని తీసుకుంటే కరోనా వైరస్ దరిచేరదన్నది పూర్తిగా వాస్తవం కాదు. ఉల్లి, వెల్లుల్లిలోని ఔషధ గుణాలు ఎన్నో రకాల క్యాన్సర్లను నివారిస్తాయి. అలాగే అల్లంలో జింజెరాల్ అనే చాలా చురుకైన జీవరసాయనం... వాపు, నొప్పి, మంట వంటి వాటిని వేగంగా తగ్గించి, గాయాలను త్వరగా మానేలా చేస్తుంది. దానిలోని యాంటీ–ఆక్సిడెంట్స్ ఎన్నో క్యాన్సర్లను నివారిస్తాయి. అలాగే నిమ్మలోని విటమిన్–సి కూడా వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. కానీ... నేరుగా విటమిన్–సి ఒక్కటే వ్యాధి నిరోధకశక్తిని పెంపొందించలేదు. దానికి విటమిన్–డి, జింక్ వంటి మరికొన్ని మైక్రోన్యూట్రియెంట్‌ల సహాయం కూడా కావాలి. అందుకే అల్లం, వెల్లుల్లి, ఉల్లి, నిమ్మ లేదా నిమ్మజాతి పండ్లు నేరుగా వైరస్‌ను నివారించలేవు. మన వ్యాధి నిరోధక శక్తి ద్వారా పరోక్షంగా మాత్రమే నివారించేదుకు సహాయ పడతాయి. అందుకే ప్రతిరోజూ అల్లం, వెల్లుల్లి, ఉల్లి, నిమ్మజాతి పండ్లు ఆహారంలో తీసుకుంటున్నాం కదా అని జాగ్రత్తగా ఉండకపోతే... వ్యాధి వచ్చే ప్రమాదం ఉంది. అందుకే కేవలం ఇలాంటి వంటింటి చిట్కావైద్యాలపై ఆధారపడి నిర్లక్ష్యంగా ఉండకూడదు.

అపోహ: మన దేశంలోగానీ... రాష్ట్రాల్లో గానీ అవసరమైనన్ని టెస్టింగ్ కిట్లు లేకపోవడం వల్ల అందరికీ పరీక్షలు జరపకపోవడం వల్లనే మన దగ్గర రోగుల సంఖ్య చాలా తక్కువగా కనిపిస్తోందని చాలామంది అంటున్నారు కదా?

వాస్తవం: చాలామందిలో ఈ అపోహ ఉంటుంది. ప్రజలు కంగారు పడతారేమోనని (ప్యానిక్ అవుతారేమోనని) రోగుల సంఖ్య, మృతుల సంఖ్య దాస్తున్నారని కొందరు అపోహ పడుతుంటారు. ప్యానిక్ కావడాన్ని నివారించడం కోసమే పరీక్షలు చేయడం కూడా చేయడం లేదని అనుకుంటుంటుంటారు. కొందరు కేవలం అనుమానంతోనే తమకు అవసరం లేకపోయినా పరీక్షలు చేయించుకోడానికి వస్తుంటారు. వీళ్లందరికీ ఈ కథనంలోని మొట్టమొదటి అపోహ, దానికి సంబంధించిన వాస్తవాలు తెలుసుకుంటే చాలు. మనకు దగ్గు, తుమ్ములూ, జ్వరం వచ్చిన ప్రతిసారీ అది కరోనా వైరస్ కారణంగా కాదనే కొన్ని సందేహాలు తీరిపోతాయి. ఇక మనం ముందుగా పేర్కొన్న కారణాల వల్లనే పరీక్షలు కూడా ప్రతి ఒక్కరికీ జరపాల్సిన అవసరం లేదు. లక్షణాల తీవ్రత ఎక్కువగా ఉండి, అది 'కోవిడ్–19' వల్ల కావచ్చనే అనుమానం ఉన్నప్పుడూ, లేదా వ్యాధి విపరీతంగా వ్యాపించిన ఢిల్లీ వంటి ప్రాంతాల్లోకి వెళ్లివచ్చిన వారూ, విదేశాలకు వెళ్లివచ్చిన వారి విషయంలోనే చాలా అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే అక్కడ వ్యాప్తి ఎక్కువ కాబట్టి ఆ జాగ్రత తీసుకోవడం అవసరం. ఇక పరీక్షలు జరపకుండా ఉంటూ, కేసుల సంఖ్యను తగ్గించి చూపుతున్నారనేది అంత సబబైన వాదన కాదనేందుకు ఒక తార్కాణం ఉంది. మనం రోగుల సంఖ్యను దాచినా... మరణాలనైతే దాచలేం కదా. కానీ ఇప్పటివరకూ కరోనా పాకిన ఇతర దేశాలతో పోలిస్తే మన దగ్గర మరణాలు చాలా తక్కువే కదా. అందువల్ల పరీక్షలు జరపకుండా, రోగుల సంఖ్యను తగ్గిస్తున్నారనే విషయంలో అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. ఇరు తెలుగు రాష్ట్రాలలో ముఖ్యమంత్రులు కరోనా విషయంలో చాలా గట్టిగా, అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. కేంద్రప్రభుత్వం కూడా నిత్యం అప్రమత్తంగా ఉంటూ, సమయానుగుణంగా తగు చర్యలను తీసుకుంటోంది.

అపోహ: చిన్నపిల్లల్లో ఇది ఏమాత్రం ప్రభావం చూపడట కదా? అలాంటప్పుడు వాళ్ల విషయంలోనూ మరీ అంతంత జాగ్రత్తగా ఉండాలా?

వాస్తవం: ఓ వయసు దాటిన వృద్ధులతో పోలిస్తే... చిన్నపిల్లలపై కరోనా అంతగా ప్రభావం చూపడం లేదన్నది కొంతవరకు మాత్రమే వాస్తవం. కానీ చాలామంది చిన్నపిల్లలపైన కూడా కరోనా తన ప్రభావం చూపింది. వ్యాధి నిరోక శక్తి చాలా తక్కువగా ఉన్నందున కొందరు చిన్నారులు చైనాలో చనిపోయారు కూడా. అయితే ఇక్కడ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. చిన్నపిల్లల విషయంలో దీని ప్రభావం అంతగా లేదనే అంశాన్ని పట్టుకుని తల్లిదండ్రులు వాళ్ల పట్ల నిర్లక్ష్యంగా ఏమాత్రమూ ఉండకూడదు. ఎందుకంటే... వాళ్లకు సోకిన వైరస్ కొంత మైల్డ్‌గానే ఉన్నా... చిన్నారుల నుంచి మన ఇంటిలోని పెద్దవారికే అది సోకిందనుకోండి. మరి పెద్దవాళ్లలో అది తీవ్రప్రభావం చూపుతోంది కదా. అందుకే ఇళ్లలోని పెద్దవారి కోసమైనా సరే... వాళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. పైగా పిల్లలతో మనందరికీ చాలా ఉద్వేగభరితమైన సంబంధం (ఎమోషనల్ బాండింగ్) ఉంటుంది. వాళ్లకు ఏ చిన్న కష్టమొచ్చినా తట్టుకోలేం. వాళ్లకు పూర్తిగా తగ్గుతుందనుకున్నా... ఊపిరి అందక వాళ్లు ఆయాసపడుతుంటే మనం ఎంతమాత్రమూ చూడలేం. హాస్పిటల్‌లో వాళ్లు ఉన్నప్పుడు దగ్గరికి పోకుండా మనల్ని మనం నియంత్రించుకోలేం. కాబట్టి పిల్లల పట్ల కూడా చాలా అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలి.

అపోహ: ప్రస్తుతం ఇది అంతగా పాకడం లేదట కదా. అలాంటప్పుడు ఇప్పుడున్న లాక్‌డౌన్‌ను ఇంతే కఠినంగా పాటించాలా? కాస్త రిలాక్స్‌డ్‌గా ఉండవచ్చు కదా?!

వాస్తవం: ఒక అంచనా ప్రకారం... మనం మంచి ఆహారం, మంచి వ్యక్తిగత పరిశుభ్రత వంటి జాగ్రత్తలు పాటిస్తూనే... లాక్‌డౌన్ వంటివి ఏమీ లేకుండా ఉన్నామనుకోండి. ఇప్పుడీ వైరస్ పాకుతున్న వేగాన్ని బట్టి చూస్తే... లాక్‌డౌన్ గనక లేకపోతే ప్రతి వారంలో వ్యాధి సోకిన వారి సంఖ్య ఉజ్జాయింపుగా రెట్టింపడుతుందనుకుందాం. ఉదాహరణకు ఇప్పుడు సమాజంలో కేవలం 100 మంది రోగులే ఉన్నారనుకుందాం. కేవలం 10 వారాల్లోనే వారి సంఖ్య లక్షకు పైగా ఉంటుంది. ఇక లక్ష నుంచి 10 లక్షలకు చేరడానికి కేవలం మూడు వారాలు చాలు. అంటే మన దగ్గర 100 మంది రోగులు ఉంటే... కేవలం 12 – 14 వారాల్లో అంటే మూడు నెలల్లో వారి సంఖ్య పదిలక్షల వరకు చేరుతుంది. ఇంతమందికి చికిత్స చేసేటన్ని వనరులు మనకు ఉన్నాయా? ఇలా ఆలోచించి చూడండి. లాక్‌డౌన్ ఎంత అవసరమో ఎవరికి వారికే అర్థమవుతుంది.

అపోహ: బిడ్డ ఎక్కడో గర్భసంచిలో ఉంటాడు కాబట్టి... గర్భంతో ఉన్న మహిళ ద్వారా పుట్టబోయే చిన్నారులకూ ఈ వైరస్ సోకే ఆస్కారం ఉండదేమో కదా?

వాస్తవం: ఉంది. చైనా లోని వూహాన్ నగరంలో ప్రసవానికి సంసిద్ధంగా ఉన్న కొందరు మహిళలపై అధ్యయనం జరిపారు. ప్రసవం జరిగిన 30 గంటలలోపు చిన్నారులకు పరీక్షలు నిర్

వింబుల్డన్ టోర్నమెంట్ రద్దు

లండన్: కరోనా మహమ్మారి కారణంగా ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అసాధారణ పరిస్థితుల దృష్ట్యా... ఈ ఏడాది ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌ను రద్దు చేస్తున్నట్లు ఆల్ ఇంగ్లండ్ లాన్‌టెన్నిస్ క్లబ్ (ఏఈఎల్‌టీసీ) బుధవారం అధికారికంగా ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది వింబుల్డన్ టోర్నీ జూన్ 29 నుంచి జూలై 12 వరకు జరగాల్సింది. వచ్చే ఏడాది వింబుల్డన్ టోర్నీ జూన్ 28 నుంచి జూలై 11 వరకు జరుగుతుందని ఏఈఎల్‌టీసీ తెలిపింది. రెండో ప్రపంచ యుద్ధం కారణంగా వింబుల్డన్ టోర్నీని 1940 నుంచి 1945 వరకు నిర్వహించలేదు. ఆ తర్వాత 1946 నుంచి ప్రతి యేటా వింబుల్డన్ నిరాటంకంగా కొనసాగింది. అయితే కరోనా మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా విజృంభిస్తుండటంతో అందరి ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని ఈసారి వింబుల్డన్‌ను రద్దు చేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వింబుల్డన్ టోర్నీ రద్దు కావడంతో జూలై 13 వరకు ఎలాంటి టెన్నిస్ టోర్నీలు లేవని అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ), మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) తెలిపాయి.

రెండో ర్యాంక్‌లో రెజ్లర్ బజరంగ్

న్యూఢిల్లీ: యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ రెజ్లర్ బజరంగ్ పూనియా రెండో ర్యాంక్‌లో నిలిచాడు. పురుషుల ఫ్రీస్టయిల్ 65 కేజీల విభాగంలో బజరంగ్ 59 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. 60 పాయింట్లతో ఒలింపిక్ చాంపియన్ రషిదోవ్ (రష్యా) టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. దౌలత్ నియాజ్‌బెకోవ్ (కజకిస్తాన్-56 పాయింట్లు), ఇస్మాయిల్ ముస్జుకజెవ్ (హంగేరి-41 పాయింట్లు) వరుసగా మూడు, నాలుగు ర్యాంక్‌ల్లో ఉన్నారు. తాజా ర్యాంకింగ్ ప్రకారం ఈ నలుగురికి వచ్చే ఏడాది జరిగే టోక్యో ఒలింపిక్స్‌లో టాప్-4లో సీడింగ్ లభించడం ఖాయమైంది. పురుషుల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగంలో భారత్‌కే చెందిన రవి దహియా 45 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో ఉన్నాడు. 86 కేజీల విభాగంలో దీపక్ పూనియా 54 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో నిలిచాడు.

కుదించి... మనవాళ్లతోనే ఆడించాలి

ఐపీఎల్‌పై రాజస్తాన్ రాయల్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రంజిత్

న్యూఢిల్లీ: ఇప్పుడున్న అసాధారణ పరిస్థితుల నేపథ్యంలో ఈ సీజన్ ఐపీఎల్‌ను కుదించి... కేవలం భారత ఆటగాళ్లతోనే ఆడించాలని రాజస్తాన్ రాయల్స్ ఫ్రాంచైజీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రంజిత్ బర్తకూర్ సూచించారు. ఐపీఎల్-13పై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఇంకా వేచిచూసే ధోరణిలోనే ఉంది. గతంలో ఈనెల 15 వరకు లీగ్‌ను వాయిదా వేసింది. ఇప్పుడు కరోనా ఉధృతి మరింత పెరిగింది. దీంతో విదేశీ ఆటగాళ్లతో ఆడించే పరిస్థితి లేకపోవడంతో రంజిత్ మాట్లాడుతూ 'ఇది ఎలాగూ ఇండియన్ ప్రీమియర్ లీగే కాబట్టి ఈసారి పూర్తిగా మన ఆటగాళ్లకే పరిమితం చేసి... కుదించి ఆడించాలి. ఇప్పుడున్న సంక్లిష్ట పరిస్థితుల్లో బీసీసీఐ ఇంతకుమించి ఏం చేయలేకపోవచ్చు. గతంలో కేవలం భారత ఆటగాళ్లతోనే నిర్వహించడం గురించి అసలు ఆలోచించే పరిస్థితే లేదు. కానీ ఇప్పుడు అంతా మారింది. నాణ్యమైన ఆటగాళ్లు ఎంతో మంది వెలుగులోకి వచ్చారు. వీళ్లు కూడా విదేశీ ఆటగాళ్లకు దీటుగా రంజింప చేయగలరు' అని అన్నారు. ఏదేమైనా దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సింది బోర్డేనని అది కూడా ఏప్రిల్ 15 తర్వాతేనని రంజిత్ చెప్పారు.

2017 వన్డే వరల్డ్‌కప్‌లో ఫైనల్, 2018 టి20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్, 2020 టి20 ప్రపంచకప్‌లో ఫైనల్... వరుసగా మూడు ఐసీసీ ఈవెంట్లలో భారత మహిళల క్రికెట్ జట్టు నాకౌట్ దశకు చేరినా టైటిల్ మాత్రం దక్కలేదు. అప్పటి వరకు బాగా ఆడుతూ వచ్చిన మన అమ్మాయిలు కీలక దశలో చేతులెత్తేశారు. బ్యాటింగ్, బౌలింగ్ బాగానే ఉన్నట్లు కనిపించినా... ఓవరాల్‌గా ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లాంటి మేటి జట్ల స్థాయికి మనం ఇంకా చేరుకోలేదని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి. రాబోయే రోజుల్లో ఈ అంతరం తగ్గాల్సిన ఆవశ్యకత ఉందని భారత టి20 టీమ్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చెబుతోంది.

ఐదారేళ్లు వెనుకబడి ఉన్నాం

- భారత మహిళల దేశవాళీ క్రికెట్‌పై టి20 కెప్టెన్ హర్మన్‌ప్రీత్
- జట్టుకు మరికొందరు పేస్ బౌలర్లు కావాలి
- సారథ్యం భారం కాదన్న కౌర్

ముంబై: మహిళల వన్డే వరల్డ్ కప్‌నకు మరో ఏడాది సమయం కూడా లేదు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో న్యూజిలాండ్‌లో ఈ టోర్నీ జరగనుంది. గత మూడు ఐసీసీ టోర్నీల ఫలితాలను చూసుకుంటే వచ్చే మెగా టోర్నీలోగా పలు లోపాలను మనం సరిదిద్దుకోవాల్సి ఉందని టీమ్ అగ్రశ్రేణి బ్యాటర్, టి20 కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (వన్డే టీమ్‌కు మిథాలీ రాజే కెప్టెన్) అభిప్రాయపడింది. ఇందులో ఫీల్డింగ్, ఫిట్‌నెస్ మెరుగుపర్చుకోవడంతో పాటు పేసర్లను తీర్చిదిద్దడం కూడా కీలకమని ఆమె చెబుతోంది. వివిధ అంశాలపై హర్మన్ అభిప్రాయాలు ఆమె మాటల్లోనే...

భారత జట్టు ఫిట్‌నెస్‌పై...

దురదృష్టవశాత్తూ మనం ఇలాంటి అంశాలు చాలా ఆలస్యంగా మొదలు పెడతాం. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ లాంటి జట్ల విషయంలో ఫిట్‌నెస్ వారి సంస్కృతిలో ఒక భాగంలా ఉంది. ఇతర జట్లతో పోలిస్తే ప్రతిభపరంగా బ్యాటింగ్, బౌలింగ్‌లలో కూడా మన జట్టు ఎంతో మెరుగ్గా ఉంది. కానీ ఫిట్‌నెస్ మాత్రమే మమ్మల్ని వెనక్కి లాగుతోంది. ఇప్పుడు మన అమ్మాయిల్లో అందరిలోనూ దీనిపై శ్రద్ధ పెరిగింది కాబట్టి శ్రమిస్తున్నారు. వారికి కూడా తమ బాధ్యత అర్థమైంది. ఒక్క రోజులో ఇదంతా మారిపోదు. సుదీర్ఘ సమయం పాటు దీనిపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

మన దేశవాళీ క్రికెట్‌పై...

ఇది మరో పెద్ద లోపం. సరిగ్గా చెప్పాలంటే ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌ల కంటే మనం ఈ విషయంలో కనీసం ఐదారేళ్లు వెనుకబడి ఉన్నాం. ఇప్పుడు కొంత మారుతున్నా.... కొన్నాళ్ల క్రితం వరకు కూడా దేశవాళీ క్రికెట్‌లో ఇస్తున్న ప్రదర్శనకు, అంతర్జాతీయ స్థాయికి వచ్చేసరికి వారు ఆడుతున్న తీరుకు మధ్య చాలా వ్యత్యాసం ఉండేది. ఇటీవల బీసీసీఐ 30 మంది మహిళా క్రికెటర్లకు ప్రత్యేక షెడ్యూల్ తయారు చేసి ఇస్తుండటంతో పరిస్థితి కొంత మెరుగైంది. ఇప్పుడు దేశవాళీ క్రికెట్‌లో ప్రదర్శనను బట్టి జాతీయ జట్టులోకి ఎంపిక చేస్తే వారు తడబాటుకు గురికావడం కొంత తగ్గింది. తమ నుంచి టీమ్ మేనేజ్‌మెంట్ ఏం ఆశిస్తోందో వారికి అర్థమవుతోంది. నిజాయితీగా చెప్పాలంటే దేశవాళీ క్రికెట్ వ్యవస్థ ఎలా ఉండాలో అలా మాత్రం ఇప్పటికీ లేదు. అందుకే ఐదారేళ్లు వెనుకబడిన పోలిక తెస్తున్నాను. దేశవాళీ స్థాయి పెరిగితేనే అంతర్జాతీయ స్థాయిలో కూడా బాగా ఆడగలరని నా అభిప్రాయం.

స్పిన్‌పై అతిగా ఆధారపడటంపై...

ఇటీవల టి20 ప్రపంచకప్‌లో స్పిన్‌ను అనుకూలంగా లేని పిచ్‌లపై కూడా వారినే నమ్ముకున్నాం. క్రికెట్ వ్యూహాలపరంగా చెప్పాల్సి వస్తే అది ఏమాత్రం సరైన నిర్ణయం కాదు. అయితే అలాంటి పెద్ద టోర్నీలో ఒక జట్టుకు తమ బలాలు, బలహీనతల గురించి తెలిసి ఉండటం, బలాన్ని సమర్థంగా వాడుకోవడం కూడా కీలకం. ప్రస్తుత స్థితిలో స్పిన్నర్లు మా జట్టు బలం. అందుకే తప్పడం లేదు.

పేస్ బౌలింగ్ బలహీనతలపై...

ఒకటి, రెండేళ్ల క్రితం పేస్ బౌలర్లను తీర్చిదిద్దడంపై మనం దృష్టి పెట్టి ఉంటే ఇంతగా స్పిన్నర్లను నమ్ముకునే అవసరం రాకపోయేది (ప్రపంచకప్‌లో ఒకే ఒక పేసర్ శిఖా పాండే అన్ని మ్యాచ్‌లు ఆడగా, అరుంధతి రెడ్డి రెండు మ్యాచ్‌లలో బరిలోకి దిగింది). జట్టు అవసరాలను బట్టి చూస్తే మనకు కనీసం ముగ్గురు పేస్ బౌలర్ల అవసరం ఉంది. అయితే వారిలో ఏమాత్రం సత్తా ఉందనేది కూడా చూడాలి. ఈ విభాగంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న బౌలర్లను దాటి బయట సరైన ప్రతిభను అన్వేషించాలి. వచ్చే రెండేళ్లలో నాణ్యమైన పేసర్లు మనకు లభిస్తారని నమ్ముతున్నా.

స్వీయ బ్యాటింగ్ వైఫల్యాలు, కెప్టెన్సీపై...

టి20 జట్టు కెప్టెన్సీ నాకు భారం కాదు. నా బ్యాటింగ్‌పై దాని ప్రభావం ఉందంటే అంగీకరించను (ప్రపంచకప్‌లో 5 ఇన్నింగ్స్‌లలో కలిపి 30 పరుగులే చేసిన హర్మన్ టి20ల్లో ఆఖరిసారిగా 16 నెలల క్రితం అర్ధ సెంచరీ నమోదు చేసింది. ఫిబ్రవరి 2018 తర్వాత ఆమె వన్డేల్లో హాఫ్ సెంచరీ చేయలేదు). బయటినుంచి చూస్తే నేను విఫలమైనట్లు కనిపించవచ్చు కానీ నాకు అలాంటి భావన ఏమీ లేదు. నా బ్యాటింగ్‌పై నాకు విశ్వాసం ఉంది. గణాంకాలు వాటిని సరిగా విశ్లేషించలేవు. వీటి వల్ల నా నైతిక స్థయిర్యం దెబ్బతినదు. కెప్టెన్సీని నేను బాగా ఆస్వాదిస్తున్నాను. అన్ని విషయాల్లో భాగమవుతూ చురుగ్గా నా బాధ్యతలు నెరవేరుస్తున్నా. గతంలో నా బ్యాటింగ్ గురించి మాత్రమే ఆలోచించేదాన్ని. సారథ్యం కారణంగా వ్యక్తిగతంగానూ నాలో చెప్పుకోదగ్గ మార్పు వచ్చింది. ఇప్పుడు నా గురించి మాత్రమే కాకుండా ఇతర అన్ని అంశాల గురించి కూడా ఆలోచించాల్సిన బాధ్యత నాపై ఉంది.

హాకీ ఇండియా, ఏఐఎఫ్‌ఎఫ్ విరాళం రూ. 25 లక్షలు

న్యూఢిల్లీ: కరోనాపై పోరు కోసం చేతులు కలిపే వారి జాబితా తాజాగా హాకీ ఇండియా (హెచ్ఐ), అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) చేరాయి. పీఎం కేర్స్ సహాయ నిధి కోసం హెచ్ఐ, ఏఐఎఫ్‌ఎఫ్ చెరో రూ. 25 లక్షలు బుధవారం విరాళంగా ప్రకటించాయి.

గంగూలీ ఉదారత

కరోనా కారణంగా ఆహారం లేక ఇబ్బంది పడే వారిని ఆదుకునేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడు, భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ముందుకొచ్చాడు. అతను బుధవారం రామకృష్ణ మిషన్ హెడ్‌కార్టర్స్ అయిన బేలూరు మఠానికి 2,000 కేజీల బియ్యాన్ని అందజేశాడు. '25 ఏళ్ల తర్వాత బేలూరు మఠాన్ని సందర్శించాను. అన్నార్థుల కోసం 2,000 కేజీల బియ్యాన్ని అప్పగించాను' అని దాదా ట్విట్టర్ ద్వారా ప్రకటించాడు.

వేలానికి బట్లర్ ప్రపంచకప్ జెర్సీ

లండన్: కరోనా మహమ్మారి కోసం తనకు చిరస్మరణీయమైన చొక్కాను ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్ జోస్ బట్లర్ వేలానికి పెట్టాడు. కరోనా కట్టడికి నిర్విరామంగా కృషి చేస్తోన్న వైద్య సంస్థలకు నిధులు అందించేందుకు... గతేడాది వన్డే ప్రపంచకప్ ఫైనల్ గెలిచినపుడు ధరించిన జెర్సీని వేలం వేస్తున్నట్లు బట్లర్ ట్విట్టర్ వీడియో ద్వారా ప్రకటించాడు. తమ జట్టు సభ్యులందరి సంతకాలతో కూడిన ఈ జెర్సీని వేలం వేయడం ద్వారా లభించిన మొత్తాన్ని రాయల్ బ్రాంప్టన్, హ్యారీఫీల్డ్ హాస్పిటల్స్ చారిటీ కోసం వినియోగిస్తానని బట్లర్ తెలిపాడు. 'కరోనా మహమ్మారి కట్టడికి వైద్యులు, నర్సులు, జాతీయ ఆరోగ్య సేవా సంస్థలు ఎంత తీవ్రంగా శ్రమిస్తున్నారో అందరికీ తెలుసు. రానున్న కాలంలో వారికి మన సహాయం మరింతగా అవసరం. గత వారం రాయల్ బ్రాంప్టన్, హ్యారీఫీల్డ్ ఆసుపత్రులు తమకు వైద్యపరికరాల అవసరముందని తెలిపాయి. వారికి సహాయం అందించేందుకు ప్రపంచకప్ ఫైనల్లో ధరించిన జెర్సీని వేలానికి ఉంచుతున్నా' అని బట్లర్ వివరించాడు.

నా వంతు విరాళం సేకరిస్తున్నాను

- ఎస్.పి. బాలు

ఎస్.పి. బాలు

'కదలిరండి మనుషులైతే... కలసి రండి మమత ఉంటే'... ఇది 'ఊరికి మొనగాడు'లో ఎస్.పి.బాల సుబ్రహ్మణ్యం పాడిన పాట. ఇప్పుడు ఆయన తన అభిమానులను అదే కోరుతున్నారు. 'కరోనా' మీద దేశం చేస్తున్న పోరాటానికి మద్దతుగా 'ఎస్.పి.బి ఫ్యాన్స్ చారిటబుల్ ట్రస్ట్'కు విరాళాలు పంపమని కోరుతున్నారు. అయితే ఆయన ఇందుకు వినూత్నమైన మార్గం ఎంచుకున్నారు. వంద రూపాయల నుంచి ఎన్ని రూపాయలైనా విరాళం ఇచ్చి ఒక పాట కోరుకుంటే ఆ అభిమాని కోరిక మేరకు ఆ పాటను పాడి ఫేస్‌బుక్‌లో వీడియో పోస్ట్ చేస్తారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల అభిమానులకు బాలు ఈ పిలుపు ఇచ్చారు. విరాళాలు ఇస్తున్న అభిమానుల కోసం ఆ మూడు భాషల పాటలను కూడా పాడి ఆ వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' పలకరిస్తే తాను చేస్తున్న కార్యక్రమాల గురించి మాట్లాడారు.

''పన్నెండు సంవత్సరాలుగా మా ఎస్‌పిబి ఫాన్స్ చారిటబుల్ ట్రస్ట్ నడుస్తోంది. ఆరోగ్యం, విద్య రంగాలలో మాకు తోచిన సాయం చేస్తున్నాం. ఇప్పుడు కరోనాతో బాధపడేవారికి మాత్రమే మా సేవలు పరిమితం కాలేదు. అన్ని విభాగాలలోను పనులు లేక ఇబ్బంది పడుతున్న వారు ఉన్నారు. వారికి కూడా తోచినంత సహాయం చేయాలనుకుంటున్నాను. ఇందుకోసం నేను పాటల ద్వారా విరాళాలు సేకరిస్తున్నాను. శ్రోతలు వాళ్లకు ఇష్టమైన భాషలోని పాట అడగొచ్చు. ఆ పాట నేను పాడతాను. ఇందుకోసం కనీసంగా వంద రూపాయలు పెట్టాం. ఎవరి ఇష్టం వచ్చినంత ఎంతైనా ఇవ్వచ్చు. వంద, ఐదొందలు, వెయ్యి, పదివేలు, యాభైవేలు, లక్ష వస్తున్నాయి. ఇప్పటికి మూడు రోజులు చేశాను. మార్చి 31 నాటికి, నాలుగు లక్షల డెబ్బై వేల దాకా డబ్బులు పోగయ్యాయి. ఇలా ఎన్నాళ్లు నడుస్తుందో చూసి, మొత్తం వచ్చిన డబ్బుకి, నా సొంత చందా జత చేస్తాను. ఆ తరవాత ఎవరికి ఎలా పంచాలో నిర్ణయించుకుంటాను. కరోనా అవగాహన కోసం తెలుగు, కన్నడం, తమిళం మూడు భాషల్లో ఆర్కెస్ట్రా లేకుండా అవగాహన గీతాలు పాడాను. కన్నడంలో జయంత్ కాయికిన్, తెలుగులో వెన్నెల కంటి, తమిళంలో వైరుముత్తు పాటలు రాసి పంపారు. ఇప్పుడు మ్యుజీషియన్స్‌ను పెట్టి చేయలేను కనుక తంబురా పెట్టుకుని పాడాను. ఇవి ఫేస్‌బుక్‌లో బాగా వైరల్ అయ్యాయి. వీటికి చాలా మంది ఆర్కెస్ట్రా జత చేసి ఫేస్‌బుక్‌లో పెడుతున్నారు. ఇది చాలా ముదావహం. పిల్లలు దీనికి నృత్యాభినయం చేసి పెడుతున్నారు. చాలా ఆనందం. రాంభొట్ల నృసింహశర్మగారు వైద్యులకు సంబందించి ఒక పాట రాశారు. ఆ పాటను కూడా అతి త్వరలో నా వెబ్ పేజీలో పెడతాను.

ఈ సందర్భంగా అందరికీ ఒక సలహా ఇవ్వడం నా బాధ్యతగా భావిస్తున్నాను. కరోనా నాకేమి వస్తుందిలే అని అందరూ స్వేచ్ఛగా తిరగటం మానేయండి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నుంచి మన ప్రభుత్వాల వరకు అందరూ దీని గురించిన ఒక అవగాహన కల్పిస్తున్నారు. వారి మాటలను మనమంతా అనుసరించి తీరాలి. సమాజం బావుండాలంటే మనం బావుండాలి. అది ముఖ్యమైన విషయం. అత్యవసరమైన పరిస్థితి అయితే తప్ప లక్ష్మణ రేఖ దాటి రాకండి'' అన్నారాయన.

'స్టార్ వార్స్' నటుడు కరోనాతో మృతి



ఆండ్రూ జాక్

కరోనాతో మరో హాలీవుడ్ నటుడు మరణించారు. ఇటీవలే మార్క్ బ్లమ్ అనే నటుడు కరోనా సోకి మరణించారు. తాజాగా 'స్టార్ వార్స్' ఫేమ్ ఆండ్రూ జాక్ (76) కూడా కోవిడ్ -19 కారణంగానే చనిపోయారు. కరోనా పాజిటివ్ అని తేలిన రెండు రోజుల్లోనే ఆండ్రూ మరణించారని సమాచారం. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారాయన. 'మెన్ ఇన్ బ్లాక్', 'లార్డ్ ఆఫ్ ది రింగ్స్', 'థార్' తదితర సినిమాల్లో నటించారాయన.

సినిమా

బర్త్‌డేకి టైటిల్?

అల్లు అర్జున్

'ఆర్య'(2004), 'ఆర్య 2' (2009) చిత్రాల తర్వాత దర్శకుడు సుకుమార్, హీరో అల్లు అర్జున్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇందులో రష్మికా మందన్నా కథానాయికగా నటిస్తున్నారు. మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కరోనా వైరస్ కారణంగా ఈ సినిమా చిత్రీకరణ వాయిదా పడింది. ఈ నెల 8న అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించే ఆలోచనలో ఉన్నారట చిత్రబృందం. స్మగ్లింగ్ నేపథ్యంలో సాగే ఈ చిత్రానికి 'శేషాచలం' అనే టైటిల్‌ను అనుకుంటున్నారని అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తను చిత్రబృందం ఖండించింది. మరి.. టైటిల్ ఏంటో తెలుసుకోవాలంటే వేచి చూడాల్సిందే.

ఇంట్లోనే ఉందాం... కరోనాను దేశం దాటిద్దాం

డాడీ శ్రీనివాస్

కరోనా మహమ్మారిపై ప్రపంచం చేస్తున్న యుద్ధంలో కళాకారులు తమ వంతు సాయం అందిస్తున్నారు. కొందరు విరాళాలు అందిస్తున్నారు, మరికొందరు స్ఫూర్తిదాయక మాటలతో, పాటలతో ప్రజల్లో కరోనాపై అవగాహన కల్పిస్తున్నారు. రచయిత డాడీ శ్రీనివాస్ రాసిన 'ఏయ్.. ఎత్తర.. ఎత్తర సోదర భారత దేశం జెండా.... కరోనా రక్కసి కోరలు పీకే అశోక చక్రం జెండా' పాట బుధవారం విడుదలైంది. రాజేష్ పాడారు. 'కనపడే శత్రువు దండెత్తి వస్తే ధైర్యంగా యుద్ధం చేస్తాం. కనిపించని ఈ మహమ్మారిని ఒంటరిని చేద్దాం. ఇంట్లో ఉండి కరోనాపై యుద్ధం ప్రకటిద్దాం. మన దేశం దాటిద్దాం' అని సాగే ఈ పాట గురించి శ్రీనివాస్ మాట్లాడుతూ- ''ఈ పాట ట్యూన్ కూడా నాదే. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల్లోకి వచ్చి కరోనా వైరస్‌పై అవగాహన కల్పించలేం. అందుకే ఇంట్లో ఉండి పాట ద్వారా ప్రజలను చైతన్యపరచవచ్చు అనిపించింది. కరోనాపై మరో పాట కూడా రాశాను. ఇంకా రికార్డ్ చేయాల్సి ఉంది. అలాగే ప్రధాని మోదీగారు, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు జగన్‌గారు, కేసీఆర్‌గారు ఇచ్చే మార్గదర్శకాలను అందరం ఫాలో అవుదాం. కరోనాను తరిమేద్దాం'' అని అన్నారు. ఆయన ఇంకా మాట్లాడుతూ- ''డాడీ', 'సీమసింహం', 'చెన్నకేశవరెడ్డి'... ఇలా 350కి చిత్రాలకు పైగా పాటలు రాశాను. జగన్‌గారి ఓదార్పు యాత్రకు సంబంధించిన పాటలు రాశాను. నేను దర్శకత్వం వహించిన 'మట్టిలో మాణిక్యాలు' చిత్రానికి నంది అవార్డు కూడా వచ్చింది. మరో సినిమాకు దర్శకత్వం వహించే కార్యక్రమాల్లో ఉన్నాను'' అన్నారు.

అందుకే తప్పుకున్నా

అమలాపాల్

మణిరత్నం దర్శకత్వంలో విక్రమ్, ఐశ్వర్యా రాయ్, త్రిష, కార్తీ, 'జయం' రవి ముఖ్య పాత్రల్లో తెరకెక్కుతున్న తమిళ చిత్రం 'పొన్నియిన్ సెల్వన్'. ప్రముఖ రచయిత కల్కి కృష్ణమూర్తి రచించిన పాపులర్ నవల 'పొన్నియిన్ సెల్వన్' ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో అమలా పాల్ కూడా నటించాల్సి ఉంది. కానీ షూటింగ్ ప్రారంభం కాక ముందే ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారామె. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమా చేయకపోవడానికి గల కారణాన్ని తెలిపారామె. 'మనకి ఆఫర్ చేసిన అన్ని సినిమాల్లో నటించలేము. 'పొన్నియిన్ సెల్వన్'లోని పాత్రకు నేను సరిపోను అనిపించింది. న్యాయం చేయలేము అనిపించినప్పుడు చేయకపోవడం ఉత్తమం. అందుకే ఆ సినిమా నుంచి బయటకు వచ్చేశాను. మణిరత్నంగారి సినిమాలో నటించే అవకాశం మళ్లీ వస్తుందని భావిస్తున్నాను'' అని పేర్కొన్నారు అమలా పాల్.

ఆర్జీవీ... ఓ రామబాణం

జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు

ప్రముఖ సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు దర్శకునిగా పరిచయమవుతున్న చిత్రం 'ఆర్జీవీ'. 'కార్తికేయ' చిత్రనిర్మాత వెంకట శ్రీనివాస్ బొగ్గరం, టారస్ సినీ కార్ప్ సమర్పణలో మాగ్నస్ సినీ ప్రైమ్ పతాకంపై బాల కుటుంబరావు పొన్నూరి ఈ సినిమా నిర్మించనున్నారు. నేడు శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని 'ఆర్జీవీ' చిత్రం టైటిల్ లోగో విడుదల చేసి, నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ- ''తా చెడ్డకోతి వనమెల్లా చెరిచినట్లు' తన పిచ్చి ఇజంతో యువతను పెడదోవ పట్టిస్తున్న ఒక వ్యక్తి ఫిలాసఫీ మీద సంధించిన రామబాణమే ఈ సినిమా. అందుకే శ్రీరామనవమిని పురస్కరించుకుని ఈ చిత్రం టైటిల్ లోగో విడుదల చేశాం'' అన్నారు. ''కరోనా వైరస్ ప్రభావం పూర్తిగా తగ్గిన వెంటనే చిత్రీకరణ ప్రారంభిస్తాం'' అన్నారు వెంకట శ్రీనివాస్ బొగ్గరం. సురేష్, రాశి, శ్రద్ధా దాస్, అమిత్, పునర్నవి భూపాలం, తేజ తదితరులు నటించనున్న ఈ చిత్రానికి కెమెరా: వేదాంత్ మల్లాది, సంగీతం: వీణాపాణి.

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
గురువారం
2-4-2020

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సైన్స్ కోర్సులకు మేటి ఇన్‌స్టిట్యూట్స్..

నేడు హాట్ కెరీర్‌లుగా నిలుస్తున్న ఇంజనీరింగ్, ఐటీ రంగాలకు మూలం సైన్స్. పరిశోధన రంగానికి ఆయువు పట్టు సైన్స్. ఉద్యోగాల కల్పనలో సైన్స్ కోర్సులది ఎప్పుడూ ముందు వరుసే! సైన్స్ పరిశోధనలతోనే ఆవిష్కరణలు సాధ్యమవుతాయి. జాతీయంగా, అంతర్జాతీయంగా సైన్స్ పరిశోధనలు, ఆవిష్కరణలకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో దేశంలోని టాప్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌ల్లో చదివితే.. ఉజ్వల కెరీర్‌కు ఎర్రతివాచీ పరిచినట్లే! ఈ నేపథ్యంలో దేశంలోని టాప్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌లు, అవి అందిస్తున్న కోర్సులు, ప్రవేశ ప్రక్రియలపై ప్రత్యేక కథనం...



ఐఐఎస్సీ

సైన్స్ విద్య, పరిశోధనలకు బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ) తలమానికంగా నిలుస్తోంది. ఓ వైపు సైన్స్‌లో వినూత్న కోర్సులు అందిస్తూనే.. మరోవైపు పరిశోధనల్లోనూ దూసుకెళ్తోంది. దీంతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి ముందు వరుసలో నిలుస్తోంది.

కోర్సులు:

- అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్, పోస్టుగ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్.
- **బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(రీసెర్చ్):** ఈ కోర్సు వ్యవధి నాలుగేళ్లు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణులు ఇందులో చేరేందుకు అర్హులు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలకు అదనంగా బయాలజీ, స్టాటిస్టిక్స్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్‌లను చదవిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత పరీక్షలో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీల అభ్యర్థులు ఉత్తీర్ణులైతే సరిపోతుంది. కోర్సుకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ ఫిబ్రవరి-ఏప్రిల్ మధ్య జరుగుతుంది.
- **పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సులు:** పీజీ స్థాయిలో మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ(ఎంటెక్), మాస్టర్ ఆఫ్ డిజైన్, మాస్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఎంటెక్ (స్పాన్సర్డ్).. కోర్సులు అందిస్తోంది. -బీటెక్/బీఈ ఉత్తీర్ణతతోపాటు వ్యాలిడ్ గేట్ స్కోరు కలిగిన అభ్యర్థులు ఎంటెక్‌లో ప్రవేశాలకు అర్హులు. బీఈ/బీటెక్/బీడీఈఎస్/బీఆర్క్ ఉత్తీర్ణత, వ్యాలిడ్ గేట్, సీడ్ స్కోరు కలిగిన అభ్యర్థులు మాస్టర్ ఆఫ్ డిజైన్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పీజీ రీసెర్చ్ ప్రోగ్రామ్స్:** ఐఐఎస్సీ బెంగళూరు ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌లో సైతం ప్రవేశం కల్పిస్తోంది. ఇందులో చేరేందుకు జామ్ స్కోర్ తప్పనిసరి. జామ్‌లో మ్యాథ్స్, మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్ పేపర్‌లో క్వాలిఫై అయిన బీఈ/బీటెక్ అభ్యర్థులు మ్యాథమెటికల్ సైన్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.
- జామ్‌లో బయోటెక్నాలజీ పేపర్‌లో క్వాలిఫై అయిన బీఈ/బీటెక్ అభ్యర్థులు బయోలాజికల్ సైన్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.
- జెస్ట్‌లో క్వాలిఫై అయిన అభ్యర్థులు ఫిజికల్ సైన్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఎంటెక్(రీసెర్చ్)/పీహెచ్‌డీ, -ఎక్స్‌టర్నల్ రిజిస్ట్రేషన్ ప్రోగ్రామ్(ఈఆర్‌పీ) సైతం అందుబాటులో ఉన్నాయి.

వెబ్‌సైట్: www.iisc.ac.in



నైపర్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైపర్).. ఫార్మా విద్య, పరిశోధనలకు ప్రసిద్ధిగాంచింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఏడు నైపర్‌లు ఉన్నాయి. ఇవి పలు స్పెషలైజేషన్స్‌తో పోస్టు గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ కోర్సులను అందిస్తున్నాయి. నైపర్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్‌ను నిర్వహిస్తారు.

అర్హతలు:

60 శాతం మార్కులతో బీఫార్మసీతోపాటు వ్యాలిడ్ జీప్యాట్ స్కోరు లేదా 6.75 సీజీపీఏ(10పాయింట్ల స్కేల్‌లో) ఉండాలి. ఫైనలియర్ ఫలితాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు నైపర్ మాస్టర్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక:

నైపర్ జేఈఈ మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి ఎంఎస్(ఫార్మా), ఎంఫార్మా, ఎంటెక్(ఫార్మా) కోర్సుల్లో ప్రవేశాలను ఖరారు చేస్తారు. ఎంబీఏ ఫార్మా(హైదరాబాద్, ఎస్.ఎ.ఎస్.నగర్) సీట్లను ఎంట్రన్స్ టెస్టు, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలలో పొందిన మార్కుల ఆధారంగా భర్తీ చేస్తారు. ఎంట్రన్స్ టెస్టుకు 85శాతం, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలకు 15 శాతం వెయిటేజీ ఉంటుంది.

పరీక్ష విధానం:

మాస్టర్స్, ఎంబీఏ(ఫార్మా) కోర్సులకు కామన్ ఎంట్రన్స్ టెస్టు నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం 200 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు కోత విధిస్తారు. ప్రశ్నలు.. బీఫార్మసీ, ఎంఎస్సీ స్థాయిలో ఉంటాయి.

పీహెచ్‌డీ

సీఎస్ఐఆర్/యూజీసీ/ఐసీఎంఆర్/డీబీటీ/ డీఎస్‌టీ నెట్-జేఆర్ఎఫ్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం:

ప్రవేశ పరీక్షను 85 మార్కులకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ప్రశ్నపత్రంలో 170 ప్రశ్నలు ఉంటాయి. పేపర్‌లో కెమికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగాలు ఉంటాయి. ప్రశ్నలను ఎంఎస్(ఫార్మా), ఎంఫార్మా, ఎంటెక్(ఫార్మా), ఎంబీఎస్‌సీ, ఎండీ, ఎంఎస్సీ సిలబస్ నుంచి అడుగుతారు. వీటితోపాటు ప్రతి విభాగంలో ఫార్మాస్యూటికల్ సైన్సెస్, జనరల్ ఆప్టిట్యూడ్‌ల నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కు కోత విధిస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు.

వెబ్‌సైట్: www.niperhyd.ac.in

ఐసీటీ

కెమికల్ ఇంజనీరింగ్, కెమికల్ టెక్నాలజీ, అప్లయిడ్ కెమిస్ట్రీ, ఫార్మసీ, బయోటెక్నాలజీ అండ్ బయోప్రాసెసింగ్ విభాగాల్లో ముంబైలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐసీటీ) అత్యుత్తమంగా నిలుస్తోంది. కెమికల్ ఇంజనీరింగ్‌తోపాటు ఏడు స్పెషలైజేషన్స్‌లో బీటెక్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. వీటిలో 70 శాతం సీట్లను మహారాష్ట్ర విద్యార్థులకు, 30 శాతం సీట్లను ఆలిండియా కోటాలో భర్తీ చేస్తారు.

కోర్సులు ఇవే:

- మాస్టర్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్,-మాస్టర్ ఆఫ్ ఫార్మసీ(ఎంఫార్మసీ) • మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ(ఎంటెక్) • ఎంఈ(ప్లాస్టిక్ ఇంజనీరింగ్) • ఎంఎస్సీ(కెమిస్ట్రీ, ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, టెక్స్‌టైల్ కెమిస్ట్రీ), -పీహెచ్‌డీ, • పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ కెమికల్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్.

ప్రవేశాలు:

- బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల్లో సీట్లను మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్టు ద్వారా భర్తీ చేస్తారు. గేట్/జీప్యాట్ స్కోరు ఆధారంగా మాస్టర్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

వెబ్‌సైట్: www.ictmumbai.edu.in

ఐసర్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్‌లు) సైన్సు విద్య, పరిశోధనల్లో జాతీయ ప్రాధాన్య సంస్థలుగా వెలుగొందుతున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఏడు ఐసర్‌లు ఉన్నాయి. వీటిలో ప్రవేశం పొందితే సైన్సు పరిశోధన, బోధన-ఇతర అనుబంధ రంగాల్లో చక్కటి కెరీర్ సొంతమవడం ఖాయం.

కోర్సులు:

- **బీఎస్-ఎంఎస్(డ్యూయల్ డిగ్రీ):** ఈ కోర్సును సైన్స్ పట్ల ఆసక్తి ఉన్న వారి కోసం ప్రత్యేకంగా రూపొందించారు. ఏడు క్యాంపస్‌లలో 1400కుపైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి. కోర్సు వ్యవధి ఐదేళ్లు. సైన్సు గ్రూపుతో ఇంటర్ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులైన వారు ప్రవేశాలకు అర్హులు.
- **బీఎస్ డిగ్రీ:** ఐసర్ భోపాల్.. ఎకనామిక్స్ అండ్ ఇంజనీరింగ్ సైన్సెస్‌లో నాలుగేళ్ల బీఎస్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. ఇందులో ప్రవేశానికి ఇంటర్ లేదా తత్సమాన స్థాయిల్లో మ్యాథ్స్‌ను తప్పనిసరిగా చదివుండాలి. ఇంజనీరింగ్ విభాగంలో 60 సీట్లు, ఎకనామిక్స్ విభాగంలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ప్రవేశాలు :

- ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్టు ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. వీటితోపాటు కేవీపీవై, జేఈఈ-అడ్వాన్స్‌డ్ విధానాల్లోనూ ప్రవేశాలు పొందవచ్చు.

పరీక్ష విధానం:

- పరీక్ష 60 ప్రశ్నలతో మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటుంది. బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ నుంచి 15 ప్రశ్నల చొప్పున అడుగుతారు. ప్రతి ప్రశ్నకు 3 మార్కులు ఉంటాయి. తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.

సిలబస్:

- ఐసర్ ఆప్టిట్యూడ్ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ఎన్‌సీఈఆర్‌టీ ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర పుస్తకాలను చదవాలి.

ముఖ్యతేదీలు:

- **దరఖాస్తుకు చివరితేదీ:** 30 ఏప్రిల్ 2020
- **హాల్‌టికెట్లు జారీ:** 18 మే 2020
- **ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్:** 31 మే 2020
- **వెబ్‌సైట్:** http://www.iiseradmission.in

సీసీఎంబీ

ఆధునిక జీవశాస్త్ర పరిశోధనలో హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ) ప్రముఖంగా నిలుస్తోంది. సీసీఎంబీ... సెల్ బయాలజీ, మాలిక్యులర్ బయాలజీ, జెనిటిక్స్, డెవలప్‌మెంటల్ బయాలజీ, ప్లాంట్ మాలిక్యులర్ బయాలజీ, కన్జర్వేషన్ బయాలజీ, ఎకాలజీ, ప్రొటీన్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, బయాలజీ ఆఫ్ మైక్రోమాలిక్యూల్స్, బయాలజీ ఆఫ్ ఇన్ఫెక్షన్, ఎపిజెనిటిక్స్, క్రొమాటిన్ బయాలజీ అండ్ బయోఇన్ఫర్మాటిక్స్ స్పెషలైజేషన్స్‌లో పీహెచ్‌డీని అందిస్తోంది. ఏటా అక్టోబర్‌లో అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తారు. దేశవ్యాప్తంగా దాదాపు 20 సెంటర్లలో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి అభ్యర్థులను ఇంటర్వ్యూకి ఎంపిక చేస్తారు.

వెబ్‌సైట్: www.ccmb.res.in

జేఎన్‌సీఏఎస్ఆర్

సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లలో ప్రపంచస్థాయి పరిశోధన, శిక్షణలను అందించేందుకు 1989లో జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్(జేఎన్‌సీఏఎస్ఆర్)ను స్థాపించారు. ప్రస్తుతం దాదాపు 300 మంది జేఎన్‌సీఏఎస్ఆర్‌లో వివిధ కోర్సులను అభ్యసిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది పీహెచ్‌డీ చేస్తున్నవారే కావడం గమనార్హం. పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ, ఎంఎస్ ఇంజనీరింగ్/ఎంఎస్ రీసెర్చ్ కోర్సుల్లో ప్రవేశాలకు గేట్/జెస్ట్/జీప్యాట్/యూజీసీ /సీఎస్ఐఆర్-నెట్ తదితర జాతీయ స్థాయి పరీక్షల్లో క్వాలిఫై అయ్యిండాలి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వేసవి ప్రారంభంలో ఇంటర్వ్యూలు నిర్వహించి.. తుది ఎంపిక చేపడతారు. కొన్ని కోర్సుల్లో జనవరిలోనూ ప్రవేశాలు చేపడతారు. జేఎన్‌సీఏఎస్ఆర్‌లో పైకోర్సులతోపాటు కెమిస్ట్రీలో మాస్టర్స్ ప్రోగ్రామ్‌ను సైతం ఆఫర్‌చేస్తోంది. కనీసం 55 శాతం మార్కులతో బీఎస్సీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు, వ్యాలిడ్ జామ్ స్కోర్ కలిగిన అభ్యర్థులు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారిలో నుంచి కొంత మందిని ఇంటర్వ్యూ నిర్వహించి తుది ఎంపిక చేపడతారు.

వెబ్‌సైట్: www.jncasr.ac.in



సీఎంఐ

చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్(సీఎంఐ) 1989లో ఏర్పాటైంది. మ్యాథ్స్ బోధన, పరిశోధనలో సీఎంఐకు దేశవ్యాప్త గుర్తింపు ఉంది. మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్‌లో సీఎంఐ పలు కోర్సులను అందిస్తోంది.

కోర్సులు:

- బీఎస్సీ(హానర్స్) ఇన్ మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్ • బీఎస్సీ(హానర్స్) ఇన్ మ్యాథమెటిక్స్ అండ్ ఫిజిక్స్ • ఎంఎస్సీ మ్యాథ్స్ • ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ • ఎంఎస్సీ డేటాసైన్స్, •పీహెచ్‌డీ (మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్).
- రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఈ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. పీహెచ్‌డీలో ప్రవేశాలకు జెస్ట్, ఎన్‌బీహెచ్‌ఎం ఫెలోషిప్‌కు ఎంపిక తదితరాలు తప్పనిసరి. ప్రస్తుతం సీఎంఐ దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది.

దరఖాస్తు సమాచారం:

- దరఖాస్తుకు చివరి తేదీ: 11 ఏప్రిల్ 2020
- హాల్ టిక్కెట్లు జారీ: 1 మే 2020
- ప్రవేశ పరీక్ష తేదీ: 15 మే 2020
- వెబ్‌సైట్: www.cmi.ac.in

ఎంసెట్ ప్రత్యేకం
- స్టడీమెటీరియల్
- బిట్ బ్యాంక్
- ఆన్‌లైన్ టెస్టులు
- మోడల్ పేపర్స్
- ప్రీవియస్ పేపర్స్

విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

టీఐఎఫ్ఆర్

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్).. టాటా ట్రస్ట్ సహకారంతో 1945లో ఏర్పాటైంది. దీని ప్రధాన క్యాంపస్ ముంబైలో ఉండగా.. పుణె, బెంగళూరు, హైదరాబాద్‌లలో సెంటర్స్ ఉన్నాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథమెటిక్స్, కంప్యూటర్‌సైన్స్, సైన్స్ ఎడ్యుకేషన్‌లలో పరిశోధనలకు టీఐఎఫ్ఆర్ పేరుగాంచింది.

కోర్సులు:

నేచురల్ సైన్స్ సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ-పీహెచ్‌డీ, ఎంఎస్సీ కోర్సులను టీఐఎఫ్ఆర్ అందిస్తోంది. పీహెచ్‌డీ కోర్సు వ్యవధి ఐదేళ్లు, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ-పీహెచ్‌డీ ఆరేళ్లు, ఎంఎస్సీ రెండేళ్లుగా ఉంది. ఈ కోర్సుల్లో రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తారు. దరఖాస్తు చేసుకున్నవారిలో టాప్ ఒకటిన్నర శాతం మందికే టీఐఎఫ్ఆర్‌లో ప్రవేశాలు లభిస్తుంటాయి. దీన్ని బట్టి టీఐఎఫ్ఆర్‌కు ఉన్న క్రేజ్‌ను అర్థంచేసుకోవచ్చు.

వెబ్‌సైట్: https://www.tifr.res.in

యుద్ధ ప్రాతిపదికన

'ఆపరేషన్ మర్కజ్'

తబ్లిగి జమాత్‌కు హాజరైనవారిని, ఆ తరువాత వారు సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించి, క్వారంటైన్ చేసేందుకు ప్రభుత్వాల ముమ్మర ప్రయత్నాలు

- యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు
- వీసా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలకు సమాయత్తం

సాక్షి, న్యూఢిల్లీ: కరోనా వైరస్ హాట్‌స్పాట్‌గా మారిన ఢిల్లీలోని నిజాముద్దీన్ తబ్లిగి జమాత్‌కు హాజరై, స్వస్థలాలకు తిరిగివెళ్లిన వారి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జల్లెడ పడుతున్నాయి. వారిలో ఇప్పటివరకు వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో దాదాపు 6 వేల మందిని అధికారులు గుర్తించారు. వారిలో 5 వేల మందిని క్వారంటైన్ చేశారు. వివిధ రాష్ట్రాల్లోని మిగతా సుమారు 2 వేల మంది కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఆ 2 వేల మందిలో గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలవారే అధికంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో, తబ్లిగి జమాత్ సదస్సుకు హాజరై స్వస్థలాలకు వెళ్లిన వారు.. ఆ తరువాత ఎవరెవరిని కలిశారో యుద్ధ ప్రాతిపదికన ఆరా తీయాలని కేంద్రం రాష్ట్రాలను మరోసారి ఆదేశించింది. తబ్లిగి జమాత్‌లో పాల్గొన్న వారిలో చాలామంది వైరస్ బారిన పడుతున్న నేపథ్యంలో కేంద్రం రాష్ట్రాలను మరోసారి అప్రమత్తం చేసింది. కేబినెట్ సెక్రటరీ రాజీవ్ గౌబా బుధవారం అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. తబ్లిగి జమాత్ మర్కజ్‌కు హాజరైన వారు ఆ తరువాత ఎవరెవరని కలిశారన్న విషయం గుర్తించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనిచేయాలని ఆయన కోరారు. తబ్లిగి జమాత్‌లో పాల్గొన్న విదేశీయులు వీసా నిబంధనలను ఉల్లంఘించినట్టు తేలిందని, వీసా నిబంధనలను ఉల్లంఘించిన విదేశీయులపైన, నిర్వాహకులపైన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను కోరారు. వారం రోజుల్లోగా రాష్ట్రాలు ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజనను అమలు చేయాలని కోరారు. ఈ పథకం కింద రూ. 27,500 కోట్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నారు. సరుకులను ఎలాంటి అడ్డంకులు లేకుండా రాష్ట్రాల మధ్య రవాణా జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఈ సందర్భంగా అంతా భౌతిక దూరం పాటించేలా చూడాలని రాష్ట్రాలను కోరారు.

కరోనాపై పోరుకు భారీ నష్టం

కరోనా కట్టడికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలకు ఢిల్లీలో జరిగిన తబ్లిగి జమాత్ సమావేశం భారీ నష్టం చేకూర్చిందని జాతీయ మైనారిటీ కమిషన్ ఆవేదన వ్యక్తం చేసింది. మదర్సాలు, ఇతర మత ప్రదేశాలు లాక్‌డౌన్‌ను కచ్చితంగా అమలు చేసేలా చూడాలని రాష్ట్రాలను కోరింది. నిజాముద్దీన్ ఘటన లాక్‌డౌన్‌ను ఉల్లంఘించడమే కాకుండా, సహ పౌరుల ప్రాణాలను పణంగా పెట్టడమేనని ఎన్‌సీఎం చీఫ్ సయ్యద్ ఘయోరుల్ హసన్ రిజ్వీ పేర్కొన్నారు. ఉల్లంఘనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లాక్‌డౌన్‌ను కచ్చితంగా అమలు చేసేందుకు మత పెద్దల సహకారం తీసుకోవాలన్నారు. జమాత్‌కు హాజరైనవారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కరోనా నిర్ధారణ పరీక్షలు జరిపించుకోవాలని కోరారు.

■ కరోనా హాట్‌స్పాట్స్, క్వారంటైన్ కేంద్రాలు, బహిరంగ ప్రదేశాలను వైరస్ రహితంగా చేసేందుకు ఫైర్ సర్వీస్ సిబ్బంది సేవలను ఉపయోగించుకోవాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్ అధికారులను ఆదేశించారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఇతర ఉన్నతాధికారులతో బుధవారం ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

■ తబ్లిగి జమాత్ మర్కజ్ నుంచి గత 36 గంటల్లో 2,361 మందిని తరలించామని ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా తెలిపారు. వారిలో 617 మందిని ఆసుపత్రులకు, మిగతావారిని క్వారంటైన్ కేంద్రాలకు పంపించామన్నారు.

■ రాజస్థాన్‌లోని అజ్మీర్ జిల్లాలో ఉన్న సర్వార్ పట్టణంలోని ఒక దర్గాలో మంగళవారం జరిగిన మతపరమైన కార్యక్రమానికి 100 మందికి పైగా ప్రజలు హాజరయ్యారు. వారిని పంపించేందుకు పోలీసులు స్వల్పంగా లాఠీచార్జి చేయాల్సి వచ్చింది.

దేశ రాజధాని ఢిల్లీలో మత కార్యక్రమం తబ్లిగి జమాత్ మర్కజ్ జరిగిన నిజాముద్దీన్ మసీద్ ప్రాంతాన్ని బుధవారం రసాయనాలతో శుద్ధి చేస్తున్న ప్రభుత్వ సిబ్బంది

లాక్‌డౌన్ నేపథ్యంలో బుధవారం జమ్మూలో మాస్కులు ధరించి వీధుల్లో పహరా కాస్తున్న భద్రతా సిబ్బంది

మహారాష్ట్రలోని థానేలో లాక్‌డౌన్ ను ఉల్లంఘించిన యువకుడిపై లాఠీచార్జీ చేస్తున్న పోలీసు

'తబ్లిగి జమాత్'తో పెరిగిన కేసులు

ఢిల్లీలో బుధవారం నిజాముద్దీన్ మసీదు పరిసరాలను శుభ్రం చేసిన ప్రభుత్వ సిబ్బందితో భౌతిక దూరం పాటిస్తూ ఇంటర్వ్యూ చేస్తున్న మీడియా ప్రతినిధులు

- దేశవ్యాప్తంగా కరోనాతో 1,637 కేసులు, 38 మరణాలు నమోదయ్యాయన్న కేంద్రం
- రాష్ట్రాలవారీ లెక్కలు చూస్తే కేసుల సంఖ్య 1,910, మరణాలు 58

న్యూఢిల్లీ: గత 24 గంటల వ్యవధిలో దేశవ్యాప్తంగా 376 కొత్త కరోనా కేసులు, మూడు మరణాలు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య శాఖ బుధవారం ప్రకటించింది. ఢిల్లీలో జరిగిన తబ్లిగి జమాత్‌కు హాజరై 'కరోనా'తో తిరిగి స్వస్థలాలకు వెళ్లిన వారి వల్ల ఒక్కసారిగా కేసుల సంఖ్య పెరిగిందని వివరించింది. అంతేకానీ, ఇది దేశవ్యాప్తంగా చోటు చేసుకున్న ట్రెండ్ కాదని స్పష్టం చేసింది. కరోనాతో ఇప్పటివరకు 1,637 కేసులు, 38 మరణాలు నమోదయ్యాయని వెల్లడించింది. అలాగే, 132 మంది చికిత్స అనంతరం కోలుకుని ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ అయ్యారని తెలిపింది. వీరిని మినహాయిస్తే చికిత్స పొందుతున్న కేసుల సంఖ్య 1,446కి చేరుతుందని పేర్కొంది. ఢిల్లీలోని తబ్లిగి జమాత్‌కు హాజరైనవారికి సంబంధించి బుధవారం కొత్తగా 154 కేసులు నమోదయ్యాయని ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ లవ్ అగర్వాల్ వెల్లడించారు. వీటిలో జమ్మూకశ్మీర్ నుంచి 23, ఢిల్లీ నుంచి 18, తమిళనాడు నుంచి 65 ఉన్నాయన్నారు.

రాష్ట్రాల లెక్క వేరే

అయితే, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ప్రకటించిన సమాచారం ప్రకారం, కేసుల సంఖ్య 1,910గా, మృతుల సంఖ్య 58గా తెలుస్తోంది. దేశవ్యాప్తంగా బుధవారం సుమారు 400 కొత్త కేసులు, కనీసం 11 మరణాలు నమోదైనట్లు రాష్ట్రాల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మొత్తం కేసుల సంఖ్య ఢిల్లీలో 152కి, మహారాష్ట్రలో 335కి పెరిగిందని ఆయా రాష్ట్రాలు ప్రకటించాయి. మహారాష్ట్రలో బుధవారం ఒక్కరోజే 33 కొత్త కేసులు నమోదవగా, అందులో 30 ఒక్క ముంబైలోనే నమోదయ్యాయి. బుధవారం మహారాష్ట్రలో కోవిడ్-19తో ఆరుగురు మరణించారు. దాంతో, రాష్ట్రంలో మొత్తం మరణాల సంఖ్య 16కి చేరింది. కాగా, ప్రస్తుతం మహారాష్ట్రలో క్వారంటైన్‌లో ఉన్న 5 వేల మందిలో అత్యధికులు హై రిస్క్ కేటగిరీలో ఉన్న నేపథ్యంలో.. కేసుల సంఖ్య భారీగా పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. తమిళనాడులో మొత్తం కేసుల సంఖ్య 234కి చేరింది. వీటిలో 110 కేసులు ఢిల్లీలోని తబ్లిగి జమాత్‌కు హాజరైనవారికి సంబంధించినవే కావడం గమనార్హం. ఢిల్లీ జమాత్‌కు హాజరైన వారిలో ఉత్తరప్రదేశ్‌లో 569 మందిని, గుజరాత్‌లో 85 మందిని, కర్ణాటకలో 50 మంది విదేశీయులను క్వారంటైన్ చేశారు. గుజరాత్ నుంచి భారీగా దాదాపు 1,500 వరకు ఆ మత సమావేశాలకు హాజరయినట్లు సమాచారం. అస్సాం నుంచి ఢిల్లీ మర్కజ్‌కు 347 మంది హాజరు కాగా, వారిలో 230 మందిని క్వారంటైన్ చేసినట్లు ఆ రాష్ట్రం ప్రకటించింది.

లైఫ్ లైన్ విమానాలు

కరోనాపై పోరులో భాగంగా 20 వేల రైలు కోచ్‌ల్లో దాదాపు 3.2 లక్షల ఐసోలేషన్, క్వారంటైన్ బెడ్స్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. 5 వేల కోచ్‌ల్లో బెడ్స్ ఏర్పాటు ఇప్పటికే ప్రారంభమైందన్నారు. నిర్ధారణ పరీక్షల కిట్స్, ఔషధాలు, మాస్క్‌ల తరలింపు కోసం పౌర విమానయాన శాఖ 'లైఫ్‌లైన్' విమానాలను సిద్ధం చేసిందన్నారు. గత 5 రోజుల్లో ఈ విమానాల ద్వారా 15.4 టన్నుల వైద్య పరికరాల సరఫరా జరిగిందన్నారు.

నేడు సీఎంలతో మోదీ వీడియో కాన్ఫరెన్స్

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. కరోనా కట్టడికి చేపట్టాల్సిన చర్యలు, వలస కార్మికుల సామూహిక ప్రయాణాలు, తబ్లిగి జమాత్‌లో పాల్గొన్నవారు, ఆ తరువాత కలిసిన వారిని గుర్తించడం, నిత్యావసర వస్తువులను ప్రజలకు అందుబాటులో ఉంచడం.. తదితర అంశాలు ఆ సమావేశంలో చర్చకు రావచ్చని సంబంధిత వర్గాలు బుధవారం వెల్లడించాయి.

కరోనాతో ఆహార సంక్షోభం

న్యూఢిల్లీ: కరోనా సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కోకపోతే ప్రపంచ ప్రజలకు ఆహార కొరత ప్రమాదం పొంచివున్నదని మూడు అంతర్జాతీయ సంస్థల అధిపతులు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా కరోనాని అడ్డుకునేందుకు లాక్‌డౌన్‌ని ప్రకటించిన నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్యం, ఆహార సరఫరా తగ్గుముఖం పట్టింది. లాక్‌డౌన్ కారణంగా భవిష్యత్తులో ఆహార కొరత ఏర్పడుతుందనే భయంతో అనేక దేశాల్లోని ప్రజలు ముందుగానే సరుకులను కొనిపెట్టుకోవడంతో సూపర్ మార్కెట్లు తదితర షాపుల్లో వస్తువుల సరఫరా నిలిచిపోయింది. ఆహార లభ్యతపై ఏర్పడుతోన్న సందిగ్ధత అంతర్జాతీయ ఎగుమతులపై ఆంక్షలకు కారణమౌతోంది, ఇది ప్రపంచ మార్కెట్‌లో ఆహార కొరతకు దారితీస్తోందని ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ అధిపతి క్యూ డొంగ్యూ హెచ్చరించారు.

కరోనాకు వైరాలజిస్ట్ గీతా రామ్‌జీ బలి!

జొహానెస్‌బర్గ్: ప్రపంచ ప్రఖ్యాత వైరాలజిస్టు, భారతీయ సంతతి శాస్త్రవేత్త గీతా రామ్‌జీ కరోనా మహమ్మారికి బలయ్యారు. ప్రాణాంతక హెచ్ఐవీ నిరోధానికి జరుగుతున్న పరిశోధనల్లో గీతా రామ్‌జీ చురుకుగా పాల్గొన్నారు. వారం రోజుల క్రితం లండన్ నుంచి దక్షిణాఫ్రికా వచ్చిన యాభై ఏళ్ల గీతా రామ్‌జీలో కోవిడ్ లక్షణాలు కనిపించడంతో ఆసుపత్రిలో చేరారు. చివరకు ప్రాణాలు కోల్పోయారు.

ఆ డాక్టర్ల కుటుంబానికి రూ.కోటి: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: తమ రాష్ట్రంలో వైద్యులు ఎవరైనా కరోనా బాధితులకు వైద్యం చేస్తూ మరణిస్తే వారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇస్తామని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. ప్రైవేట్, ప్రభుత్వ డాక్టర్లు, నర్సులు, ఆసుపత్రుల్లోని పారిశుధ్య సిబ్బందికి ఇది వర్తిస్తుందన్నారు.

50వేల చొప్పున సుప్రీంకోర్టు జడ్జీల విరాళం

న్యూఢిల్లీ: కరోనాపై యుద్ధానికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పీఎం కేర్స్ నిధికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రూ.50 వేల చొప్పున విరాళం అందజేశారు.

ధరల నియంత్రణకు ఏం చేశారో చెప్పండి

మాస్కులు, శానిటైజర్లపై కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రజల భయాందోళనలను దుకాణదారులు సొమ్ము చేసుకుంటున్నారని, మాస్కులు, శానిటైజర్లు, లిక్విడ్ సోప్‌లను ఎంఆర్‌పీకి మించి అధిక ధరలకు అమ్ముతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని కేంద్రం, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు నిలదీసింది. ధరలను కట్టడి చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని ఆదేశించింది. ఈ మేరకు కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.

ఇరాన్‌లోని 250 మంది భారతీయులకు కరోనా పాజిటివ్

ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయ యాత్రికులను క్షేమంగా వెనక్కి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం బుధవారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఇప్పటికే 500 మంది వెనక్కి తీసుకొచ్చామని గుర్తుచేసింది. ఇంకా 250 మంది అక్కడే ఉన్నారని పేర్కొంది. ఆ 250 మంది భారతీయులకు కరోనా పాజిటవ్ ఉన్నట్లు పరీక్షల్లో తేలిందని, వారు అక్కడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు.

రక్షణ పరికరాలపై వివరణ ఇవ్వండి

కరోనా వైరస్ బాధితులకు వైద్య సేవలందించే డాక్టర్లకు, ఇతర సిబ్బందికి ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ప్రమాణాలతో కూడిన రక్షణ పరికరాలు అందించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. దీనిపై వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన ఓ వైద్యుడి ఈ పిటిషన్ దాఖలు చేశారు. కరోనా బాధితులకు వైద్యం చేసేవారికి డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాల మేరకు రక్షణ పరికరాలు సరఫరా చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని న్యాయస్థానాన్ని కోరారు.

ఆ పిటిషన్‌పై రెండు వారాల తర్వాతే విచారణ

దేశంలో ఆర్థిక అత్యవసర పరిస్థితి విధించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై రెండు వారాల విచారణ చేపతామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించడంతో దేశవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ స్తంభించిందని సెంటర్ అకౌంటబిలిటీ, సిస్టమిక్ ఛేంజ్(సీఏఎస్‌సీ) అనే సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. అందుకే ఆర్థిక అత్యవసర పరిస్థితిని విధించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

బీసీజీ వ్యాక్సిన్‌తో కరోనా నుంచి రక్షణ?

న్యూఢిల్లీ: పుట్టిన వెంటనే నవజాత శిశువులకు ఇచ్చే బాసిల్లస్ కాల్‌మెట్టే గుయారిన్ (బీసీజీ) టీకా కరోనాపై పోరులో కీలకం కానుందని అమెరికా శాస్త్రవేత్తలు అంటున్నారు. క్షయ వ్యాధి నివారణకు ఇచ్చే బీసీజీ టీకాతోపాటు సార్వత్రిక టీకా కార్యక్రమాలు లేని దేశాల్లో కరోనా తీవ్రత ఎక్కువగా ఉందని, న్యూయార్క్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్త గొజాలో ఓటాజూ తెలిపారు. అమెరికాలో సుమారు 1.90 లక్షల మంది ఈ వ్యాధి బారిన పడగా ఇటలీలో ఈ సంఖ్య 1.05 లక్షలుగా ఉంది. అమెరికాలో నాలుగు వేల మంది, ఇటలీలో 12 వేల మంది ప్రాణాలు కోల్పోయారు.

భౌతిక దూరం ఎనిమిది మీటర్లు?

న్యూఢిల్లీ: ప్రాణాంతక కరోనా వైరస్ ఊపిరి పదిలినప్పుడు ఎనిమిది మీటర్ల దూరం వరకూ ప్రయాణించగలదని, గాల్లోనే నాలుగు గంటలపాటు ఉండగలదని అమెరికాలోని మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు జరిపిన తాజా పరిశోధన తెలిపింది. దీంతో వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తున్న ఒక ట్రెండు మీటర్ల భౌతిక దూరం ఎంతవరకూ పనిచేస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. జర్నల్ ఆఫ్ ద అమెరికన్ మెడికల్ అసోసియేషన్ తాజా సంచికలో ప్రచురితమైన పరిశోధన వ్యాసంలో ఎంఐటీ శాస్త్రవేత్తలు ఈ విషయాలను స్పష్టం చేశారు. దగ్గు, తుమ్ము వంటి వాటి వల్ల గాల్లో ఏర్పడే మేఘాల్లాంటి నిర్మాణాలపై 1930లలో జరిగిన పరిశోధనల ఆధారంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒక ట్రెండు మీటర్ల భౌతిక దూరాన్ని ప్రతిపాదించిందని, కానీ ఈ అంచనాలు ఇప్పుడు పనికిరావని అసోసియేట్ ప్రొఫెసర్ లిడియా బౌరౌబా హెచ్చరించారు అన్ని రకాల నీటి తుంపర్లు వైరస్‌ను కలుపుకుని 23 నుంచి 27 అడుగుల దూరం ప్రయాణించగలవని తెలిపారు. తుంపర బిందువు పరిమాణంపై ఏకపక్షంగా నిర్ణయాలు జరిగాయని, వాటి ఆధారంగా మార్గదర్శకాలు జారీ చేశారని ఆరోపించారు.

వారికి ముందస్తు వేతనాలివ్వండి: సోనియా

న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేసే కార్మికులకు 21 రోజుల వేతనాన్ని ముందుగానే ఇవ్వాలంటూ కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ ప్రధాని మోదీకి బుధవారం లేఖ రాశారు. లాక్ డౌన్ కారణంగా గ్రామీణ పేదలు ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సమయంలో వారికి ఇచ్చే ముందస్తు వేతనం మరింత ఉపయోగపడుతుందని చెప్పారు. లాక్ డౌన్ కారణంగా ఇళ్లలో మిగిలిపోయిన కార్మికులకు ఆదాయం వచ్చే మరో మార్గం లేదని, ముందస్తు వేతనాలు ఇస్తే దాదాపు 8 కోట్ల మంది కార్మికులు లబ్ధి పొందుతారని పేర్కొన్నారు.

కొనసాగుతున్న విధ్వంసం

పారిస్: కరోనా మృత్యుపాశానికి బలవుతున్న వారి సంఖ్య బుధవారం నాటికి మరింత పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా 186 దేశాలకు విస్తరించిన ఈ మహమ్మారి కారణంగా మరణించిన వారి సంఖ్య ఏకంగా 43,082కు చేరుకోగా, వైరస్ సోకిన వారి సంఖ్య 8.65 లక్షలు దాటిపోయింది. అయితే సుమారు 1.72 లక్షల మంది చికిత్స తరువాత వ్యాధి నయమై ఇళ్లకు చేరుకోవడం ఒకింత సాంత్వన కలిగించే అంశం. గత ఏడాది చైనాలో తొలిసారి గుర్తించిన ఈ వైరస్ ఇప్పుడు యూరప్, అమెరికాల్లో తీవ్రస్థాయిలో విజృంభిస్తోంది.

అమెరికాలో 4వేల మంది..

న్యూయార్క్: అమెరికాలో కోవిడ్ కారణంగా మరణించిన వారి సంఖ్య నాలుగు వేలు దాటిపోయింది. ఈ మరణాల పరంపర ఇప్పుడిప్పుడే ఆగేది కాదని, అమెరికాలోనే సుమారు లక్ష నుంచి రెండు లక్షల మంది ప్రాణాలను బలిగొనే అవకాశముందని ఆ దేశంలోనే అత్యున్నత ఆరోగ్య నిపుణుడు హెచ్చరించడం ఆందోళన కలిగించే అంశమైంది. దేశవ్యాప్తంగా మంగళవారం నాటికి సుమారు 1,90,000 మంది వైరస్ బారిన పడగా, నాలుగు వేల మంది మరణించారని జాన్ హాప్కిన్స్ యూనివర్సిటీ కరోనా వైరస్ రిసోర్స్ సెంటర్ చెబుతోంది. 2001నాటి అల్‌ఖైదా దాడుల్లో మరణించిన వారు మూడు వేల వరకూ ఉంటే కరోనా మృతుల సంఖ్య దీనికంటే ఎక్కువవడం గమనార్హం. అంతేకాదు.. కరోనావైరస్ పుట్టిల్లుగా చెప్పుకునే చైనాలో ఇప్పటివరకూ దాదాపు 3,300 మంది మాత్రమే మరణించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా... అమెరికా రానున్న రెండు వారాల్లో అత్యంత కఠినమైన, వేదన భరితమైన పరిస్థితులను ఎదుర్కోనుందని, ప్రజలు ఈ కష్టాలన్నింటినీ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ట్రంప్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ''రెండు వారాల కష్టకాలం ముందు ఉంది. ఆ తరువాత, నిపుణులు అంచనా వేస్తున్నట్లు, నేను.. మనలో చాలామంది ఆలోచిస్తున్నట్లుగా పరిస్థితిలో మెరుగుదల కనిపిస్తుందని ఆశిస్తున్నాం. అయితే ఈ రెండు వారాలు మాత్రం చాలా చాలా బాధకరంగా ఉండబోతున్నాయి''అని స్పష్టం చేశారు.

ఇరాన్‌లో మృతులు 3036 మంది!

మధ్యప్రాచ్య దేశం ఇరాన్‌లో గత 24 గంటల్లో సుమారు 138 మంది కరోనా కారణంగా మరణించారని, కొత్తగా 2,987 మందికి వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయ్యిందని ఆరోగ్య శాఖ అధికార ప్రతినిధి కిమానౌష్ జహాన్‌పూర్ తెలిపారు. దేశంలో కరోనా కేసుల సంఖ్య 4,75,93కి చేరుకోగా 3,036 మంది మరణించారని చెప్పారు.

ఫ్రాన్స్‌లోని పారిస్‌లో ఉన్న ఓర్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రన్‌వేపై నిలిచిపోయిన విమానాలు

యూరప్‌లో 30 వేల మంది మృతి

పారిస్: కరోనా వైరస్ కారణంగా యూరప్ లో మరణించిన వారి సంఖ్య బుధవారానికి 30 వేలకు చేరుకుంది. అందులో ఇటలీ, స్పెయిన్ లోనే అధికంగా మరణాలు నమోదయ్యాయి. మొత్తం 4,58,601 కేసులకు గానూ 30,063 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో ఒక్క ఇటలీలోనే 12,428 మంది మరణించగా, స్పెయిన్ 8,189 మంది, ఫ్రాన్స్ లో 3,523 మంది మరణించారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా కారణంగా 40 వేల మంది మరణించారు.

ఆయా దేశాల్లో..

స్పెయిన్ ఇప్పటికే ఆస్పత్రుల్లోని బెడ్లను 20 శాతం పెంచింది. పదుల సంఖ్యలో హోటళ్లను రికవరీ గదులుగా మార్చింది. క్రీడా కేంద్రాలు, లైబ్రరీలు, ఎగ్జిబిషన్ సెంటర్లను కూడా ఆస్పత్రులుగా మలచేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా తగినన్ని ఐసీయూ యూనిట్లు లేకపోవడంతో పరిస్థితిని అదుపు చేయడం కష్టమవుతోంది. ఇటలీ, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు తమ దేశాల్లోని మెడికల్ విద్యార్థులను, రిటైర్డ్ వైద్యులను, చివరకు విమానాల్లోని మెడికల్ సిబ్బందిని కూడా కరోనా రోగుల కోసం రావాల్సిందిగా పిలుపునిస్తున్నారు. ఇప్పటికే ఇటలీలో 10 వేల మంది వైద్య సిబ్బందికి, 60 మంది వైద్యులకు కూడా కరోనా సోకింది. మరోవైపు పారిస్ గత వారమే తమ ఆస్పత్రులలోని ఐసీయూ బలాన్ని రెండింతలు చేసింది. అవన్నీ కూడా రోగులతో నిండిపోయాయి.

మేటపల్లి మున్సిపాలిటీ
టెండరు ప్రకటన
1) NIT No.11/MCM/E1/E-Proc/2019-20, Dt: 01.04.2020 2) పనుల సంఖ్య: 09 పట్టణ ప్రగతి గ్రాంట్స్ /CDP/SCSP-TSP నుండి, 3) మొత్తం E.C.V. రూ.20,72,724.00 4) బిడ్డ దాఖలుకు ఆఖరు తేది & సమయం తేది: 13.04.2020 సా.5.00 గం. 5) బిడ్ తెరుచు తేది, సమయం: తేది: 15.04.2020 ఉ.11.00 గం. 6) పనుల సంఖ్య: 01(LRS/ASC/MGF)- 2వ పిలుపు 7) E.C.V. రూ.39,93,600.00 8) బిడ్డ దాఖలుకు ఆఖరు తేది: 07.04.2020, సా.5.00 గం. 9) బిడ్ తెరుచు తేది & సమయం తేది: 08.04.2020, ఉ.11.00 గం. 10) సంబంధిత అధికారి పేరు & చిరునామా: కమిషనర్, మెట్‌పల్లి మున్సిపాలిటీ, జిల్లా: జగిత్యాల, సంప్రదించు నం.9866577636. వివరాల కోసం www.tender.telangana.gov.inలో చూడవచ్చును. సం/- కమిషనర్, మెట్‌పల్లి మున్సిపాలిటీ
DIPR Ro.No.1037-PP/CL/Advt/1/2020-21, Dt: 01.04.2020

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
సమగ్ర శిక్షా
స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీస్
KBC బాయ్స్ హై స్కూల్ క్యాంపస్, రైతు బజార్ ఎదురుగా, పటమట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
No. SSA-16021/4/2019-MIS SEC-SSA, తేది: 01.04.2020
ప్రతిపాదన కోసం అభ్యర్థన
సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ వారు 2020-21 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విద్యా మరియు సంక్షేమ శాఖలకు చెందిన ప్రభుత్వ/ MPP/ ZPP/ మున్సిపల్/ KGBVలు/ మోడల్ స్కూల్స్/ ఆశ్రమ పాఠశాలలు/రెసిడెన్షియల్/ఎయిడెడ్ స్కూల్స్‌లో I నుండి X తరగతులు చదివే విద్యార్థులందరికీ (సుమారుగా 40 లక్షల మంది) "జగనన్న విద్యా కానుక" పథకం క్రింద 3(మూడు) జతల యూనిఫామ్ క్లాత్ సేకరణ మరియు సరఫరా కోసం ప్రతిపాదన కోసం అభ్యర్థనను కోరుతున్నారు. వివరాల కోసం 03.04.2020 నుండి https://tender.apeprocurement.gov.in చూడవలెను. టెండరు/ RFP ఫారాన్ని వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. అర్హత గల సంస్థలు పైన తెలిపిన సైట్‌లో ఇచ్చిన షెడ్యూల్స్ ప్రకారం నిర్ణీత నమూనాలో అప్‌లోడ్ చేయవచ్చును. సంప్రదించు నం. 0866-2428599.
సం/- వాడ్రేవు చినవీరభద్రుడు, IAS, స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్
DIPR RO. No. 01 PP/CL/ADVT/1/1/2020-21; Dt : 01.04.2020

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
TSTRANSCO వారు దిగువ వివరించిన విధంగా ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టర్న్‌కీ ప్రాతిపదికపైన దిగువ తెలిపిన వాటి రవాణా, సివిల్ & కన్‌స్ట్రక్షన్ పనుల

సాక్షి 24|7
నల్లగొండ

NALGONDA DISTRICT

గురువారం, 2, ఏప్రిల్, 2020

సీతారాముల ఎదుర్కోలు

నల్లగొండ టౌన్ : రెండో భద్రాద్రిగా పేరొందిన నల్లగొండలోని రామగిరి శ్రీసీతారామ స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా బుధవారం స్వామివారి ఎదుర్కోలు నిర్వహించారు. 'కరోనా' కారణంగా పరిమిత సంఖ్యలో ఉన్న భక్తుల సమక్షంలో ఎదుర్కోలు, పల్లకి సేవ నిర్వహించారు.

న్యూస్‌రీల్

'ఆశ్రమ' విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పాఠాలు

నల్లగొండ/పెద్దవూర : ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా ప్రత్యేకంగా ఆన్‌లైన్ పాఠాలను తయారు చేయించినట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి(డీటీడీఓ) టి.నారాయణస్వామి బుధవారం తెలిపారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా గిరిజన సంక్షేమ శాఖ విద్యార్థులకు ప్రత్యేక చర్యలను చేపట్టినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో 8 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు పేర్కొన్నారు. కరోనా నేపథ్యంలో ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించడంతో వరుసగా సెలవులు వచ్చాయని, విద్యార్థుల రివిజన్ తరగతులకు ఎలాంటి ఆటంకం కలగకుండా 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా పాఠాలను బోధించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్‌ల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తరగతులను బోధనా విధానంపై అవగాహన కల్పించడానికి చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. ఆండ్రాయిడ్ ఫోన్‌లు ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు http://www.academiax.org అనే ఆన్‌లైన్ పోర్టల్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత ప్రధానోపాధ్యాయులను గానీ, వార్డెన్‌ల ద్వారా నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు గిరిజన సంక్షేమ శాఖ నల్లగొండ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి 9704484781 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

లాక్‌డౌన్ పాటించాలి

సరుకులు అందజేస్తున్న జిల్లా జడ్జి రమేష్

నల్లగొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 14వ తేదీ వరకు విధిగా లాక్‌డౌన్ పాటించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్ అన్నారు. బుధవారం స్థానికంగా జనగణమన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రోజువారి కూలీలు, వలస కార్మికుల కోసం నిత్యావసర సరుకుల ఉచిత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భౌతిక దూరం పాటించడం ద్వారానే వైరస్‌ను నివారించవచ్చన్నారు. లాక్‌డౌన్ వల్ల రోజువారీ కూలీలు, వలస కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు జడ్జి వీవీ నాదారెడ్డి, న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జి.వేణు, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కర్నాటి విజయ్‌కుమార్, సభ్యుడు, ఎంవీఆర్ విద్యాసంస్థల అధినేత కొలనుపాక రవికుమార్, దోసపాటి శ్రీనివాస్, చంద శ్రీనివాస్, కోల జనార్దన్, శ్యాంసుందర్‌రెడ్డి, రమేష్, ప్రదీప్, వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అంతరాష్ట్ర కదలికలపై నిఘా పెంచాం : ఏఎస్పీ

మాట్లాడుతున్న ఏఎస్పీ నర్మద

నాగార్జునసాగర్ : కరోనా వైరస్ నియంత్రణకు రాష్ట్ర సరిహద్దులను పూర్తిగా మూసివేయడంతో పాటు అంతరాష్ట్రంలోని ప్రజల కదలికలపై నిఘా పెంచినట్లు జిల్లా ఏఎస్పీ నర్మద తెలిపారు. బుధవారం జిల్లా సరిహద్దులో నాగార్జునసాగర్ చెక్‌పోస్టును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరోనా వైరస్ కట్టడికి విధించిన లాక్‌డౌన్ జిల్లాలో ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో వందశాతం సఫలీకృతమవుతోందన్నారు. ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్‌లో జరిగిన మత ప్రార్థనలకు జిల్లా నుంచి హాజరైన 46మందిని గుర్తించినట్లు తెలిపారు. ఆమె వెంట సాగర్ సీఐ గౌరు నాయుడు, ఎస్ఐ సీనయ్య తదితరులున్నారు.

యాచకులకు వసతి

నల్లగొండ టూటౌన్ : కరోనా వైరస్ కారణంగా ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించడంతో యాచకులకు నల్లగొండలో మెప్మా ఆధ్వర్యంలోని నైట్ షెల్టర్‌లో వసతి ఏర్పాటు చేశారు. పట్టణంలోని 16 మంది యాచకులను స్థానికంగా ఉన్న పెద్దబండలోని నైట్ షెల్టర్‌కు తరలించారు. రెండు, మూడు రోజుల పాటు అక్కడే ఉన్న యాచకులు తిరిగి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి, బస్టాండ్, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో యాచిస్తున్నారు. ప్రస్తుతం నలుగురు మాత్రమే నైట్ షెల్టర్‌లో బస చేస్తున్నారు.

నల్లగొండలో..
బర్మా దేశస్థులు

- 17 మంది గుర్తింపు
- కరోనా పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు తరలింపు
- మత ప్రచారం చేసేందుకు మార్చి 17న నీలగిరికి రాక
- కరోనా పరీక్షల ఫలితాల నివేదికల కోసం ఎదురుచూపులు
- ఆందోళన కలిగిస్తున్న గోప్యత

నార్కట్‌పల్లిలోని ఓ ఫంక్షన్ హాల్ నుంచి బర్మా దేశస్తులను హైదరాబాద్‌కు తరలిస్తున్న వైద్యులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : నల్లగొండలో 17మంది బర్మా దేశీయులను మంగళవారం రాత్రి పోలీసులు గుర్తించారు. వీరంతా మార్చి 17న నల్లగొండకు మత ప్రచార నిమిత్తం వచ్చారు. వీరిని కరోనా పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. వీరి కరోనా పరీక్షల రిపోర్ట్ కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాకు విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు తమ సమాచారాన్ని వెల్లడించకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

కరోనా నియంత్రణకు ప్రభుత్వం చర్యలు..

కరోనా (కోవిడ్ -19) వైరస్ వ్యాధి నిరోధానికి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. జిల్లా అధికార యంత్రాంగం ఈ పనుల్లో పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉంది. విదేశాల నుంచి వచ్చిన వారు స్వచ్ఛందంగా ముందుకు రావాలని, పరీక్షలు చేయించుకుని గృహ నిర్బంధంలోనే ఉండాలని పదే పదే కోరుతోంది. ప్రపంచ వ్యాప్తంగా కరోనా కరాళ నృత్యానికి వేలాది మంది బలవుతున్నారు. దేశంలో, రాష్ట్రంలో వ్యాధిని అరికట్టేందుకు చేస్తున్న హెచ్చరికలు కొందరి చెవికి ఎక్కడం లేదన్న అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది. మంగళవారం రాత్రి జిల్లా పోలీసులు నల్లగొండలో మరికొందరు విదేశీయులను గుర్తించారు. జిల్లాలో మొదట వియత్నాం నుంచి మత ప్రచారానికి వచ్చిన పన్నెండు మంది, వారికి గైడ్‌లుగా వచ్చిన మరో ఇద్దరు.. వెరసి పధ్నాలుగు మంది గుట్టుచప్పుడు కాకుండా ఆయా ప్రార్థనా మందిరాల్లో తలదాచుకున్నారు. పోలీసు నిఘా విభాగం వీరిని గుర్తించి కరోనా వైరస్ పరీక్షల నిర్వహణకు హైదరాబాద్‌కు తరలించింది. ఈ సమయంలో జిల్లా ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. కాగా, వీరందరికీ పరీక్షల్లో నెగెటివ్ రిపోర్టు రావడంతో అటు అధికారులు, ఇటు జిల్లా ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వీరికి కరోనా లక్షణాలు లేకున్నా.. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో ఐసోలేషన్‌లోనే ఉంచి వైద్య సేవలు అందించారు. ఇది మరచిపోక ముందే.. ఢిల్లీలోని నిజాముద్దీన్‌లో జరిగిన సమావేశాలకు వెళ్లి వచ్చిన వారి ఉదంతం సంచలనం సృష్టించింది. వీరెవరూ తాము బయటి ప్రాంతాలకు వెళ్లివచ్చామని స్వచ్ఛందంగా ముందుకు రాలేదు. నిజాముద్దీన్‌లో సమావేశాలకు వెళ్లి వచ్చిన వారిలో హైదరాబాద్, ఇతర జిల్లాల్లో మొత్తంగా ఆరుగురు మృత్యువాత పడడంతో అసలు ఎవరెవరు నిజాముద్దీన్‌కు వెళ్లివచ్చారని పోలీసులు జల్లెడ పట్టారు. నల్లగొండ పట్టణం నుంచే ఏకంగా 44 మంది వెళ్లివచ్చారని గుర్తించి మంగళవారం వారందరినీ అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు పరీక్షలకోసం పంపించారు. మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలో మరో పదిహేడు మంది బర్మా దేశస్తులు ఉన్నారని తేలడం సంచలన వార్తగా మారింది.

మార్చి 17వ తేదీన నల్లగొండకు చేరుకున్న బర్మా దేశస్తులు..

లాక్ డౌన్ నిబంధనలను ఉల్లంఘించి, కరోనా వైరస్ తీవ్రతను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా బర్మా దేశం నుంచి వచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచారు. అయితే, ఢిల్లీలోని నిజాముద్దీన్‌కు వెళ్లివచ్చిన వారిని గుర్తించడంలో భాగంగా పోలీసులు ఆయా ప్రార్థన మందిరాల్లో ఎవరెవరు ఉంటున్నారో తెలుసుకునే ప్రయత్నం చేశారు. బర్మా దేశం నుంచి మత ప్రచారం కోసం నల్లగొండకు వచ్చిన 17 మందిని నల్లగొండ పోలీసులు మంగళవారం అర్ధరాత్రి గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరికి నార్కట్‌పల్లిలోని ఒక ఫంక్షన్ హాలులో వసతి కల్పించి బుధవారం కరోనా వైద్య పరీక్షల కోసం హైదరాబాద్‌కు తరలించారు. బర్మా దేశం నుంచి హైదరాబాద్‌లోని బాలాపూర్ ప్రాంతంలోని బాబానగర్‌కు చేరుకున్న వీరు మార్చి 17వ తేదీన మత ప్రచారం కోసం నల్లగొండకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని మక్కా, జమ, కువా మసీదుల్లో బర్మా దేశీయులు ఉండి మతప్రచారం చేపట్టారని పోలీసులు పేర్కొన్నారు.

ఆందోళన కలిగిస్తున్న గోప్యత..

కరోనా వైరస్ వ్యాప్తి చెందిన ప్రదేశాల్లో తిరిగి వచ్చిన వారు, లేదా కరోనా పీడితులతో కలిసి గడిపిన వారు తమకు తాముగా అధికారులకు సమాచారం అందించి పరీక్షలు జరిపించుకుని క్వారంటైన్‌కు వెళ్లకుండా గోప్యత పాటిస్తుండడం ఆందోళన కలిగిస్తోందని జిల్లా ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వియత్నాం నుంచి వచ్చిన వారి గురించి, బర్మా నుంచి వచ్చిన వారి గురించిన సమాచారం స్థానిక ప్రజల నుంచి అందకపోవడాన్ని ఉదహరిస్తున్నారు. చివరకు ఢిల్లీలోని నిజాముద్దీన్‌కు వెళ్లి వచ్చిన వారు కూడా తమ 'ఐడెంటిటీ 'ని బయట పెట్టలేదని, పోలీసులే వారందరినీ గుర్తించారని చెబుతున్నారు. ఇతర దేశాల నుంచి వచ్చిన వారిగురించి, లేదా బయటి రాష్ట్రాలకు వెళ్లి వచ్చిన వారి గురించిన సమాచారం జిల్లా అధికారులకు తెలియజేయాలని కోరుతున్నారు.

ఆ.. 44 మందికి కరోనా లక్షణాలు లేవు..

నిజాముద్దీన్ మర్కజ్‌లో ప్రార్థనలకు నల్లగొండ నుంచి వెళ్లి వచ్చిన 44 మందికి ఎలాంటి కరోనా లక్షణాలు లేవు. వీరిని మంగళవారం జిల్లా కేంద్రం నుంచి వైద్య పరీక్షల కోసం హైదరాబాద్ తరలించారు. కాగా వీరికి కరోనా పరీక్షలు నిర్వహించగా నెగెటివ్‌గా రిపోర్ట్ వచ్చింది. వీరిని నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన క్వారంటైన్ సెంటర్‌లకు తరలించనున్నారు. అక్కడ కొద్ది రోజులపాటు పర్యవేక్షణలో ఉంచనున్నారు.

బర్మా దేశస్తుడి వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్

బియ్యం పంపిణీ షురూ..!

- ఒక్కొక్కరికి 12 కేజీల చొప్పున అందజేత
- రేషన్‌షాపుల వారీగా ఆన్‌లైన్‌లో జాబితా
- వేలిముద్రలు లేకుండా ఈ సారి రేషన్
- లబ్ధిదారుల గుర్తింపు బాధ్యత వీఆర్ఓ, వీఆర్ఏ, బీఎల్ఓలదే

నల్లగొండలోని బాహర్‌పేటలో రేషన్‌షాపులో బియ్యం తీసుకుంటున్న మహిళ

నల్లగొండ : కరోనా నేపథ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ బియ్యం పంపిణీ బుధవారం తిరిగి ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 4,57,563 కార్డులు ఉండగా అందులో 13 లక్షల మంది సభ్యులు ఉన్నారు. జిల్లా పౌరసఫరాల శాఖ అధికారులు జిల్లాలోని 991 రేషన్ షాపుల వారీగా అర్హుల జాబితాలను తయారుచేసి డీలర్లకు అందజేశారు. ఆ జాబితా ఆధారంగా ఈ పాస్‌పై వేలి ముద్ర వేసే పనిలేకుండానే వీఆర్ఓ, వీఆర్ఏ, బీఎల్ఓల అనుమతితో రేషన్ అందజేస్తున్నారు. గతంలో మాదిరిగానే రేషన్ పోర్టబులిటీని అమలు చేస్తున్నారు. అయితే వరుసగా మూడు నెలలు రేషన్ తీసుకోనివారు ప్రస్తుతం వేలిముద్రలు వేసి బియ్యం తీసుకుంటున్నారు.

ఒక్కొక్కరికి 12 కేజీలు పంపిణీ..

కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో భాగంగా దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం లాక్ డౌన్ విధించింది. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో పేదలు పనులు లేక ఇబ్బందులు పడతారని భావించిన ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు యూనిట్‌కు 12 కేజీల బియ్యం, కుటుంబానికి రూ.1500 ఉచితంగా ఇస్తామని ప్రకటించింది. అందుభాగంగా మార్చి 26న రేషన్ పంపిణీ ప్రారంభించారు. అయితే కేంద్ర ప్రభుత్వం కూడా ఐదు కేజీల బియ్యం ఇస్తామని ప్రకటించడంతో అదే రోజు సాయంత్రం బియ్యం పంపిణీని నిలిపివేశారు. ఇటీవల ప్రభుత్వం తిరిగి రేషన్ పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో బుధవారం నుంచి లబ్ధిదారులకు బియ్యం అందజేస్తున్నారు.

లబ్ధిదారుల గుర్తింపు బాధ్యత వీరిదే..

ఈ సారి రేషన్ పంపిణీ బాధ్యత వీఆర్ఓ, వీఆర్ఏ, బీఎల్ఓలదే. కరోనా వైరస్ కారణంగా ఈ పాస్ మిషన్ ద్వారా వేలిముద్ర వేసి బియ్యం తీసుకునే విధానాన్ని ప్రస్తుతం పక్కన పెట్టారు. ఈ సారి వేలిముద్ర లేకుండానే బియ్యం ఇవ్వనున్నారు. అందుకు కార్డుదారులను గుర్తించి ఆథరైజేషన్ ఇచ్చే విధంగా రేషన్‌షాపుల వద్ద వీఆర్ఓ, వీఆర్ఏ, బీఎల్ఓలకు బాధ్యత అప్పగించారు. వీరు ఆయా షాపుల పరిధిలో కార్డుదారులను గుర్తించి సంతకం చేస్తే వారికి డీలర్లు బియ్యం ఇచ్చే విధంగా అని చర్యలు తీసుకున్నారు.

ఆన్‌లైన్లో కార్డుదారుల జాబితా..

12 కేజీల బియ్యం పంపిణీకి సంబంధించి కార్డుదారుల జాబితాను జిల్లా పౌర సరఫరాల శాఖ ఆన్‌లైన్‌లో జాబితాను ఇచ్చింది. ఆన్‌లైన్‌లో జాబితాను చూసి, అక్కడ ప్రభుత్వ సిబ్బంది అనుమతితో లబ్ధిదారులకు బియ్యం ఇస్తున్నారు.

317 మందికి క్వారంటైన్ పూర్తి

నల్లగొండ టౌన్ : జిల్లాలో కరోనా వైరస్ కట్టడి కోసం జిల్లాకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన 399 మందిని క్వారంటైన్‌లో ఉంచగా.. వారిలో ఇప్పటి వరకు 317 మంది క్వారంటైన్ పూర్తయిందని డీఎంహెచ్ఓ అన్నిమళ్ల కొండల్‌రావు బుధవారం విడుదల చేసిన హెల్త్ బులిటెన్‌లో వెల్లడించారు. ఇంకా 82 మంది క్వారంటైన్‌లో ఉన్నారని వారంతా ఈ నెల 7వ తేదీ వరకు దశల వారీగా క్వారంటైన్ పూర్తి చేసుకుంటారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 72 మంది కరోనా అనుమానితుల శాంపిల్స్ సేకరించి హైదరాబాద్ పంపించామని తెలిపారు. వారిలో ఒక్కరికి కరోనా పాజిటివ్ వచ్చిందని, అతను గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. 25 మందికి నెగెటివ్ వచ్చిందని పేర్కొన్నారు. మిగతా 46 మంది రిపోర్టులు రావాల్సి ఉందని తెలిపారు.

ఉమ్మడి జిల్లా.. సురక్షితం

- ఇప్పటి వరకు వచ్చిన రిపోర్టులన్నీ నెగెటివ్ కేసులే
- ఢిల్లీ ప్రార్థనల్లో పాల్గొన్న వారంతా క్వారంటైన్‌లోనే ఉన్నారు
- స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వైద్యపరీక్షలు చేయించుకోవాలి
- అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలి
- మూడు జిల్లాల అధికారుల సెల్ కాన్ఫరెన్స్‌లో మంత్రి జగదీశ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : అదృష్టవశాత్తు ఇప్పటి వరకు నల్లగొండ జిల్లాలో కరోనా వైరస్ ప్రబలలేదని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఆయన హైదరాబాద్ నుంచి మూడు జిల్లాల అధి కారులతో సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్లు ప్రశాంత్ జీవన్ పాటిల్, వినయ్ కృష్ణారెడ్డి, అనితా రామచంద్రన్, ఎస్పీలు ఏవీ.రంగనాథ్ , భాస్కరన్, భువనగిరి యాదాద్రి డీసీపీలు, మూడు జిల్లాల డీఎంహెచ్ఓలు ఉమ్మడి జిల్లాలోని ఆర్‌డీఓలు ఈ సెల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా పరీక్షలు చేయించుకునేలా చూడాలి..

విదేశాల నుంచి వచ్చిన ప్రతి ఒక్కరినీ ఉమ్మడి జిల్లా అధికారులు గృహ నిర్బంధంలోకి తీసుకున్నా రెండు రోజులుగా వెలుగుచూసిన పరిణామాలు మూడు జిల్లాలను కొంత ఉలిక్కిపడేలా చేశాయన్నారు. అదృష్టం కొద్దీ ఢిల్లీలో ప్రార్థనలకు వెళ్లివచ్చిన వారికి నెగెటివ్ రిపోర్ట్ రావడం శుభపరిణామమన్నారు. అయినా, వారందరినీ హోమ్ క్వారంటైన్‌లో పెట్టి వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీకి పోయివచ్చిన వారిలో మరో పది మందిని మిర్యాలగూడ ప్రాంతంలో గుర్తించి తమ పర్యవేక్షణలోకి తీసుకున్నట్లు నల్లగొండ కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మంత్రి దృష్టికి తీసుకురాగా అటువంటి వారిలో అవగాహన పెంచి స్వచ్ఛందంగా వచ్చి పరీక్షలు చేయించుకునేలా కౌన్సిలింగ్ ఇవ్వాలని ఆదేశించారు.

ఆహారం విషయంలో జాగ్రత్త తీసుకోవాలి

అదే విధంగా కాలినడకన ఆంధ్రప్రదేశ్‌కు చేరుకోవాలనుకున్న వారిని నిబంధనలు ఒప్పుకోకపోవడంతో సరిహద్దుల్లో నిలిపి వసతి కల్పించి ఆహారం అందిస్తున్నట్లు నల్లగొండ ఎస్పీ రంగనాథ్ వివరించారు. అయితే ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలని అవసరమైతే అందుకు సంబంధించిన అధికారులను అక్కడికి పంపాలని మంత్రి సూచించారు.

రైతులకు ఇబ్బంది కలగొద్దు..

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ప్రారంభమైనందున గ్రామాల్లోకి తరలి వెళ్లే రైతాంగానికి ఆటంకం కలుగకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. బత్తాయి, నిమ్మ రైతులకు వాహనాలు సమకూర్చడంలో అధికారులు చొరవ చూపాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 14వ తేదీ వరకు లాక్‌డౌన్ అమలులో ఉన్నందున కూరగాయలతో పాటు ఇతర నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి జగదీశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

భౌతికదూరమే.. శ్రీరామ రక్ష !

నల్లగొండ : భౌతికదూరమే మనకు ఇప్పుడు శ్రీరామరక్ష అని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరామనవమి వేడుకలు ఇంటివద్ద మాత్రమే చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. ఎటువంటి పరిస్థితుల్లో బహిరంగ ప్రదేశాల్లో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించడం నిషేధమన్న విషయాన్ని ప్రజలు గుర్తుంచుకుని సహకరించాలని కోరారు. ప్రపంచాన్ని కబలిస్తున్న కరోనా వైరస్ వైరల్‌గా మారి మానవాళి భవిత్‌ను ప్రశ్నార్థకంగా మారుస్తున్నందునే ఇటువంటి కఠోర నిర్ణయాన్ని అమలు పర్చాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఈ మారు శ్రీ సీతారాముల కల్యాణం అర్చకులకే పరిమితం చెయ్యాలని మంత్రి సూచించారు.

వలస కార్మికులకు అండగా ప్రభుత్వం

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

యాద్గార్‌పల్లిలో వలస కార్మికులకు బియ్యం పంపిణీ చేస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

మిర్యాలగూడ : కరోనా వైరస్ నియంత్రణలో భాగంగా ప్రకటించిన లాక్‌డౌన్‌తో పనులు లేని వలస కార్మికులకు రాష్ట్రప్రభుత్వం అండగా ఉంటుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి మండలంలోని యాద్గార్‌పల్లిలోని రైస్‌మిల్లుల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల వలస కార్మికులకు ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యం, రూ.500 పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలస కార్మికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజాభద్రత కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన నిర్ణయాలు తీసుకున్నాయన్నారు. లాక్‌డౌన్‌కు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కరోనా వైరస్ నివారణకు స్వీయ నియంత్రణ ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రోహిత్‌సింగ్, తహసీల్దార్ గణేష్, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, వైస్‌చైర్మన్ కుర్ర విష్ణు, ఏఎంసీ చైర్మన్ చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ తిప్పన విజయసింహారెడ్డి, ఎంపీపీ సరళ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి రమేష్, బండారు కుశలయ్య పాల్గొన్నారు.

epaper.sakshi.com

సాక్షి హాయ్... మీరేం చేస్తున్నారు?

పిల్లల ఇండోర్ గేమ్స్, పెద్దవాళ్ల కబుర్లు, హోమ్ మేడ్ ఫుడ్, హౌస్ ఫుల్ టైమ్.. మన కోసం.. మన చేత.. మన వల్ల అన్నట్లుగా మారేందుకు వచ్చిన అరుదైన అవకాశం లాక్‌డౌన్. ఈ సమయంలో యాక్టివిటీస్ డౌన్ కావడంతో అనుబంధాలు ఆన్ అవుతున్నాయి. వంటలు చేసే మగవాళ్లు, ఆడవాళ్లు, పిల్లలతో కలిసి ఆటలాడుతున్న పెద్దవాళ్లు, ఇలాంటి అరుదైన, అపురూపమైన దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. మరి మీరేం చేస్తున్నారు? మీ ఇంట్లో ఎంత ఫన్ సృష్టిస్తున్నారు? నేడు ఎలా సందడి చేస్తున్నారు? రేపటికి ఎలా ప్రిపేర్ అవుతున్నారు? తదితర ఆసక్తికర విషయాలు 'సాక్షి'తో పంచుకోండి... గృహమే కదా స్వర్గసీమ అనే స్ఫూర్తిని అందరితోనూ పంచుకోండి. ఆయా అంశాలను మేము ప్రచురిస్తాం.

సాక్షితో పంచుకోండి...

మీ విశేషాలు పంపాల్సిన వాట్సప్ నంబర్ : 9963823329

మెయిల్ ఐడీ: nalgondasakshidesk@gmail.com

నేలపట్లలో లాప్‌టాప్‌లో గేమ్స్ ఆడుతున్న చిన్నారి

నల్లగొండలో అష్టాచెమ్మా ఆడుతూ సరదాగా గడుపుతున్న కుటుంబ సభ్యులు

తుంగతుర్తిలో..

ఆడుతూ.. చదువుతూ..

కరోనా వైరస్ కారణంగా దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించిన నేపథ్యంలో ప్రజలంతా ఇంటికే పరిమితమయ్యారు. కాలక్షేపం కోసం చిన్నారులు చెస్, క్యారమ్స్, అష్టాచెమ్మా, ఆన్‌లైన్ గేమ్స్ లాంటి ఇంట్లోనే ఉండే ఆటలు ఆడుతూ సందడి చేస్తున్నారు. అలాగే పెద్దలు టీవీ చూస్తూ, పేపర్, పుస్తకాలు చదువుతూ పిల్లలతో సరదాగా గడుపుతున్నారు. మరికొందరు పిల్లలకు సామాజిక అంశాలు, విలువలు చెబుతున్నారు. ఇలాంటి ఎన్నో అపురూప దృశ్యాలు లాక్‌డౌన్ కారణంగా ఆవిష్కృతమవుతున్నాయి. ఈ దృశ్యాలను పలువురు 'సాక్షి హాయ్ మీరేం చేస్తున్నారు'తో పంచుకున్నారు.

మునుగోడులో చదువుకుంటున్న చిన్నారులు

భగవద్గీత, తాళపత్ర గ్రంథాలు చదువుతున్న చిన్నారులు

చర్లపల్లిలో సరదాగా ఆడుకుంటున్న రిత్విక్, మన్విత్

ఆలేరులో పిల్లలకు సామాజిక విలువలు చెబుతూ..

సిరిపురంలో కుటుంబసభ్యులతో వామనగుంతలు ఆడుతున్న జ్యోతిశ్వర్‌రెడ్డి

మిర్యాలగూడలో పేపర్, పుస్తకాలు చదువుతున్న కుటుంబ సభ్యులు

జాజిరెడ్డిగూడెంలో బొమ్మలు తయారు చేస్తూ..

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో భర్తను హత్య చేయించిన భార్య
- వీడిన హత్యకేసు మిస్టరీ
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ

హత్యవివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

నల్లగొండ క్రైం : జిల్లా కేంద్రంలో మార్చి 26న అద్దంకి రోడ్డులోని నిధి పీవీసీకి వెళ్లే రోడ్డులో జరిగిన మారం వెంకట్‌రెడ్డి హత్యకేసు మిస్టరీ వీడింది. జిల్లా కేంద్రంలో బుధవారం డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. కొండమల్లేపల్లి మండలం గుమ్మడివెల్లి గ్రామానికి చెందిన పాత నేరస్తుడు మారం వెంకట్‌రెడ్డి భార్య శ్రవంతి పానగల్‌కు చెందిన క్లాస్‌మెట్ డ్రైవర్ శేఖర్‌తో ఉన్న పరిచయం ప్రేమగా మారి ఇద్దరు చనువుగా ఉంటున్నారు. వెంకట్‌రెడ్డిపై 40కేసులు ఉండడంతో పాటు, చెడు అలవాట్లు ఉండడంతో భార్య శ్రవంతితో సక్యత లోపించింది. తన భర్తను అడ్డుతొలగిస్తే వివాహం చేసుకుందామని ప్రియుడు శేఖర్‌కు చెప్పడంతో అదునుకోసం వేచి చూశారు. మార్చి 26న పానగల్ నుంచి డీసీఎం ఎక్కి హైదరాబాద్ వైపుకు వెళ్తుండగా ప్రియుడు శేఖర్ గమనించి పల్సర్ బైక్‌పై డీ సీఎంను వెంబడిస్తూ స్నేహితులకు ఫోన్ చేసి రమ్మని చెప్పడంతో కారులో వచ్చిన మరో ఇద్దరు స్నేహితులతో కలిసి మర్రిగూడ బైపాస్‌లో డీసీఎంను అడ్డగించి కారులోకి ఎక్కించుకొని కొట్టుకుంటూ తీసుకెళ్లి కత్తితో హత్య చేశారు. వెంకట్‌రెడ్డిని అడ్డుతొలగిస్తే గుమ్మడవెల్లిలో రూ.1కోటి50లక్షల విలువైన ఆస్తి వస్తుందని, వివాహం చేసుకోవచ్చని శ్రవంతి ప్రియుడితో ప్లాన్ చేసింది.

ఇలా పట్టుకున్నారు..

హత్య జరిగిన సమయాన్ని, సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా కూపీలాగిన పోలీసులు నిందితులైన శేఖర్, స్వామి, చింటులను పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును చేధించిన రూరల్ ఎస్సై రాజశేఖర్‌రెడ్డిని డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి అభినందించారు.

మొబైల్ బత్తాయి విక్రయ కేంద్రం ప్రారంభం

నల్లగొండ : మొబైల్ బత్తాయి వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

నల్లగొండ : జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాలలో ప్రజలకు అందుబాటులో వుండే విధంగా ఫాం ఫ్రెష్ తాజా బత్తాయి, పుచ్చకాయల విక్రయ కేంద్రాలను బుధవారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో బత్తాయి, పుచ్చకాయ, నిమ్మకాయ, ఇతర పండ్ల రైతులు తమ ఉత్పత్తులను విక్రయించేందుకు జిల్లా యంత్రాగం తరపున అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు ఇతర ముఖ్యమైన ప్రాంతాలలో మొబైల్ వాహనంలో తాజా బత్తాయి, నిమ్మ, పుచ్చకాయలు, ఇతర పండ్లు ప్రజలకు అందుబాటు ధరల్లో విక్రయం చేస్తారని అన్నారు. రైతులు తమ ఉత్పత్తులను రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, జిల్లాల్లో విక్రయించుకునేలా వాహనాలు బాడుగకు ఏర్పాటు చేసుకుంటే జిల్లా ఉద్యాన శాఖ తరపున వారికి హైదరాబాద్‌కు తీసుకువెళ్లేందుకు వాహనం ఇంధన ఖర్చులు అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో బత్తాయి రైతులు కత్తెర పంట పండించిన వారు 16,000 మంది ఉన్నారని, 46వేల ఎకరాల్లో 45వేల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి వస్తుందని అంచనా వేసి వారికి హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, కరీంనగర్ ఇతర జిల్లాలో విక్రయానికి వారికి వాహనాలకు పాస్‌లు జారీ చేసి చెక్‌పోస్ట్‌లో రవాణా చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు తమ పేర్లు వివరాలు జిల్లా ఉద్యానశాఖ కార్యాలయంలో సంప్రదించాలని, వారు ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తారని కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. నిజాముద్దీన్ మర్కజ్‌కు హాజరై వచ్చిన జిల్లాకు చెందిన 45 మందిని హైదరాబాద్ ఫీవర్ ఆస్పత్రికి పరీక్షల నిమిత్తం పంపించినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కరోనా నియంత్రణకు లాక్‌డౌన్‌కు ప్రజలు సహకరించి ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారన్నారు. కరోనా నియంత్రణకు బత్తాయి, నిమ్మలోని 'సి' విటమిన్ దోహదం చేస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, జిల్లా మార్కెటింగ్ ఏడీ అబ్దుల్‌అలీం, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ దేవ్‌సింగ్, ఉద్యాన శాఖ ఏడీ.జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ విక్రయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

చిట్యాల : పండ్లను తూకం వేసి ప్రారంభిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే లింగయ్య

చిట్యాల (నకిరేకల్) : తాజా పండ్లతో ఏర్పాటు చేసిన మొబైల్ విక్రయ కేంద్రాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాలలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ పండ్ల విక్రయ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తాజా నిమ్మ, బత్తాయి, దానిమ్మ పండ్లను రోజు తీసుకోవడంతో కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంగీతలక్ష్మి, డీహెచ్ అండ్ ఎస్‌సీఓ జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్, తహసీల్దార్ క్రిష్ణారెడ్డి, ఉద్యానవన శాఖ నియోజకవర్గ అధికారి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

కొండమల్లేపల్లి (దేవరకొండ) : దేవరకొండ పట్టణంలోని 7వ వార్డుకు చెందిన కౌన్సిలర్ నేనావత్ ప్రవళిక కిషన్‌నాయక్ బుధవారం వార్డు పరిధిలోని పలువురికి ఐదు కేజీల కూరగాయలతో పాటు బియ్యం, పప్పు వంటి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాపానాయక్, సంతోష్ తదితరులున్నారు.

యువకుడి ఆత్మహత్య

చిట్యాల (నకిరేకల్) : ప్రేమ విఫలమైందని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన చిట్యాల మండలం బోయగుబ్బ గ్రామ పంచాయతీ పరిధిలోని మొగిలిదొరి గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. చిట్యాల ఏఎస్ఐ నర్సిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మొగిలిదొరి గ్రామానికి చెందిన బొమ్మగోని శివశంకర్(22) బోరు బండిపై ఏపీలోని వైజాగ్‌లో పనిచేశాడు. పనిచేసే సమయంలో అక్కడ ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. ఆ ప్రేమ విఫలం కావడంతో ఆరునెలలుగా స్వగ్రామంలోనే ఉంటున్నాడు. కాగా మంగళవారం రాత్రి గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన స్థానికులకు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ వ్యక్తిగత, వ్యవసాయం, ప్రాపర్టీ, బిజినెస్, టేకోవర్, ప్రాజెక్ట్ మరియు సిబిల్ కేసులు వంటి అన్ని రకముల రుణములు ఇవ్వబడును. సంప్ర॥ 7838016584. [W-723337]

■ వ్యక్తిగత, అగ్రికల్చర్, ప్రాపర్టీ, బిజినెస్, టేకోవర్, ప్రాజెక్ట్ మరియు అన్ని రకాల రుణములు ఇవ్వబడును. సంప్ర॥ 8838928406 [W-723330]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పేద ప్రజలకు పలువురి చేయూత

మిర్యాలగూడ : కరోనా వైరస్ (కోవిడ్ -19) వ్యాప్తి నివారణలో భాగంగా లాక్‌డౌన్ కారణంగా పనులు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలకు పలువురు సహాయం చేసి చేయూతనందిస్తున్నారు. ఎక్కువగా దినసరి కూలీలు, పేదలు ఉండే ఇందిరమ్మ కాలనీలో కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఒక్కొక్క కుటుంబానికి మూడు కిలోల కూరగాయల పంపిణీ చేశారు. అదే విధంగా ఆర్టీసీ బస్టాండ్‌లో ఉండే యాచకులు, దూర ప్రాంతాలకు వెళ్లలేకపోయిన వారికి బీజేపీ ట్రేడ్ యూనియన్ జిల్లా కో కన్వీనర్ చిల్లంచర్ల పాండు ఒక్క రోజు వంట చేసి భోజనం పెట్టారు. పట్టణంలోని షాబ్‌నగర్‌లో పేద కుటుంబాల వారికి మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ కూరగాయలు పంపిణీ చేశారు. మిర్యాలగూడ మండలంలోని ఉట్లపల్లిలో ప్రతి కుటుంబానికి రూ.8లక్షల విలువైన బియ్యం, కూరగాయల కోసం రూ.వంద చొప్పున లక్ష రూపాయలను మాజీ సర్పంచ్ మేడ సురేందర్ రెడ్డి పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు, పోలీసులకు ఉదయం అల్పాహారం పంపిణీ చేశారు. బంగారుగడ్డలో ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో పేదలకు బియ్యం, నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో సర్పంచ్ వెంకట్రమణ చౌదరి ఆధ్వర్యంలో గుబిలికాలనీకి చెందిన వలస కార్మికులకు ఒక్కొక్క కుటుంబానికి పది కిలోల బియ్యంతో పాటు రూ.500 నగదులను అందించారు. ఎన్‌బీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు, కూలీలకు, రైతులకు, బస్టాండ్‌లో యాచకులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు.

మిర్యాలగూడ ఇందిరమ్మ కాలనీలో కూరగాయలు పంపిణీ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

మానవత్వాన్ని చాటుకున్న ఎంపీపీ శ్రీదేవిగంగాధర్‌రావు

నకిరేకల్ : కరోనా వైరస్‌తో ప్రభుత్వం లాక్‌డౌన్ నిర్వహించడంతో అనేక మంది వలస కార్మికులు, పేదలకు, బిక్షాటకులకు నకిరేకల్ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు అండగా నిలిచారు. వారు స్వంతగా సూమారు రూ.2లక్షలతో గత వారం రోజులు నుంచి అనేక మందికి నిత్యావసర సరుకులు, ఇంటి ఖర్చుల నిమిత్తం కొంత నగదును అందజేస్తు తన మానవత్వాని చాటుకున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన 200మందికి ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. విధుల్లో ఉన్న పోలీసులకు పండ్లు, మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు.

నకిరేకల్‌లో వలస కూలీలకు చేయూతనిస్తున్న ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు

కరోనా కట్టడికి మునుగోడు జెడ్పీటీసీ కృషి..

మునుగోడు : ప్రపంచాని గడగడలాడిస్తున్న కరోనా వ్యాధిని కట్టడి చేసేందుకు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా చైర్మన్, మునుగోడు జెడ్పీటీసీ నారబోయిన స్వరూపరాణి రవి కృషి చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పేద ప్రజలకు తమవంతు సహాయ, సహకారాలు అందిస్తున్నారు. కరోనా బాధితులను ఆదుకునేందుకు సీఎం సహాయ నిధికి రూ.20వేల విరాళం అందించారు. అంతేకాకుండా రూ.10వేల విలువగల మాస్క్‌లను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. అంతేకాకుండా బీహార్ నుంచి వచ్చిన వలస కూలీలకు నిత్యావసర సరుకులు అందజేశారు. దీంతో ఆమె చేస్తున్న కృషి పట్ల మండల ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు.

మునుగోడు : వలస కూలీలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న స్వరూపారాణి

స్వీయ నిర్బంధం పాటించాలి

- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నర్సింహయ్య

పెద్దవూర (హాలియా) : ప్రస్తుతం ప్రపంచ దేశాలను వణికిస్తున్న కరోనా వైరస్‌కు స్వీయ నిర్బంధానికి మించిన మందు లేదని, ప్రతిఒక్కరూ విధిగా భౌతిక దూరాన్ని పాటించాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య అన్నారు. మండలంలోని కుంకుడుచెట్టుతండా సమీపంలో ఇటుక బట్టీలలో పనిచేస్తున్న వలస కూలీలకు బుధవారం ఆయన 12కిలోల రేషన్ బియ్యాన్ని, రూ.500 నగదును పంపిణీ చేసి మాట్లాడారు. అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని దీనికి నిదర్శనమే దేశంలో ఎక్కడా లేని విధంగా వలస కూలీలకు సైతం టీఆర్ఎస్ ప్రభుత్వం ఆపదలో ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, తహసీల్దార్ ఎస్.సైదులుగౌడ్, ఎంపీటీసీ పీకానాయక్, కర్ణ బ్రహ్మానందరెడ్డి, వీఆర్ఓ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

కుంకుడుచెట్టుతండాలో వలస కార్మికులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

'కోవిడ్' నియంత్రణకు అన్ని చర్యలు

నల్లగొండ టౌన్ : జిల్లాలో కోవిడ్ వైరస్ నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి జిల్లా జనరల్ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి బయట లెవలింగ్ చేసి రోగుల సహాయకుల కోసం విశ్రాంతి షెడ్‌ను ఏర్పాటు చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను, మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కరోనా వార్డును సందర్శించి కరోనా వైరస్ వ్యాప్తి కేసుల స్వాబ్ పరీక్ష శాంపిల్స్ సేకరణ ఏర్పాట్లను పరీక్షించారు. రేపటి నుంచి కరోనా అనుమానితుల నుంచి స్వాబ్ శాంపిల్స్‌ను ఇక్కడే సేకరించి హైదరాబాద్‌కు పరీక్షల కోసం పంపించి రిపోర్టులను తెప్పించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహ వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, డీహెచ్ఎస్ డాక్టర్ మాతృ ఉన్నారు.

జిల్లా జనరల్ ఆస్పత్రిని సందర్శిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ధాన్యం కొనుగోలుకు 17ఐకేపీ కేంద్రాల ఏర్పాటు

- దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి (దేవరకొండ) : రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు నియోజకవర్గంలో 17 ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం దేవరకొండలోని ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, సహకార సంఘం అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కేవలం మూడు ఐకేపీ కేంద్రాలు మాత్రమే ఉన్నాయని, ఇబ్బందులను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఈ సారి కొనుగోలు కేంద్రాలను పెంచినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, జెడ్పీటీసీ మారుపాకుల అరుణసురేష్‌గౌడ్, ఇన్‌చార్జ్ ఆర్డీఓ వాసుచంద్ర, ఏడీఏ విజయేందర్‌రెడ్డి ఉన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

ఉచిత రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభం

మిర్యాలగూడ : కరోనా వైరస్ (కోవిడ్ -19) వ్యాప్తి నియంత్రణలో భాగంగా లాక్‌డౌన్ నేపథ్యంలో తెల్ల రేషన్ కార్డుదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ప్రారంభించారు. పట్టణంలోని మోయిన్‌బజార్ 36 వార్డులోని 28వ రేషన్‌షాపులో పంపిణీని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాస్కర్‌రావు మాట్లాడుతూ.. లాక్‌డౌన్ వల్ల ఎవరూ ఇబ్బందులు పడవద్దని సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

మాస్కుల పంపిణీ..

పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపులోని కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులకు, వినియోగదారులకు బుధవారం స్థానిక ఎమ్మెల్యే భాస్కర్‌రావు మాస్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, ఏఎంసీ చైర్మన్ చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ తిప్పన విజయసింహారెడ్డి, ఎంపీపీ సరళ, ఆర్డీఓ రోహిత్‌సింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో రేషన్ బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

కరోనా నివారణకు హైపోక్లోరైడ్ స్ప్రే

రామగిరి (తిప్పర్తి) : తిప్పర్తి మండల కేంద్రంలో బుధవారం కరోనా వైరస్ నివారణకు హైపోక్లోరైడ్ స్ప్రే చేశారు. తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బంది తిప్పర్తి సెంటర్‌తో పాటు పలు ప్రధాన వీధుల్లో స్ప్రే చేశారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మి, సర్పంచ్ రొట్టెల రమేష్, పలువురు టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తిప్పర్తి మండల కేంద్రంలో హైపోక్లోరైడ్ స్ప్రే చేయిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్

ఏఎమ్మార్పీ కాల్వలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గుర్రంపోడు (హాలియా) : మండలంలోని పిట్టలగూడెం గ్రామ శివారులోని ఏఎమ్మార్పీ కాల్వలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. ఎస్ఐ డి.సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. కాల్వలో రైతు అడ్డంగా వేసుకున్న పైపుకు గుర్తుతెలియని వ్యక్తి శవం చిక్కుకుని కనిపించడంతో స్థానిక రైతులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉండవచ్చునని తెలిపారు. సిమెంట్ కలర్ ప్యాంటు ధరించి చేతుల మీద గుర్రపు టాటూ, ఎస్ ఆకారంలో టాటూ వేసుకున్న గుర్తులు ఉన్నాయని తెలిపారు. మృతుడిని గుర్తించినవారు 9440 795659 కు తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

సాక్షి బిజినెస్
గురువారం
2-4-2020
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
1203 ▼	344 ▼
28,265	8,254

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	7,415	▼ 285
డోజోన్స్	21,062	▼ 855
ఎఫ్‌టీఎస్‌ఈ 100	5,455	▼ 218
డాక్స్	9,545	▼ 391
షాంఘై	2,735	▼ 16
నికాయ్	18,065	▲ 852

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో (మంగళవారం రేట్లు)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఫారమ్‌కుకి	73.19	78.15
£	బ్రిటన్ పౌండ్	ఫారమ్‌కుకి	91.00	95.88
€	యూరో	ఫారమ్‌కుకి	80.25	85.52
¥	జపాన్ ఎన్ (100)	ఫారమ్‌కుకి	59.00	77.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఫారమ్‌కుకి	44.17	48.49
S$	సింగపూర్ డాలర్	ఫారమ్‌కుకి	51.34	55.20
SAR	సౌదీ రియాల్	ఫారమ్‌కుకి	19.10	20.97
UAE D	యూఏఈ దిర్హామ్	ఫారమ్‌కుకి	19.24	21.88
¥	చైనా యువాన్	ఫారమ్‌కుకి	9.51	11.28

ఎగుమతిదారులకు ఆర్‌బీఐ ఊరట

- చెల్లింపుల స్వీకరణకు మరింత గడువు
- కేంద్ర, రాష్ట్రాలకు మరిన్ని నిధులు

ముంబై: ఎగుమతిదారులకు ఆర్‌బీఐ ఉపశమన చర్యలను ప్రకటించింది. కరోనా వైరస్‌తో ప్రపంచ దేశాలు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో వస్తు, సేవల ఎగుమతిదారులకు ఊరట కల్పించింది. విదేశీ కొనుగోలుదారుల నుంచి చెల్లింపులు స్వీకరించడం, భారత్‌కు పంపుకునేందుకు 15 నెలల గడువు ఇచ్చింది. ఎగుమతి చేసిన తేదీ నుంచి ఈ గడువు అమల్లోకి వస్తుంది. అది కూడా ఈ ఏడాది జూలై 31 వరకు ఎగుమతి చేసే వాటికి ఇది వర్తిస్తుందని ఆర్‌బీఐ పేర్కొంది. ఇప్పటి వరకు ఈ గడువు ఎగుమతి చేసిన నాటి నుంచి 9 నెలలు గానే ఉంది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు 'వేస్ అండ్ మీన్స్' కింద తాను ఇచ్చే రుణాల పరిమితిని 30% పెంచాలని నిర్ణయించింది. ప్రభుత్వాల ఆదాయాలు, చెల్లింపుల మధ్య అంతరాన్ని అధిగమించేందుకు వేస్‌అండ్‌మీన్స్ కింద తాత్కాలిక రుణాలను ఇస్తుంటుంది. వాస్తవానికి వేస్ అండ్‌మీన్స్ పరిమితిని సమీక్షించేందుకు ఆర్‌బీఐ ఓ సలహా కమిటీని ఏర్పాటు చేయగా, కమిటీ నుంచి నివేదిక ఇంకా రావాల్సి ఉంది. కౌంటర్ సైక్లికల్ క్యాపిటల్ బఫర్ (సీసీవైబీ)ను ప్రస్తుతం అమలు చేయాల్సిన అవసరం లేదని కూడా ఆర్‌బీఐ స్పష్టం చేసింది. బ్యాంకులు సమయానుకూలంగా నిర్వహించాల్సిన నగదు నిల్వలను సీసీవైబీగా పేర్కొంటారు.

భారీ నష్టాలతో బోణి

- కొత్త ఆర్థిక సంవత్సరం భారీ క్షీణతతో మొదలు
- పెరుగుతున్న కరోనా కేసులు
- పతన బాటలోనే ప్రపంచ మార్కెట్లు
- భారత వెయిటేజీపై ఎమ్‌ఎస్‌సీఐ నిర్ణయం వాయిదా
- భారీగా ఎగసిన ద్రవ్యలోటు
- కొనసాగుతున్న విదేశీ అమ్మకాలు
- 1,203 పాయింట్ల నష్టంతో 28,265కు సెన్సెక్స్
- 344 పాయింట్లు పతనమై 8,254కు నిఫ్టీ

కొత్త ఆర్థిక సంవత్సరం(2020-21) తొలి రోజు స్టాక్ మార్కెట్ భారీగా నష్టపోయింది. కరోనా మహమ్మారి విలయతాండవానికి అంతర్జాతీయంగా ప్రపంచ మార్కెట్లు కకావికలమవుతున్నాయి. దీనికి తోడు అంతర్జాతీయ సూచీల్లో భారత వెయిటేజీకి సంబంధించిన మార్పులను ఎమ్‌ఎస్‌సీఐ మే నెలకు వాయిదా వేయడంతో బుధవారం మన మార్కెట్ కూడా భారీగా పతనమైంది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 1,203 పాయింట్లు క్షీణించి 28,265 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 344 పాయింట్లు నష్టపోయి 8,254 పాయింట్ల వద్ద ముగిశాయి. అన్ని రంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. నేడు (గురువారం) శ్రీరామ నవమి సందర్భంగా సెలవు కావడంతో నిఫ్టీ డ్రీమ్ ఆప్షన్లు బుధవారమే ముగిశాయి. సెన్సెక్స్, నిఫ్టీలు వారం కనిష్ట స్థాయిలకు పడిపోయాయి.

ఇన్వెస్టర్లు... బహుపరాక్....!

సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. పావుగంటకే నష్టాల్లోకి జారిపోయింది. రోజంతా నష్టాలు కొనసాగాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,395 పాయింట్లు, నిఫ్టీ 400 పాయింట్ల మేర నష్టపోయాయి. ఇక ఆసియా మార్కెట్లు 2-4 శాతం రేంజ్‌లో నష్టపోగా, యూరప్ మార్కెట్లు కూడా అదే స్థాయి నష్టాల్లో ఆరంభమయ్యాయి. ముడిచమురు ధరలు 5 శాతం మేర తగ్గాయి. కాగా స్టాక్ మార్కెట్లో ఒడిదుడుకులు కొనసాగుతాయని, ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

బ్యాంక్ షేర్లు బేర్

ప్రస్తుత లాక్‌డౌన్ కారణంగా వివిధ కంపెనీల వ్యాపారాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని, ఫలితంగా బ్యాంక్‌ల మొండిబకాయిలు భారీగా పెరుగుతాయనే భయాందోళనలతో బ్యాంక్ షేర్లు పతనమయ్యాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు 8-2 శాతం రేంజ్‌లో నష్టపోయాయి.

- టెక్ మహీంద్రా షేర్ 9.2% పడింది.
- 30 సెన్సెక్స్ షేర్లలో 4 షేర్లు-హీరో మోటో, బజాజ్ ఆటో, బజాజ్ ఫైనాన్స్, టైటాన్ మాత్రమే లాభపడగా, మిగిలిన 26 షేర్లు నష్టపోయాయి.

తొలి రోజే రూ.3.2 లక్షల కోట్లు ఆవిరి

స్టాక్ మార్కెట్ భారీ నష్టాల కారణంగా రూ.3.2 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద హరించుకుపోయింది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.3.20 లక్షల కోట్ల తగ్గుదలతో రూ.110.28 లక్షల కోట్లకు పడిపోయింది.

నేడు సెలవు

శ్రీరామ నవమి సందర్భంగా నేడు స్టాక్ మార్కెట్‌కు సెలవు. బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈల్లో ట్రేడింగ్ జరగదు.

పతనానికి ప్రధాన కారణాలు

- **కొనసాగుతున్న కరోనా కల్లోలం...:** భారత్‌లో కరోనా కేసులు 1,621కు, మరణాలు 42కు చేరాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు 8.6 లక్షలకు, మరణాలు 42,000కు పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతుండటంతో మాంద్యం భయాలు పెరుగుతున్నాయి.
- **ఎమ్‌ఎస్‌సీఐ 'వెయిటేజీ' వాయిదా:** ఎమ్‌ఎస్‌సీఐ(మోర్గాన్ స్టాన్లీ క్యాపిటల్ ఇంటర్నేషనల్)... తన గ్లోబల్ సూచీల్లో భారత వెయిటేజీ పెంచే నిర్ణయాన్ని మే నెలకు వాయిదా వేసింది. వాస్తవానికి ఈ మార్పులు బుధవారం (ఏప్రిల్ 1)నుంచే అమల్లోకి రావాలి. దీనివల్ల భారత్‌లోకి 1,000 కోట్ల డాలర్లు(రూ.76,000 కోట్లు) వచ్చే చాన్స్ ఉంది.
- **బలహీనంగా ఆసియా తయారీ డేటా:** జపాన్, దక్షిణ కొరియా దేశాల తయారీ రంగ గణాంకాలు బలహీనంగా ఉండటం ప్రతికూల ప్రభావం చూపించింది.
- **తగ్గిన వాహన విక్రయాలు...:** మార్చి నెలలో వాహన విక్రయాలు బాగా తగ్గాయి. మారుతీ సుజుకీ మ్మకాలు 47 శాతం, అశోక్ లేలాండ్ విక్రయాలు 90 శాతం, ఐషర్ మోటార్స్ అమ్మకాలు 83 శాతం మేర పడిపోయాయి. వాహన విక్రయాలు ఈ స్థాయిలో క్షీణించడం ఇన్వెస్టర్లను కలవర పెట్టింది.
- **ద్రవ్యలోటు లక్ష్యం మిస్...** గత ఆర్థిక సంవత్సరం (2019-20) ఫిబ్రవరి నాటికే ద్రవ్యలోటు(వ్యయానికి, ఆదాయానికి మధ్య వ్యత్యాసం) పూర్తి బడ్జెట్ అంచనాల్లో 135 శాతానికి (రూ.10,36,485 కోట్లు) చేరింది. ద్రవ్యలోటు లక్ష్యం పెద్ద మార్జిన్‌తో కట్టు తప్పడం.. ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీసింది.

దేశీ బ్యాంకింగ్ రంగానికి నవోదయం

మెగా విలీనాలపై ఆర్థిక శాఖ వ్యాఖ్య

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) మెగా విలీనంపై కేంద్ర ఆర్థిక శాఖ స్పందించింది. దేశీ బ్యాంకింగ్ రంగానికి ఇది నవోదయంగా అభివర్ణించింది. 'మరింత పటిష్టమైన, భారీ పీఎస్‌బీలు ఇంకా మెరుగైన ప్రత్యేక పథకాలు, మరింత వేగంగా రుణ ప్రాసెసింగ్ సేవలను కస్టమర్లకు అందించగలుగుతాయి. అవసరాలకు అనుగుణంగా ఇంటివద్దకే బ్యాంకింగ్ సేవలను విస్తరించగలుగుతాయి' అని ఆర్థిక శాఖలో భాగమైన ఆర్థిక సేవల విభాగం.. మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విటర్‌లో ట్వీట్ చేసింది. నాలుగు పీఎస్‌బీల్లో ఆరు పీఎస్‌బీల విలీనం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఓవైపు దేశవ్యాప్తంగా కరోనా పరమైన లాక్‌డౌన్ అమలవుతున్న తరుణంలో పీఎస్‌బీల విలీనం యథాప్రకారం అమల్లోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, విలీనం చేసుకున్న యునైటెడ్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్‌కు దేశవ్యాప్తంగా ఉన్న శాఖలన్నీ తమ బ్రాంచీలుగా సేవలు అందిస్తున్నాయని పంజాబ్ నేషనల్ బ్యాంకు వెల్లడించింది. తమ బ్యాంకుకు ఇకపై 11,000 పైచిలుకు శాఖలు, 13,000 పైగా ఏటీఎంలు, ఒక లక్ష మంది పైగా ఉద్యోగులు, రూ. 18 లక్షల కోట్ల పైచిలుకు వ్యాపారం ఉంటుందని పీఎన్‌బీ ఎండీ ఎస్‌ఎస్ మల్లికార్జునరావు తెలిపారు. మెగా విలీనంలో భాగంగా.. కెనరా బ్యాంకులో సిండికేట్ బ్యాంకు.. యూనియన్ బ్యాంక్‌లో ఆంధ్రా బ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకు.. ఇండియన్ బ్యాంకులో అలహాబాద్ బ్యాంకును విలీనం చేశారు.

కావాలంటే.. మీరే చెప్పండి

- ఈఎంఐల వాయిదాపై కస్టమర్లకు ప్రైవేట్ బ్యాంకుల సూచన
- మారటోరియం వ్యవధిలోనూ వడ్డీల వడ్డన
- వీలుంటే కట్టేసేయడమే శ్రేయస్కరం

న్యూఢిల్లీ: రుణాలపై నెలవారీ వాయిదాలపై (ఈఎంఐ) మారటోరియం కావాలనుకునే రుణగ్రహీతలు .. వారంతట వారు కోరితేనే అమలు చేయాలని ప్రైవేట్ రంగ బ్యాంకులు భావిస్తున్నాయి. ఇందు కోసం ఆప్ట్-ఇన్ ఆప్షన్‌ను ప్రవేశపెట్టాయి. 'మూడు నెలల మారటోరియం వద్దనుకుంటే మీరు ఏమీ చేయనక్కర్లేదు. మీరిచ్చిన రీపేమెంట్ సూచనల మేరకు చెల్లింపులు యథావిధిగా జరిగిపోతాయి. కానీ, మారటోరియం కావాలనుకుంటే తెలియజేయండి' అంటూ ప్రైవేట్ రంగ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తమ వెబ్‌సైట్లో రుణగ్రహీతలను ఉద్దేశించి పోస్ట్ పెట్టింది. మరోవైపు మారటోరియం కావాలనుకునే వారు (ఆప్టింగ్ ఇన్) నిర్దిష్ట ఈమెయిల్ ఐడీకి మెయిల్ పంపించాలంటూ కోటక్ మహీంద్రా బ్యాంక్ తమ కస్టమర్లకు సూచించింది. అటు రెండో అతి పెద్ద బ్యాంక్ ఐసీఐసీఐ బ్యాంక్ దీన్ని కాస్త భిన్నంగా అమలు చేస్తోంది. వేతన జీవులకు సాధారణంగానే ఆప్ట్-ఇన్ ఆప్షన్‌ను, ఆదాయాలు గణనీయంగా దెబ్బతిన్న ట్రేడర్లు, చిన్న స్థాయి రుణగ్రహీతలకు ఆప్ట్-అవుట్ ఆప్షన్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. స్వయం సహాయక గ్రూపులు, ఆభరణాలపై రుణాలు .. అన్‌సెక్యూర్డ్ వ్యాపార రుణాలు .. ఓవర్‌డ్రాఫ్ట్‌లు తీసుకున్నవారు, క్రెడిట్ కార్డుహోల్డర్లు మొదలైనవారు ఆప్ట్-అవుట్ కేటగిరీలోకి వస్తారు. వీరు ఒకవేళ చెల్లింపులు కొనసాగించదల్చుకున్న పక్షంలో బ్యాంకుకు తెలియజేయాల్సి ఉంటుంది. మిగతా టర్మ్ లోన్‌లు తీసుకున్న వారు ఆప్ట్-ఇన్ కేటగిరీలోకి వస్తారు. ఇక, యాక్సిస్ బ్యాంక్.. తామింకా స్కీమ్ అమలుపై కసరత్తు చేస్తున్నామని, ఇది పూర్తయ్యాక కస్టమర్లకు తెలియజేస్తామని వెల్లడించింది.

డబ్బుంటే కట్టేయండి..

చేతిలో నగదు ఉన్న కస్టమర్లు వీలైనంత వరకూ ఈఎంఐల చెల్లింపులు కొనసాగించేందుకే ప్రాధాన్యమివ్వాలంటూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సూచించింది. తద్వారా అదనపు వడ్డీ భారాన్ని, రుణ కాలవ్యవధి పొడిగింపునకు సమస్య ఉండదని పేర్కొంది. పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు చాలా మటుకు ఆప్ట్-అవుట్ ఆప్షన్‌నే అమలు చేస్తున్నాయి. చెల్లింపులు కొనసాగిస్తానని కస్టమర్లు ప్రత్యేకంగా తెలియజేస్తే తప్ప.. ఆటోమేటిక్‌గా మారటోరియం వర్తింపచేస్తున్నాయి. కరోనా సంబంధించిన లాక్‌డౌన్‌తో ప్రజల ఆదాయాలు గణనీయంగా దెబ్బతినే అవకాశం ఉండటంతో రుణాల ఈఎంఐల చెల్లింపులపై కొంత వెసులుబాటు కల్పిస్తూ రిజర్వ్ బ్యాంక్ మారటోరియం ప్రకటించిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం కట్టాల్సిన ఈఎంఐలను మూడు నెలల పాటు వాయిదా వేసుకోవచ్చు.

ఐబీఏ వివరణ...

అటు బ్యాంకుల అసోసియేషన్ (ఐబీఏ) కూడా మారటోరియం ప్రభావాల గురించి వివరించింది. 'మీ ఆదాయాలు దెబ్బతిన్న పక్షంలో ఆర్‌బీఐ ప్యాకేజీతో ప్రయోజనం పొందవచ్చు. అయితే, ఆయా రుణాలపై వడ్డీ భారం ఉంటుంది. దీన్ని అప్పటికప్పుడు కట్టాల్సిన అవసరం లేకపోయినా.. అదనపు భారం పడుతుందని గుర్తుంచుకోవాలి' అని పేర్కొంది. అటు క్రెడిట్ కార్డు బాకీల గురించి కూడా వివరణ ఇచ్చింది. సాధారణంగా మినిమం అమౌంట్ కూడా కట్టకపోతే క్రెడిట్ బ్యూరోలకు బ్యాంకులు తెలియజేయాల్సి ఉంటుందని పేర్కొంది. అయితే, ఆర్‌బీఐ సర్క్యులర్ కారణంగా మూడు నెలల పాటు వెసులుబాటు ఉంటుందని వివరించింది. కానీ బాకీలపై భారీగా వడ్డీ ఉంటుందని హెచ్చరించింది.

వడ్డీల వాయింపు...

ఆర్‌బీఐ ప్రకటించిన మూడు నెలల మారటోరియం స్కీము.. పైకి కనిపించినంత ప్రయోజనకరమేమీ కాదని విశ్లేషకులు చెబుతున్నారు. తాత్కాలికంగా చెల్లింపుల నుంచి ఉపశమనం లభించినా.. ఆ తర్వాత అంతకు మించి చెల్లించుకోవాల్సి వస్తుందని, మరింత భారం తప్పదని పేర్కొన్నారు. దీంతో కరోనా దెబ్బకు ఆదాయాలు కోల్పోయిన వారు .. మారటోరియం ఎంచుకుంటే మరింత కాలం రుణాల భారం మోయాల్సి రానుంది. మారటోరియం వ్యవధిలో మిగతా బాకీపై వడ్డీల వడ్డన కొనసాగుతుందని ఖాతాదారులకు ప్రభుత్వ రంగ ఎస్‌బీఐ తెలియజేసింది. సోదాహరణంగా వివరించింది. ఉదాహరణకు రూ. 30 లక్షల గృహ రుణం చెల్లించడానికి మరో 15 ఏళ్ల వ్యవధి ఉందనుకుందాం. మూడు నెలల మారటోరియం తీసుకుంటే.. నికరంగా అదనంగా మరో రూ. 2.34 లక్షలు వడ్డీ కట్టాల్సి వస్తుంది. ఇది సుమారు 8 నెలల ఈఎంఐలకు సమానం. అలాగే, రూ. 6 లక్షల వాహనం రుణం రీపేమెంట్‌కు 54 నెలలు మిగిలి ఉందనుకుందాం. దీనిపై అదనంగా రూ.19,000 అదనపు వడ్డీ భారం పడుతుంది. ఇది అదనంగా 1.5 ఈఎంఐకు సమానం.

కరోనాపై కార్పొరేట్ల పోరు

విప్రో, ప్రేమ్‌జీ ఫౌండేషన్ 1,125 కోట్లు

న్యూఢిల్లీ: కరోనా కారణంగా ఏర్పడిన ముప్పును అధిగమించేందుకు విప్రో కంపెనీ, విప్రో ఎంటర్‌ప్రైజెస్, ఆ సంస్థల ప్రమోటర్‌కు చెందిన అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సంయుక్తంగా రూ.1,125 కోట్లను ఖర్చు చేసేందుకు సంసిద్ధత ప్రకటించాయి. ఇందులో విప్రో కంపెనీ రూ.100 కోట్లు, విప్రో ఎంటర్‌ప్రైజెస్ రూ.25 కోట్లు, అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ రూ.1,000 కోట్లను ఖర్చు పెట్టనున్నాయి. విప్రో వార్షికంగా కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద చేసే ఖర్చుకు అదనంగా ఈ మొత్తాన్ని వెచ్చించనుంది.

భారతీ ఎంటర్‌ప్రైజెస్ రూ.100 కోట్లు

కరోనాపై పోరులో భారతీ ఎంటర్‌ప్రైజెస్ కూడా చేరిపోయింది. రూ.100 కోట్ల సాయాన్ని ప్రకటించింది. ప్రభుత్వరంగ పవర్‌గ్రిడ్ సంస్థ కూడా పీఎం కేర్స్‌కు తొలి విడతగా రూ.130 కోట్లను అందించింది. మరో రూ.70 కోట్లను 2020-21లో ఇవ్వనున్నట్టు తెలిపింది. అలాగే, ఇఫ్కో రూ.25 కోట్లు, క్రిబ్కో రూ.2 కోట్లు, ఎన్‌ఎఫ్‌ఎల్-కిసాన్ రూ.64 లక్షలు, కల్యాణి గ్రూపు రూ.25 కోట్లను పీఎంకేర్స్‌కు ప్రకటించాయి.

ఎల్‌ఐసీ రూ.105 కోట్లు..

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కరోనాపై యుద్ధంలో పాలుపంచుకుంటోంది. పీఎం-కేర్స్ ఫండ్‌కు రూ.105 కోట్ల విరాళం ఇచ్చినట్టు ప్రకటించింది. మొత్తం విరాళంలో రూ.5 కోట్లు గోల్డెన్ జూబ్లీ ఫండ్ నుంచి సమకూర్చినట్టు ఎల్‌ఐసీ చైర్మన్ ఎం.ఆర్.కుమార్ తెలిపారు.

ఎస్‌బీఐ రూ.100 కోట్లు..

దేశంలోనే అతిపెద్ద బ్యాంకు, ప్రభుత్వరంగ సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సైతం రూ.100 కోట్లను పీఎంకేర్స్‌కు ప్రకటించింది.

ఎల్‌జీ ఉచిత భోజన ఏర్పాట్లు..

లాక్‌డౌన్ నేపథ్యంలో దినసరి కూలీలు, వలస కార్మికుల సహాయార్థం కన్జ్యూమర్ డ్యూరబుల్స్ బ్రాండ్ ఎల్‌జీ దేశవ్యాప్తంగా 10 లక్షల మందికి భోజన ఏర్పాట్లను అందిస్తుంది. ఈ మేరకు అక్షయ పాత్ర ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఎంపిక చేసిన 50 రాష్ట్రాల్లోని ఆయా ఆసుపత్రుల్లో ఐసోలేషన్, క్వారంటైన్ వార్డుల్లో వాటర్ ప్యూరిఫయర్స్, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, టెలివిజన్లను అందించనున్నట్లు ఎల్‌జీ ఇండియా ఎండీ యంగ్ లాక్ కిమ్ తెలిపారు.

పుణేలో మెర్సిడెజ్ బెంజ్ కోవిడ్ ఆసుపత్రి

ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ మెర్సిడెజ్ బెంజ్ పుణేలో తాత్కాలిక కరోనా ఆసుపత్రిని ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించింది. చకాన్ ఖేడ్‌లోని మహలుంగే-ఇంగాలే గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఈ హాస్పటల్‌లో 1,500 మంది కరోనా రోగులకు చికిత్స అందించవచ్చని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. మహారాష్ట్ర సీఎం రిలీఫ్ ఫండ్‌కు మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఉద్యోగుల ఒకరోజు వేతనాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది.

రామ్‌కో ఐసోలేషన్ సెంటర్లు

రామ్‌కో సిమెంట్స్ లిమిటెడ్ తయారీ కేంద్రాల్లో పనిచేసే కార్మికులకు, వలస కూలీలకు మాస్కులు, బియ్యం, కూరగాయలు వంటి నిత్యావసరాలను అందిస్తున్నట్లు తెలిపింది. తమిళనాడు, ఒడిశాలోని రామ్‌కో ప్లాంట్ వద్ద ఐసోలేషన్ సెంటర్లను ఏర్పాటు చేసి కార్మికులకు, స్థానిక గ్రామస్తులకు వైద్య సేవలు అందిస్తుంది. రూ.3 కోట్ల వ్యయంతో వైద్య పరికరాలు అందిస్తున్నట్లు కంపెనీ తెలిపింది.

ఓలెక్ట్రా రూ.17 లక్షలు..

కరోనా కట్టడిలో భాగంగా ప్రభుత్వానికి సాయంగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ ఓలెక్ట్రా గ్రీన్‌టెక్ నడుం బిగించింది. పీఎం కేర్స్ ఫండ్‌కు రూ.17.26 లక్షల మొత్తాన్ని విరాళంగా అందించింది. ఇందులో ఉద్యోగుల ఒకరోజు వేతనం రూ.7.26 లక్షలు, కంపెనీ రూ.10 లక్షలు సమకూర్చిందని ఓలెక్ట్రా ఈడీ ఎన్.నాగసత్యం తెలిపారు.

మార్చిలో జీఎస్టీ వసూళ్లు రూ.97,597కోట్లు

లాక్డౌన్ పరిస్థితుల్లో తగ్గిన వసూళ్లు

న్యూఢిల్లీ: దేశవ్యాప్త లాక్డౌన్ జీఎస్టీ వసూళ్లపై ప్రభావం చూపించింది. మార్చి నెలకు రూ.97,597 కోట్లు వసూలైంది. ఇందులో.. రూ.19,183 కోట్లు సీజీఎస్టీ కింద, రూ.25,601 కోట్లు ఎస్జీఎస్టీ కింద, రూ.44,508 కోట్లు ఐజీఎస్టీ కింద, రూ.8,306 కోట్లు సెస్సు రూపంలో వసూలైనట్టు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. 2019 నవంబర్ నుంచి 2020 ఫిబ్రవరి వరకు ప్రతీ నెలా జీఎస్టీ వసూళ్లు రూ.లక్ష కోట్లకు పైనే ఉండడం గమనార్హం. ఇక ఈ ఏడాది ఫిబ్రవరిలో 83 లక్షల జీఎస్టీ రిటర్నులు నమోదు కాగా, మార్చిలో 76.5 లక్షలకు తగ్గాయి.

వాహన విక్రయాలు లాక్'డౌన్'

- ప్రభావం చూపిన లాక్‌డౌన్
- భారీగా తగ్గిన వాహన అమ్మకాలు

న్యూఢిల్లీ: కరోనా కట్టడికి నిర్దేశించిన లాక్‌డౌన్ మార్చి వాహన విక్రయాలపై తీవ్రంగానే ప్రభావం చూపించింది. దీనికితోడు బీఎస్6 పర్యావరణ నిబంధనలు అమల్లోకి రానుండటంతో వాహన అమ్మకాలు భారీగానే తగ్గాయి.మారుతీ సుజుకీ, హ్యుందాయ్ అమ్మకాలు దాదాపు సగం వరకూ తగ్గగా, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టయోటా కిర్లోస్కర్ (టీకేఎమ్) కంపెనీల అమ్మకాలు 40-90% రేంజ్‌లో క్షీణించాయి.

వాహన విక్రయాల క్షీణత ఇలా...

కంపెనీ	మార్చి,2020	మార్చి, 2019	క్షీణత (%)
మారుతీ సుజుకీ	79,080	1,47,613	-47
హ్యుందాయ్	26,300	44,350	-41
మహీంద్రా	6,130	59,012	-90
టాటా మోటార్స్	11,012	68,727	-84
టయోటా	7,023	12,818	-45
రాయల్ ఎన్‌ఫీల్డ్	35,814	60,831	-41

బీఎస్-6 ఇంధనం వచ్చేసింది..

- దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లోనూ విక్రయం
- పాత రేటుకే అమ్మకం
- చమురు కంపెనీల వెల్లడి

న్యూఢిల్లీ: వాహన కాలుష్యాన్ని మరింత తగ్గించే బీఎస్-6 ప్రమాణాల పెట్రోల్, డీజిల్ విక్రయాలు దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యాయి. దీంతో శుద్ధమైన ఇంధనాన్ని వినియోగిస్తున్న అతి తక్కువ దేశాల సరసన భారత్ కూడా చేరింది. రేటులో మార్పులు లేకుండా పాత ధరకే వీటిని విక్రయిస్తున్నట్లు చమురు మార్కెటింగ్ కంపెనీలు తెలియజేశాయి. సాధారణంగా లీటరుకు కనీసం రూ. 1 పెంచాల్సి ఉన్నప్పటికీ అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గిన నేపథ్యంలో ఆ మేరకు సర్దుబాటు చేసినట్లు పేర్కొన్నాయి. 'దేశవ్యాప్తంగా మాకున్న 68,700 పెట్రోల్ బంకుల్లో నూటికి నూరు శాతం బీఎస్-6 పెట్రోల్, డీజిల్ విక్రయాలు జరుపుతున్నాం' అని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) చైర్మన్ సంజీవ్ సింగ్ తెలిపారు. కాలుష్య ప్రమాణాలు మారినా.. రేటులో మార్పేమీ లేదని చెప్పారు. ఐవోసీకి దాదాపు సగం మార్కెట్ వాటా ఉంది. కేవలం మూడేళ్ల వ్యవధిలోనే బీఎస్-4 ప్రమాణాల నుంచి బీఎస్-6కి మారిన ఘనత భారత్‌కు మాత్రమే దక్కుతుందని సింగ్ చెప్పారు. వాస్తవానికి ప్రభుత్వం నిర్దేశించిన ఏప్రిల్ 1 డెడ్‌లైన్ కన్నా మూడు వారాల ముందునుంచే బీఎస్-6 అమ్మకాలు ప్రారంభించామన్నారు. అటు బీపీసీఎల్ కూడా తమ 16,000 పెట్రోల్ బంకుల్లో బీఎస్-6 గ్రేడ్ ఇంధన విక్రయాలు ప్రారంభించినట్లు తెలిపింది. నవరి నుంచే తమ రిఫైనరీల్లో కొత్త గ్రేడ్ ఇంధన ఉత్పత్తి ప్రారంభమైందని, ప్రస్తుతం తమకున్న మొత్తం 16,400 పైచిలుకు బంకుల్లో దీని విక్రయం మొదలుపెట్టామని హెచ్‌పీసీఎల్ సీఎండీ ఎంకే సురానా తెలిపారు. 2010లో యూరో3కి సరిసమానమైన బీఎస్-3 ఇంధనాలు అందుబాటులోకి వచ్చాయి. అటు పైన బీఎస్-4కి మళ్లడానికి ఏడేళ్లు పట్టింది. ఆ తర్వాత బీఎస్-5 జోలికి వెళ్లకుండా దానికన్నా మెరుగైన బీఎస్-6 ఇంధనాలు వచ్చాయి. పాత ఇంధనాలతో పోలిస్తే బీఎస్-6లో కాలుష్యకారక సల్ఫర్ పరిమాణం అత్యంత తక్కువగా 10 పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్) ఉంటుంది. బీఎస్-3లో 350 కాగా.. బీఎస్-4లో 50 పీపీఎం.

దివాలా అంచున ఎయిర్‌లైన్స్

- తక్షణం ఆదుకోకపోతే పలు సంస్థల మూసివేత
- కేంద్ర మంత్రులకు ఫిక్కీ లేఖ
- సహాయక చర్యలకు విజ్ఞప్తి

న్యూఢిల్లీ: కరోనా వైరస్ దెబ్బకు విమానయాన రంగం తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటోంది. ఫ్లయిట్ స

కరోనా లాక్‌డౌన్‌తో బుధవారం నిర్మానుష్యంగా వున్న బయోడైవర్సిటీ చౌరస్తా

అధిక ధరలను కట్టడి చేయడంలో అధికారులు విఫలం

కొండెక్కిన చేపల ధరలు



సాక్షి, హైదరాబాద్: చేపల ధరలు కొండెక్కికూర్చున్నాయి. కరోనా కారణంగా గత కొద్ది రోజులనుంచి ఎక్కడా కనిపించని చేపలు బుధవారం అక్కడక్కడా విక్రయానికి వచ్చాయి. అయితే ధరలు మాత్రం అమాంతం పెరిగిపోయాయి. రవ్వ, బొచ్చ, బంగారుతీగ చేపల ధరలు కిలో రూ. 200 దాటిపోయాయి. కొర్రమీను ఏకంగా 700 నుంచి 800 వరకు పలికింది. ఏపీ నుంచి చేపలు వస్తుండటం, తెలంగాణ మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకపోవడంతో ధరలు ఇలా పెరిగిపోయాయని వ్యాపారులు అంటున్నారు. ధరలను అందుబాటులో ఉంచుతామని చెబుతున్న అధికారులు కట్టడి చేయడంలో విఫలమయ్యారు. అధిక ధరలను కట్టడిచేసి చేపలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

త్వరలో ధరలు అందుబాటులోకి..

'కరోనా నేపథ్యంలో తెలంగాణ మత్స్యకారులు చేపలు పట్టడంలేదు. దీంతో డిమాండ్ కారణంగా కొంత మేర ధరలు పెరిగాయి. ఆదివారంలోగా ధరలు తగ్గుముఖం పడతాయి. మంత్రి, కమిషనర్ ఆదేశాల మేరకు కరోనా నేపథ్యంలో పాటించాల్సిన నిబంధనలు, ధరలపై హైదరాబాద్‌లో మత్స్యకారులతో సమావేశం ఏర్పాటు చేశాం. ధరలపై సుదీర్ఘంగా చర్చించాం'అని అధికారులు తెలిపారు. కాగా, ఏపీ నుంచి సరుకులు తీసుకొచ్చే వాహనాలు దొరకడం లేదని, రవాణా భారం ఖర్చు చేపల ధరలతో కలిపి అమ్మాల్సి వస్తోందని విక్రయదారులు అంటున్నారు.

ధరలు ఇలా..

	రవ్వ	బొచ్చ	బంగారు తీగ	కొర్రమీను	రొయ్యలు	జల్ల
గతంలో	120 నుంచి 160	140 నుంచి 180	130 నుంచి 160	400 నుంచి 600 పెద్దవి	300 నుంచి 350	70 నుంచి 100
ప్రస్తుతం	200 నుంచి 250	220 నుంచి 250	230 నుంచి 260	700 నుంచి 800	400 నుంచి 500	150 నుంచి 180

యువకులపై పంజా

దేశంలో 20 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు వారిపైనే ప్రతాపం	1,751 కేసుల్లో.. 614 కేసులను విశ్లేషించిన 'కరోనా ట్రాకర్'	వెబ్‌సైట్ ప్రకారం 20 నుంచి 30 ఏళ్లవారు 157 మంది
30 నుంచి 40 ఏళ్ల వారు 129 మంది	దేశంలో కరోనా మరణాల రేటు 3.03 శాతం..	తెలంగాణలో రెట్టింపుగా నమోదైన మరణాల రేటు



సాక్షి, హైదరాబాద్: దేశంలో యువకులపై కరోనా పంజా విసురుతోంది. ప్రధానంగా 20 నుంచి 40 ఏళ్ల వయసు వారిపైనే తన ప్రతాపం చూపుతోంది. దేశంలో కరోనా కేసులను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ, వాటి వివరాలు ట్రాక్ చేస్తున్న 'కరోనా ట్రాకర్' అనే వెబ్‌సైట్ పాజిటివ్ కేసుల వివరాలను విశ్లేషించింది. ఆ విశ్లేషణ దేశవ్యాప్తంగా బుధవారం సాయంత్రం 6 గంటల వరకు మొత్తం 1,751 కేసులు నమోదు కాగా.. 614 కేసులను విశ్లేషించింది. మిగిలిన కేసులకు సంబంధించిన వయసు, తదితర వివరాలు సమగ్రంగా లేకపోవడంతో 614 కేసులనే విశ్లేషించగలిగింది. ఈ కేసుల్లో 20 నుంచి 30 ఏళ్ల వయసున్నవారు 157 మంది ఉన్నారని తేల్చింది. 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు వారు 129 మంది ఉన్నారని తెలిపింది. ఆ తర్వాత 40 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు వారు 97, 50 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు వారు 96 మంది ఉన్నారు. 60 నుంచి 70 మధ్య వయసు వారు 72 మంది ఉన్నారని వెబ్‌సైట్ విశ్లేషించింది. అత్యంత తక్కువగా 80 నుంచి 100 ఏళ్ల మధ్య వయసు వారు ఏడుగురు కాగా, 10 ఏళ్లలోపు వారు 15 మంది ఉన్నారు. 70 నుంచి 80 ఏళ్ల వయసు వారు 18 మంది ఉన్నారు. 10 నుంచి 20 ఏళ్ల మధ్య వయసు వారు 23 మంది ఉన్నారు. అంటే అత్యంత ఎక్కువగా యుక్త వయస్కులకే కరోనా వ్యాపించిందని వెబ్‌సైట్ తెలిపింది. అయితే మరణాలు ఏ వయసు వారిలో ఎక్కువ ఉన్నాయన్న దానిపై విశ్లేషించలేదు. అంతర్జాతీయ విశ్లేషణల ప్రకారం 70 ఏళ్లు దాటినవారే అధికంగా మరణిస్తున్నారని తెలిపింది.

నెల రోజుల్లో భారీగా పెరిగిన కేసులు..

దేశంలో కేసుల సంఖ్య నెల రోజుల్లో అనేక రెట్లు పెరిగాయని వెబ్‌సైట్ విశ్లేషించింది. మార్చి 1 నుంచి ఏప్రిల్ 1 నాటికి ఎన్ని కేసులు పెరిగాయో తెలిపింది. మార్చి 1 నాటికి దేశంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 5 మాత్రమే ఉన్నాయని తెలిపింది. ఆ సంఖ్య మార్చి 10వ తేదీ నాటికి ఏకంగా 48కు చేరాయి. మార్చి 20 నాటికి 199కి చేరాయి. మార్చి 31 నాటికి 1,619 కాగా, బుధవారం సాయంత్రానికి (ఏప్రిల్ 1 సాయంత్రం 6 గంటల వరకు) ఆ సంఖ్య 1,751కు చేరడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. అత్యధికంగా మహారాష్ట్రలో 325 కేసులు నమోదు కాగా, 12 మంది చనిపోయారు. 39 మంది కోలుకున్నారు. ఆ తర్వాత కేరళలో 241 మందికి కరోనా పాజిటివ్ రాగా, అందులో 24 మంది కోలుకోగా, ఇద్దరు చనిపోయారు. తమిళనాడులో 124 మందికి కరోనా పాజిటివ్ రాగా, ఆరుగురు కోలుకున్నారు. ఒకరు చనిపోయారు. ఢిల్లీలో 123 మందికి కరోనా వైరస్ సోకగా, ఆరుగురు కోలుకున్నారు.. ఇద్దరు చనిపోయారు. రాజస్థాన్‌లో 106 మందికి పాజిటివ్ రాగా, ముగ్గురు కోలుకున్నారు. ఎవరూ చనిపోలేదు. కర్ణాటకలో 105 మందికి పాజిటివ్ రాగా, 9 మంది కోలుకున్నారు.. ఇద్దరు చనిపోయారు. ఉత్తరప్రదేశ్‌లో 104 మందికి పాజిటివ్ రాగా, 17 మంది కోలుకున్నారు.. ఒకరు చనిపోయారు. తెలంగాణలో 97 మందికి పాజిటివ్ రాగా, 14 మంది కోలుకున్నారు. ఆరుగురు చనిపోయారని వెబ్‌సైట్ నివేదిక తెలిపింది.

తెలంగాణలో మరణాల రేటు రెట్టింపు

దేశంలో కరోనా కేసుల సంఖ్య 1,751 కాగా, వారిలో 53 మంది చనిపోయారని వెబ్‌సైట్ తెలిపింది. అంటే దేశంలో మరణాల రేటు 3.03 శాతంగా ఉన్నట్లు తేల్చింది. తెలంగాణలో 97 మందికి కరోనా సోకగా, వారిలో ఇప్పటివరకు ఏడుగురు చనిపోయారు. అంటే దేశవ్యాప్త కరోనా మరణాల రేటు కంటే రాష్ట్రంలో దాదాపు రెట్టింపు.. అంటే ఆరు శాతం కంటే ఎక్కువ ఉండటం గమనార్హం. ఇక కరోనా పాజిటివ్ వచ్చి కోలుకున్నవారు దేశంలో 155 మంది ఉన్నారు. అంటే రికవరీ రేటు 8.85 శాతం ఉన్నట్లు వెబ్‌సైట్ పేర్కొంది.

కేసీఆర్ తాతా కనికరించవా?

జీతం కోతపై ఓ ఉపాధ్యాయుడి కుమార్తె వేడుకోలు

హన్మకొండ: కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు విధించిన లాక్‌డౌన్‌లో భాగంగా ఉద్యోగుల వేతనాల్లో కోత విధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వరంగల్ అర్బన్ జిల్లాలోని ఓ ఉపాధ్యాయుడి కుమార్తె ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి పోస్టర్ ద్వారా అభ్యర్థిస్తోంది. జిల్లాలోని కమలాపూర్ బాలికల ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు కూరపాటి సత్యప్రకాశ్‌రావు హన్మకొండ నయీంనగర్‌లో నివాసముంటున్నారు. ఉపాధ్యాయురాలైన ఈయన భార్య సునీత ఫిబ్రవరి 22న మృతిచెందింది. ఈ బాధలో ఉన్న తమపై ఇప్పుడే జీతాల కోతతో మరోసారి బాధ పెట్టొద్దు కేసీఆర్ తాత అంటూ సత్యప్రకాశ్‌రావు కూతురు లాస్య ప్లకార్డు ప్రదర్శిస్తున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రతి ఒక్కరి మనస్సును కదిలిస్తోంది.

టిక్‌టాక్ భారీ విరాళం

రూ. వంద కోట్ల విలువైన సూట్లు, మాస్కులు అందిస్తామని హామీ

సాక్షి, హైదరాబాద్: కరోనా వైరస్ కట్టడికి భారత్ చేస్తున్న ప్రయత్నాలకు టిక్‌టాక్ భారీ విరాళం ప్రకటించింది. కరోనా బాధితులకు సేవలందిస్తున్న వైద్యులకు సుమారు నాలుగు లక్షల హజ్మత్ సూట్‌లు, రెండు లక్షల మాస్కు లు సమకూర్చేందుకు సిద్ధమైంది. వీటి విలువ సుమారు వంద కోట్ల రూపాయల వరకూ ఉంటుందని అంచనా. కరోనాను ఎదుర్కొనేందుకు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పోరు లో వైద్యులు ముందు వరుసలో ఉన్నారని, వారు సురక్షితంగా ఉండటం అత్యవసరమని టిక్‌టాక్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని నాలుగు లక్షల ప్రత్యేక హజ్మత్ సూట్లు, రెండు లక్షల మాస్కులు వైద్యులకు అందించాలని నిర్ణయిం చినట్లు తెలిపింది. కేంద్ర జౌళి శాఖ సహకారం తో తాము నిర్ణీత ప్రమాణాలతో కూడిన సూట్లు, మాస్కులు సిద్ధం చేశామని, వీటిని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు అందజేయనున్నామని టిక్‌టాక్ వివరించింది.

ప్రవేశ పరీక్షల దరఖాస్తు గడువు పొడిగింపు

కొత్త తేదీలు ప్రకటించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ

సాక్షి, హైదరాబాద్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ).. వివిధ ప్రవేశ పరీక్షల దరఖాస్తుల గడువును పొడిగించింది. కొన్నింటిని ఈనెల 30 వరకు, కొన్ని పరీక్షలకు వచ్చే నెల 15, 16, 31 తేదీల వరకు గడువును పెంచింది.

- మార్చి 31తో ముగిసిన నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ జేఈఈ దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 30 వరకు పొడిగించారు.
- ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ పీహెచ్‌డీ, ఎంబీఏ ప్రవేశాలకు నిర్వహించాల్సిన అడ్మిషన్ టెస్టు దరఖాస్తుల స్వీకరణ గడువు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్, జేఎన్‌యూ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల గడువు కూడా ఈనెల 30 వరకు పొడిగించారు.
- యూజీసీ నెట్ (జూన్) దరఖాస్తుల గడువును మే 16కి పొడిగించారు.
- సీఎస్ఐఆర్ నెట్ దరఖాస్తుల గడువు మే 15కి, ఆల్‌ఇండియా ఆయుష్ పోస్టు గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్టు (ఏఐఏపీజీఈటీ) దరఖాస్తు గడువును మే 31కి పెంచారు.

ఈనెల 14 వరకు జేఈఈ దరఖాస్తుల్లో పొరపాట్ల సవరణ

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్ ఆన్‌లైన్ దరఖాస్తుల్లో పొరపాట్ల సవరణకు ఈనెల 14వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తెలిపింది. అభ్యర్థులు నిర్ణీత ఫీజు చెల్లించి జేఈఈ మెయిన్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తుల్లో పొరపాట్లను సవరించుకోవాలని సూచించింది.

ఓయూ డిగ్రీ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 28 నుంచి జరగాల్సిన డిగ్రీ కోర్సుల సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొ. శ్రీరాం వెంకటేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కోర్సులతో పాటు ఇతర కోర్సుల పరీక్షలు సైతం నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. తిరిగి పరీక్షలు నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు.

కరోనాపై 'ఇన్నోవేషన్ చాలెంజ్'

- టి-హబ్, సీసీఎంబీ భాగస్వామ్యంతో విద్యార్థులకు అవకాశం
- కరోనా వ్యాప్తిని నిరోధించే కొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కరోనా వ్యాప్తి నిరోధానికి అవసరమైన పరిష్కారాలు కనుగొనడంలో విద్యార్థులను కూడా భాగస్వాములను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బాధ్యతను ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖకు అనుబంధంగా పనిచేస్తున్న 'టి-హబ్'కు అప్పగించారు. సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్(సీసీఎంబీ) భాగస్వామ్యంతో విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు చేసేలా టి-హబ్ ప్రోత్సహిస్తుంది. దీనికి ఐటీ శాఖ అనుబంధ విభాగం ఎమర్జింగ్ టెక్నాలజీస్ కూడా సహకారం అందిస్తుంది. 'కరోనా ఇన్నోవేషన్ చాలెంజ్'గా పిలిచే ఈ కార్యక్రమంలో అన్ని కాలేజీల విద్యార్థులు పాల్గొనే అవకాశాన్ని టి-హబ్ కల్పించింది. కరోనా వైరస్ గుర్తింపు, చికిత్స లేదా వైరస్ వ్యాప్తిని నియంత్రించేందుకు అవసరమైన పరిష్కారం ఇలా ఏ అంశంలోనైనా విద్యార్థులు తమ ఆవిష్కరణ ద్వారా పరిష్కారం చూపాల్సి ఉంటుంది.

ఆవిష్కరణలకు వ్యాపార రూపం

కరోనా ఇన్నోవేషన్ చాలెంజ్‌లో భాగంగా వైరస్ సోకిన వారిని సులభంగా గుర్తించడం, తక్కువ ఖర్చుతో పాటు ఆచరణ సాధ్యమయ్యే చికిత్సా విధానం వంటి అంశాల్లో ఆవిష్కరణలు చేయాల్సి ఉంటుంది. వైరస్ సోకిన వారిని నిరంతరం ట్రాక్ చేయడం, ఇతరులకు సోకకుండా వ్యాధి గ్రస్తులను దూరంగా ఉంచడం వంటి అంశాలపై విద్యార్థులు దృష్టి కేంద్రీకరించి పరిష్కారం చూపాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో భాగంగా వచ్చిన ఆవిష్కరణలను వడపోసి అత్యంత వినూత్నం, వైవిధ్యంగా ఉండే రెండింటిని ఎంపిక చేస్తారు. వీటిని సీసీఎంబీ, క్యూ సిటీ, ఎమర్జింగ్ టెక్నాలజీ విభాగం, టి-హబ్ కూలంకషంగా అధ్యయనం చేసి వ్యాపారానికి అనువుగా తీర్చిదిద్దేందుకు సహకరిస్తాయి. వడపోతలో ఎంపికైన విద్యార్థులను టి-హబ్ నిర్వహిస్తున్న క్యూరేటెడ్ మెంటార్‌షిప్ ప్రోగ్రామ్‌లో భాగస్వాములను చేస్తారు. రాష్ట్రంలోని విద్యార్థులు కరోనా ఇన్నోవేషన్ చాలెంజ్ ద్వారా కొత్త ఆవిష్కరణలు జరిపేందుకు టి-హబ్ అవకాశాన్ని ఇస్తోంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో పనిచేస్తున్న క్యూ-సిటి, గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్, సీసీఎంబీతో పాటు ఇతర కార్పొరేట్ సంస్థలతో ఎంపికైన విద్యార్థులు కలిసి పనిచేసే అవకాశం లభిస్తుందని టి-హబ్ వర్గాలు వెల్లడించాయి.

ఒకే సిలిండర్ నుంచి ఆరుగురికి ఆక్సిజన్

వినూత్న పరికరాన్ని అభివృద్ధి చేసిన విశాఖ నావల్ డాక్‌యార్డ్

మల్టీ ఫీడ్ ఆక్సిజన్ మనిఫోల్డ్ పరికరాలు

సాక్షి, అమరావతి: కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో ఒకే ఆక్సిజన్ సిలిండర్ నుంచి ఆరుగురికి ఆక్సిజన్ అందించే వినూత్నమైన పరికరాన్ని విశాఖ నావల్ డాక్‌యార్డ్ అభివృద్ధి చేసింది. మల్టీఫీడ్ ఆక్సిజన్ మెనిఫోల్డ్ (ఎంవోఎం) పేరిట ఈ పరికరాన్ని ఆవిష్కరించింది. సాధారణంగా ఆస్పత్రుల్లో ప్రతీ బెడ్‌కు పైప్ ద్వారా ఆక్సిజన్ అందించే సదుపాయం ఉంటుంది. కానీ ప్రస్తుత అత్యవసర పరిస్థితుల్లో కాలేజీలు, హోటల్స్, కళ్యాణ మండపాలు వంటి చోట్ల ఏర్పాటు చేసే ఆస్పత్రుల్లో ప్రతీ రోగికీ ఒక ఆక్సిజన్ సిలిండర్ ఏర్పాటు చేయడం కష్టంతో కూడిన పని. దీన్ని దృష్టిలో పెట్టుకుని నావల్ డాక్‌యార్డ్ సిబ్బంది ఈ ఎంవోఎం పరికరాన్ని అభివృద్ధి చేసి పరీక్షించారు. ఇది సత్ఫలితాన్ని ఇవ్వడంతో సుమారు 25 ఎంవోఎం పరికరాలు ఏపీ ప్రభుత్వానికి ఉచితంగా అందచేయాలని నేవీ అధికారులు నిర్ణయించినట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ తెలిపారు. సాధారణంగా కరోనా బారిన పడ్డ వారిలో 5 నుంచి 8 శాతం మందికి మాత్రమే వెంటిలేటర్ల అవసరం ఉంటుంది. మిగిలిన వారికి ఆక్సిజన్ అందిస్తే సరిపోతోంది. ఇలాంటి సమయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఐసోలేషన్ సెంటర్లకు ఎంవోఎం చక్కగా ఉపయోగపడుతుందని నేవీ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం నావల్ డాక్‌యార్డ్ 10 ఎంవోఎంలను తయారు చేస్తోంది.

ప్రముఖ సెఫాలజిస్టు డాక్టర్ వేణుగోపాల్‌రావు కన్నుమూత

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ సెఫాలజిస్ట్, సెంటర్ ఫర్ సెఫాలజీ స్టడీస్ చైర్మన్ డాక్టర్ వేణుగోపాల్‌రావు బుధవారం ఉదయం కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన తెలుగు రాష్ట్రాల్లో జరిగిన పలు ఎన్నికల్లో ముందస్తు ఎన్నికల సర్వేలు జరిపి ఓటర్ల నాడిని అంచనా వేసి కచ్చితమైన ఫలితాలు వెలువరించేవారు.

ఇరు రాష్ట్రాల సీఎంల సంతాపం..

వేణుగోపాల్‌రావు మరణం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన చెప్పిన అనేక సర్వేల ఫలితాలు వాస్తవానికి దగ్గరగా వచ్చాయని సీఎం గుర్తు చేసుకున్నారు. వేణుగోపాల్‌రావు కుటుంబీకులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అదే విధంగా ఏపీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి కూడా ఓ ప్రకటనలో వేణుగోపాల్‌రావు మృతికి సంతాపం వ్యక్తపరిచారు. కాగా సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వేల నిర్వహణలో గొప్ప ప్రతిభా పాటవాలు కలిగిన వేణుగోపాల్‌రావు తనకు చిరకాల మిత్రుడని మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు.ఢిల్లీ జేఎన్‌యూలో తనకు జూనియర్ విద్యార్థి అని పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

ధనిక రాష్ట్రంలో జీతాలకు కోతలా?

- ఉద్యోగుల వేతనాల్లో కోత విధించడాన్ని టీపీసీసీ వ్యతిరేకిస్తోంది
- ఈ అంశంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి: ఉత్తమ్
- ఆర్థిక స్థితిపై సర్కార్ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
- ప్రభుత్వ ఖర్చు కంటే దాతల విరాళాలే ఎక్కువ: భట్టి

సాక్షి, హైదరాబాద్: ధనిక రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల వేతన చెల్లింపులకు కష్టాలొచ్చాయని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. దేశంలోనే తెలంగాణను ధనిక రాష్ట్రంగా చెప్పుకునే ముఖ్యమంత్రి ఇప్పుడు ఉద్యోగులకు కేటగిరీల వారీగా కోత విధించి వారిని ఇబ్బందుల్లోకి నెట్టారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల్లో కోత విధించడాన్ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, ఈ అంశంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం గాంధీభవన్‌లో సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో కలసి మీడియాతో మాట్లాడారు. ఉద్యోగుల వేతనాల చెల్లింపుల్లో కోతలు విధించడాన్ని తప్పుబట్టిన ఉత్తమ్.. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితిపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఆదాయం అంత పతనమవుతుందా?

'కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ ప్రకటించాయి. ప్రభుత్వం తీసుకున్న లాక్‌డౌన్ నిర్ణయానికి కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. అయితే లాక్‌డౌన్ కాలంలో ఆదాయం లేదనే కారణంతో ఉద్యోగులకు ఇచ్చే నెలవారీ వేతనాల్లో కోతలు పెట్టడం సరికాదు. వారం రోజుల పాటు లాక్‌డౌన్ అయితే ప్రభుత్వ ఆదాయం అంత పతనమవుతుందా? ఉద్యోగులకు నెలవారీగా వేతనాల కింద రూ.3,500 కోట్లు ఇస్తున్నాం. అంత మొత్తాన్ని సర్దుబాటు చేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనం. దేశంలోనే తెలంగాణ ధనిక రాష్ట్రమని సీఎం కేసీఆర్ చాలాసార్లు చెప్పారు. అంతటి ధనిక రాష్ట్రంలో ఉద్యోగులకు వేతనాలివ్వని దౌర్భాగ్యం నెలకొనడం బాధాకరం. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, ఉద్యోగులందరికీ పూర్తి స్థాయి వేతనాన్ని ఇవ్వాలి. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలి. కాళేశ్వరం ప్రాజెక్టుకు దాదాపు రూ.72 వేల కోట్లు ఖర్చు చేశారు. మళ్లీ రూ.22 వేల కోట్లకు టెండర్లు పిలిచారు. ఉద్యోగులకు వేతనాలివ్వని పరిస్థితిలో ఇంత పెద్ద మొత్తంలో పనులకు టెండర్లు పిలవడం గమనార్హం'అని ఉత్తమ్ విమర్శలు గుప్పించారు.

కొత్త ఆస్పత్రులు కట్టలే.. వసతులు కల్పించలే..: భట్టి

అనంతరం సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కరోనా వ్యాధిని అరికట్టేందుకు రూ.10 వేల కోట్లయినా ఖర్చు చేస్తామన్న సీఎం కేసీఆర్.. ఉద్యోగుల వేతనాల్లో కోత పెట్టడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. 'కరోనాతో ప్రభుత్వ ఆదాయంపై ఇప్పటివరకు ఎలాంటి ప్రభావం పడలేదు. వారం పది రోజులు బంద్ పెడితే ఉద్యోగుల జీతాల్లో కోత పెట్టాల్సిన పరిస్థితి రావడం పట్ల రాష్ట్ర ప్రజలు ఆలోచన చేయాలి. ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తున్నాం. కరోనా కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ఖర్చులు చేయలేదు. కొత్తగా ఆస్పత్రులు కట్టలేదు. కనీసం కొత్త మౌలిక వసతులు కల్పించలేదు. అంతలోనే ఆర్థిక వ్యవస్థ ఇంత పతనం కావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం చేసిన ఖర్చు కంటే దాతలు ఇచ్చిన విరాళాలు అధికంగా ఉన్నాయి'అని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక దివాలాకోరుతనాన్ని కప్పిపుచ్చుకునేందుకు కరోనా సంక్షోభమంటూ సాకును చూపుతోందని టీపీసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు మరింత ఎక్కువ కష్టపడుతున్నారని, ఇలాంటి సమయంలో రెట్టింపు వేతనాన్ని ఇవ్వాల్సిన ప్రభుత్వం కోతలు పెట్టడం సరికాదని చెప్పారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com